# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18, సంచిక: 8, ఆగస్టు 2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

**ఆధ్యాత్మిక మాసపత్రిక**

**సంపుటి:** 18 **సంచిక:** 8


**సలహాదారులు, స్ఫూర్తిదాత,**
**కర్త, కర్మ, క్రియ మా ప్రభు**
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040-27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| ఆహ్వానము | 6 |
| లీలామానుష వేషధారి– దుష్టసంహారి.. | 8 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 11 |
| తిరుప్పావై | 22 |
| మహిళల ప్రీతికర పర్వం–రాఖీపర్వం | 29 |
| శుభకర శ్రావణపూర్ణిమ | 31 |
| బాలకృష్ణుడు తన పాదపు బొటనవేలిని చీకటానికి కారణమేమిటి? | 33 |
| రామాయణ రత్నాకరం | 36 |
| ముకుందమాల | 40 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 43 |
| శ్రీకృష్ణ తత్వం | 49 |
| కృష్ణం వందే జగద్గురుమ్ | 51 |
| తిరుమల సర్వస్వం | 53 |
| మట్టి గణపతి నిమజ్జనం– ఏకవింశతి పత్ర పూజా ప్రాశస్త్యం | 58 |
| గజముఖుడు | 61 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# 23వ 7 కోట్ల జప సమర్పణ

భగవంతుని కృపను పొందుటకు ఈ కలియుగంలో ఆయన నామస్మరణ అత్యంత అనుకూలమైన, అమోఘమైన అస్త్రంగా పరిగణించబడుచున్నది. భగవంతుణ్ణి కేవలం భక్తితోనే సాధించాలి తప్ప మరో ఉపాయం లేదు. ముఖ్యంగా ఈ కలియుగంలో భగవంతుడు కేవలం నామస్మరణ కారణంగానే తృప్తి చెందగలడు. నామస్మరణకు ఇతర అర్చనా విధానాల వలె నియమాలు ఉండవు. భక్తుడు తనకు అనుకూలమైన సమయమందు చేయవచ్చును. కాబట్టి ఈ పద్ధతి ఈనాటి మానవులకు అత్యంత సులభమైనది.

ఈ కలియుగంలో మానవుడు తరించాలంటే కేవలం శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ ఒక్కటే ఏకైక మార్గమని భావించి, శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం వారు 2002 సంవత్సరం నుండి ఆయన నామస్మరణకు అవసరమైన జప పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. ఒక్కసారి ఆయన నామము వ్రాయుట వలన మనలో ఎన్నోసార్లు ఆయన నామస్మరణ జరుగునని అంటారు. అందుకే ప్రతి సంవత్సరం కనీసం 70 వేల మంది భక్తులు భాగస్వాములుగా, 7 కోట్ల జపాన్ని సమర్పిస్తున్నాము. ప్రస్తుతం తేది 16-08-2025 గోకులాష్టమి రోజు 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ చేస్తున్నాము. ఒకరోజు ముందు అలిపిరి వద్ద ఇట్టి జపాన్ని స్వామివారి పాదాలకు సమర్పించుదుము. గోకులాష్టమి రోజు టిటిడి డైరీఫాంలో గల శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం వద్ద జప హోమాదులు నిర్వహిస్తాము. జపము వ్రాసినవారి కోరికలను తీర్చమంటూ మా పక్షాన మరోసారి స్వామివారిని ప్రార్థించిన తరువాత టిటిడి ఈఓ గారు ఇట్టి 7 కోట్ల జపమును స్థూపములో సమర్పిస్తారు. ఆ తరువాత భక్తులు తలా కొంత సమర్పించి భక్తుల పక్షాన స్వామివారిని ప్రార్థిస్తారు. స్వామివారి కృప వల్ల ఇది 23వ పర్యాయము. ఆ తరువాత వచ్చే సంవత్సరం కొరకు టిటిడి ఈఓ గారు 24వ పర్యాయంగా 7 కోట్ల జపమునకు శ్రీకారము చుట్టుదురు. ఇలాంటి గొప్ప సేవను ప్రసాదించినందులకు నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి శతకోటి ప్రణామాలర్పిస్తున్నాము. ఈ జప క్రతువులో పాల్గొన్న ప్రతి భక్తుణ్ణి స్వామివారు ప్రత్యేకంగా ఆశీర్వదిస్తున్నారు. కాబట్టి భక్తులు మా వద్దనుండి జప పుస్తకములను పొంది కాని లేదా మీ వద్ద నున్న పేపరు పైన స్వామివారి మహామంత్రాన్ని వ్రాసి స్వామివారు ప్రసాదించిన 7 కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి. తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. ఈ కలియుగ మానవులను రక్షించుటకు వీలుగా తన వైకుంఠ క్రీడా క్షేత్రమునే ఏడు కొండలుగా మార్చి స్థిర నివాసమేర్పరచుకున్నారు. వైకుంఠమును వదలి మన ఉద్ధరణ నిమిత్తము అత్యంత సమీపానికి వచ్చారు. ఆయనను స్మరిస్తే, దర్శిస్తే మన పాపాలు నశిస్తాయి. తిరుమల లాంటి క్షేత్రము, వేంకటేశ్వరుడు లాంటి దేవుడు గతంలో లేరు, భవిష్యత్తులో ఉండబోరు అని మన పురాణాలు ఘోషిస్తున్నాయి. కాబట్టి ప్రతి వ్యక్తీ తన ఈ చిన్న జీవితాన్ని సద్వినియోగం చేయాలంటే స్వామివారి నామస్మరణ చేస్తూ, వీలున్నప్పుడు దర్శించుట ఉత్తమము. గత యుగాలలో ఎన్నో సంవత్సరాలు తపస్సు చేసిన పుణ్యమును మానవుడు ఈ కలియుగములో ఆయన నామస్మరణ వలన పొందగలడు. నమో వేంకటేశాయ! గోవిందా! గోవిందా!

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**– డా॥ కె.వి. రాఘవాచార్యులు**

**శ్లో ॥ తామ్రోదరద్యుతి పరాజిత పద్మరాగౌ**
**బాహ్యై ర్మహోభి రభిభూత మహేంద్ర నీలా**
**ఉద్యన్నఖాంశుభి రుదస్త శశాంక భాసౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యం – వేంకటేశ్వరా! నీ పాదములు అరికాళ్ళలోని ఎర్రని కాంతులచే పద్మరాగమణులను, బయటి నీలపు కాంతులచే ఇంద్రనీలమణులను, గోళ్ళ తెల్లని కాంతుల చేత చంద్రుని జయించినవి. అట్టి నీ శ్రీ పాదములను శరణు వేడుచున్నాను.

**శ్లో ॥ సప్రేమ భీతి కమలాకర పల్లవాభ్యాం**
**సంవాహనేఽపి సపది క్లమ మాదధానౌ**
**కాంతా వవాఙ్మనస గోచర సౌకుమార్యౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యం–వేంకటేశ్వరా!లక్ష్మీదేవిప్రేమతో,భయముతో నీ పాదములను వత్తవలెనని చిగుళ్ళవంటి తన చేతులతో తాకినంతనే నీ పాదములు కందిపోయినవి. సుందరమైనవి, వాక్కుకు, మనస్సుకు అందని సౌకుమార్యము కలిగిన నీ పాదములను శరణు వేడుచున్నాను.

# ముక్తిమార్గము



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

## వరాళి

వాడల వాడల వెంట – వాఁడెవో వాఁడెవో
నీడనుండి చీరలమ్మే – నేఁత బేహారి || పల్లవి ||

1. పంచభూతము లనెడి – పలువన్నె నూలు
చంచలపు గంజితోడ – చరిసేసి,
కొంచెపు కండెలనూలి – గుణముల సేసి
మంచి మంచి చీరలమ్మే – మారు బేహారి || వాడ ||

2. మటు మాయములఁ దన – మగువ పసిడిఁనీరు
చిటిపొటిపాయలుకలఁ – జిలికించఁగా
కుటిలంపుఁ జేఁతలు – కుచ్చులుగాఁగట్టి
పటవాళి చీరలమ్మే – బలుబేహారి || వాడ ||

3. మచ్చిక జీవు లనేటి – మైలసంతలలోన
వెచ్చపు కర్మ ధనము – విలువ చేసి,
పచ్చడాలుగాఁ గుట్టి – బలు వేంకటపతి
ఇచ్చ కొలఁదుల నమ్మే – ఇంటిబేహారి || వాడ ||





భావము – అడుగో! అల్లడుగో! వీధి వీధిల, సందుగొందుల దిరుగుచు నీడ పట్టున నుండి చీరలమ్ము నేత వ్యాపారి అల్లడుగో!

ఆ నేతగానికి పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశము అను పంచభూతములే రంగు రంగుల నూలు. ఆ నూలునతడు చాంచల్యము అను గంజితో గట్టిపరచుచున్నాడు. పిదప సత్త్వ రజ స్తమో గుణములనెడు కండెలతో మంచి మంచి చీరలుగా నేసి మారు బేరమున కమ్ముచున్నాడు.

మాయలమారి యైన అతని భార్య మధ్య మధ్య చిన్న చిన్న జగడములు చేయుచు బంగారు నీరు చిలికించి చీరలకు వన్నెలు వేయుచున్నది. ఆ నేతగాడు వక్రములైన చేష్టలనే కుచ్చులుగా గట్టి నిలువుగను, అడ్డముగను పట్టెలుగల చీరలమ్ముచున్నాడు.

అతని బేరమున కలవాటుపడిన జీవులందరు మైల సంతలలో జేరుదురు. అచట వారి వారి కర్మమను ద్రవ్యమును క్రయముగా నేర్పఱచి పచ్చడములను తయారు చేసి వేంకటేశ్వరుడు అను ఇంటి బేరగాడు తన ఇష్టము వచ్చిన ప్రకారమమ్ముచున్నాడు.

## PROGRAMME AT HYDERABAD

Date : **05-08-2025**

Venue : Namo Venkateshaya, Plot No.9/3, M.Block, Road No. 1 & 2 (1-2-63/10/1) Kakatiya Nagar, Habsiguda, Hyderabad.

Time : 6.00 P.M Onwards Vishnu Sahasra Nama Parayanam

## PROGRAMME AT TIRUPATHI

Date : **15-08-2025** Friday

Venue : Srivari Padala Mandapam, Near Alipiri, Tirupathi

Time : 5.45 P.M Starting of Puja, Vishnu Sahasra Nama Parayanam, submission of **23rd time 7 Crore Japam** at Lotus Feet of Lord Sri Venkateswara.

Date : **16-08-2025** Gokulashtami Day **Saturday**

Venue : Tirumala Tirupathi Devasthanam Dairy Farm, Chandragiri Road, Tirupathi.

Time : 8.00 A.M Starting of Puja, Sri Venkateswara Maha Mantra Yagnam & Vishnu Sahasra Nama Parayanam.

11.30A.M : Yagna Purnahuthi by E.O., TTD.

12.00 P.M : Submission of 23rd time 7 Crore Japam into Sri Venkateswara Divya Maha Mantra Sthupam by Sri E.O., TTD., Tirupathi.

At 12.20 P.M : Initiation of 24th SAPTHA KOTI JAPA SANKALPAM by Executive Office, TTD., Tirupathi. Followed by Prasadam.

*Sri Venkateswara Pada Sevak*

**PULLAGURLA SAI REDDY**

**(GOVINDA DASU)**

*Founder and Organiser*


**Sri Venkateshwara Maha Mantra Peetham**

**93482 12354**

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

త్రయోవింశతి ( 23వ ) పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# ఆహ్వానము





## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇ.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,
హైదరాబాద్-500 007.

040 - 27175050 | 93482 12354, 93488 11223



# నమో వేంకటేశాయ

తిరుమలశ్రీవేంకటేశ్వరునికరుణాకటాక్షములు,దివ్యాశీస్సులు అందరికీ లభించాలనే ఉద్దేశ్యంతో, శ్రీవారి నామస్మరణలోని ఆనందమును అందరూ అనుభవించి తరించాలని, దానికి మేము ఒక సాధనముగా ఉపయోగపడాలనే తపనతో ఆయనకు తనివితీరా సేవ చేయాలని, ఆయన సేవే మా పరమ ధర్మంగా భావించి శ్రీవారికి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపసమర్పణ సంకల్పంలో భాగంగా తిరుమల శ్రీవేంకటేశ్వరునికి **త్రయో వింశతి (23వ) పర్యాయంగా** 7 కోట్ల జప సమర్పణ కొరకై **05-8-2025** రోజున మా ఆఫీస్ / ఇంటి నుండి 23వ పర్యాయంగా 7 కోట్ల జపము తిరుపతికి పంపుదుము. ఇట్టి జపమును టిటిడి వారి సౌజన్యంతో తేది **15-08-2025** నాడు తిరుపతిలో స్వామివారి పాదాలకు సమర్పించి స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర శ్రావణ బహుళ అష్టమి శనివారం అనగా **16-08-2025 గోకులాష్టమి రోజున** తిరుపతిలోని ఎస్.వి.డెయిరీ ఫాంలో, శ్రీవేంకటేశ్వర మహామంత్ర యజ్ఞం చేసి **'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'**లో స్వామివారికి సమర్పించబడును.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

## తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణలోని సంకల్పము

1. శ్రీవేంకటేశ్వరుని నామమును అందరికీ తెలుపుతూ, నిర్మలమైన మనస్సుతో స్మరింప, ధ్యానింప చేయుటకు ప్రయత్నించుట. వారందరినీ శ్రీవారి కరుణా కటాక్షములకు, దివ్యమైన ఆశీస్సులకు, అనుగ్రహానికి పాత్రులుగా చేయుట.
2. భక్తులు తమ కోరికలను తీర్చుకొనుటకు ఒక సాధనముగా ఉపయోగపడుట. శ్రీవారి నామమును స్మరించుట వలన కలిగే ఆనందమును అందరికీ తెలియజేసి కృతార్థులమైనట్లు భావించుట.
3. భక్తులలో శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల భక్తిని పెంపొందించి ఆయనపై అమితమైన విశ్వాసము, సమర్పణ భావాన్ని కలిగించుటకు మరియు భక్తులకు శ్రీవారి సేవ చేయు భాగ్యమును కల్పించుట.
4. ప్రతిసారీ కనీసం 7 కోట్ల జపమును స్వామివారికి సమర్పించి కనీసం 70 వేల మంది భక్తుల కోరికలను తీర్చుమని శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించే భాగ్యమును పొందుట.
5. 2002 నుండి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమును శ్రీవేంకటేశ్వరస్వామికి సమర్పించుచూ 'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'ను శ్రీవారి నామముతో నింపి శ్రీవేంకటేశ్వరుడు మాపై పెట్టిన బాధ్యతను నెరవేర్చినామని సంతోషించుట.
6. శ్రీవేంకటేశ్వరుని నామము విలువ అనంతము. దానికి విలువ కట్టుట మాకు ఈ జన్మకు సాధ్యము కాదు. కాని దాని విలువను కోట్ల జపమునకు సరిపెట్టుమని ప్రార్థించి, అంత జపమును సమర్పించి, ఫలితమాశింపక శ్రీవారి తిరునామములో బిందువులాగా ఇమిడిపోయి ఆ తిలకధారణలోని ఆనందమును అనుభవించుట.
7. ఈ కార్యక్రమములో అందరు భక్తులూ పాలుపంచుకొనేలా ప్రోత్సహించి వారి శక్త్యానుసారం తమ సేవలందించుటకు అవకాశము కల్పించి, నిస్వార్థ సేవతో, ఫలితమాశించకుండా చివరిదాకా సేవ చేయుచూ చిట్టచివరకు ఆ శ్రీవేంకటేశ్వరుని పాదసేవకునిగా మిగిలి అమితానందమును అనుభవించుట.

**శ్రీ వేంకటేశ్వర పాద సేవకుడు**

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

(వ్యవస్థాపకులు శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)

# లీలామానుష వేషధారి – దుష్టసంహారి

# కృష్ణం వందే జగద్గురుమ్

: చింతలపాటి శివశంకరశాస్త్రి

**శ్లో || "యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"**

ధర్మానికి హాని జరిగినా, అధర్మం మితిమీరినా భూమిపై అవతరిస్తానని శ్రీకృష్ణపరమాత్మ గీతలో చెప్పాడు. ఆ విధంగానే దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయాల్సిన పరిస్థితులేర్పడినప్పుడల్లా భగవంతుడు ఈ భూమిపై అవతరిస్తూనే ఉన్నాడు. అలా అనేక రూపాల్లో అవతరించినా, వాటిలో దశావతారాలు ప్రధానమైనవి. దుష్టశిక్షణ కోసం భగవంతుడు దాల్చిన అవతారాలలో ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణావతారం. పరమాత్మ భావాన్ని ప్రదర్శిస్తూనే మానుష ధర్మాలను దెబ్బ తీయకుండా యోగీశ్వరుడిగా సంచరించిన పరిపూర్ణ అవతారం శ్రీకృష్ణావతారం.



''ధర్మస్య ప్రభురచ్యరతః'' అని భీష్ముని మాట. అనగా అచ్యుతుడు ధర్మానికి ప్రభువు. అనేక జన్మల యోగఫలం ప్రభావంతో పరమాత్మ తత్వాన్ని దర్శించి కురుకుల పి తామహుడు పలికిన పలుకులివి. ధర్మరక్షణ కోసం అవతరించిన పరమాత్మ శ్రీకృష్ణుడు. తన అవతారంలో మానవ పరిమితులలో ప్రతిష్ఠించడానికి సాధ్యంకాని ధర్మాన్ని స్వాభావికమైన నారాయణ శక్తితో సమన్వయించి సాధించాడు.

హిందువుల పురాణ కథలకు, సనాతన సాహిత్యానికి వెన్నెముక శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుని కథలు బ్రహ్మాండ, పద్మ, మార్కండేయ పురాణములలో, శ్రీదేవీ భాగవతంలో, భారత హరి వంశాలలో కనపడుతున్నాయి. పద్మపురాణంలో విశేషంగా కృష్ణ కథా ప్రసక్తి ఉంది.

"అష్టమి రోహిణి పొద్దున
నష్టమ గర్భమున బుట్టి; యాదేవికిన్
దుష్టుని కంసుని వధింపవె
సృష్టి ప్రతిపాలనమ్ము; సేయగా కృష్ణా!"

రాక్షసులు తమ తమ బల పరాక్రమాలతో, కండబలమ్ముతో తన్ను ఆక్రమించేసరికి ఆ భారాన్ని మోయలేక భూమాత గో రూపధారియై బ్రహ్మాదులు

వెంటరాగా వైకుంఠానికి వెళ్ళింది. అచట సర్వభువనాలకీ అధీశ్వరుడైన శ్రీమన్నారాయణునితో మొర పెట్టుకుంది. భూదేవి మాటలను ఆలకించిన శ్రీహరి భూదేవిని ఓదార్చుతూ అధైర్యపడవలదని, త్వరలోనే తాను భూభారం తగ్గించడానికి వసుదేవుని ఇంట జన్మిస్తానని పలికి ఊరడించి పంపించాడు.

స్వాయంభువ మన్వంతరములో స్తుతపుడు అనే ప్రజాపతి – అతని భార్య వృశ్ని సంతానార్థం పన్నెండు వేల సంవత్సరాలు విష్ణుమూర్తి కోసం తపమాచరించారు. వారి తపస్సుకు మెచ్చి శ్రీహరి ప్రత్యక్షమై వరం కోరుకోమనగా "స్వామీ! మీరే మాకు బిడ్డగా జన్మించమ"ని ప్రార్థించారు. వారి కోరిక ననుసరించి అచ్యుతుడుగా అవతరించాడు. కాలక్రమేణా వారే తిరిగి కశ్యప అదితులుగా జన్మించగా, వారికి స్వామి వామనుడుగా జన్మించాడు. మూడవసారి వారే దేవకీ వసుదేవులుగా జన్మించగా వారికి శ్రావణమాస బహుళ అష్టమి తిథి, రోహిణీ నక్షత్ర యుక్త అమృత ఘడియలలో శ్రీకృష్ణ పరమాత్మ జన్మించాడు.

మహావిష్ణువు శ్రీకృష్ణావతారం స్వీకరించి అవనిపై అవతరించినవేళ జగమంతా నూతనోత్సాహంతో జీవం పోసుకుంది. దేవకీదేవి ప్రసవిస్తున్న సమయంలో ఏడు సముద్రాలు ఉప్పొంగాయి. మేఘాలు ఆనందంతో గర్జించాయి. దిక్కులన్నీ దివ్యకాంతులతో ప్రకాశించాయి. చల్లని గాలి కమ్మని వాసనలతో మెల్లగా వీచింది. తామరపూలతో, వాటిలో ఝుంకారాలు చేస్తున్న తుమ్మెదలతో కొలనులు కళకళ లాడాయి. నదులు నిర్మలమైన నీటితో నిండుగా ప్రవహించాయి. కిలకిలా రావాలతో పక్షులు, పుష్కలమైన పండ్లతో ఉద్యానవనాలు, అరణ్యాలు తమ ఆనందాన్ని ప్రకటించాయి. వేడుకలతో భూదేవి కళకళ లాడింది. దేవతలు భేరీలు మోగించారు. విష్ణువుని ప్రసవించిన దేవకీదేవి శరీరం మెరుపుతీగ లాగా దేదీప్యమానంగా ప్రకాశించింది. పుట్టిన బిడ్డడు చిరునవ్వులు చిందిస్తూ సమస్త కళామయమూర్తిగా విరాజిల్లాడు. ఆ బాలుడు వసుదేవునికి మేఘవర్ణ శరీరంతో శోభిల్లుతూ దివ్యరూపంతో దర్శనమిచ్చాడు. నాలుగు చేతులలో శంఖం, చక్రం, గద, పద్మం వెలుగొందుతున్నాయి. తామర రేకుల వంటి కన్నులు, విశాలమైన వక్షస్థలం, కంఠంలో కౌస్తుభ రత్న కాంతులతో మెరిసిపోతున్నాయి. కంకణాలు ధరించి, వక్షస్థలంపై శ్రీవత్సమనే పుట్టుమచ్చతో, చెవులకు కుండలాల కాంతులతో, నుదుట ముంగురులతో మనోహరంగా ప్రకాశిస్తున్నాడు. అటువంటి శ్రీహరిని వసుదేవుడు మళ్ళీ మళ్ళీ తేరిపార చూస్తూ పులకించిపోయాడు. ఆ విధంగా దేవకీ వసుదేవులను అనుగ్రహించిన శ్రీమహావిష్ణువు అంతలోనే ఆ దివ్య రూపం వదిలి పసిబిడ్డగా మారి వారి కళ్ళకు ఆవహించిన మాయను తొలగించాడు.

చతుర్భుజాలలో శంఖ చక్రాదులు ధరించిన కొడుకును దేవకీదేవి ప్రసవించింది. అచ్యుత శిశువు చెప్పిన ప్రకారం వసుదేవుడు ఆ శిశువును వ్రేపల్లెలో యశోద పక్కలో ఉంచి, ఆమె ప్రసవించిన ఆడబిడ్డను తెచ్చి దేవకి పక్కలో ఉంచాడు. ఒకనాడు వసుదేవుని కోర్కెపై పురోహితుడైన గర్గుడు వ్రేపల్లెలోని నందుని ఇంటికి వెళ్ళి బలరామకృష్ణులకు నామకరణ సంస్కారాలు చేశాడు. రోహిణీదేవి కుమారునకు రాముడని, సంకర్షణుడని, యశోదానందుల బిడ్డడికి "కర్శ్య యతీతి కృష్ణః" సర్వ జీవులను ఆకర్షించు వాడు గావున కృష్ణుడని పేరిడెను. మరియు నందుని చూచి శ్రీకృష్ణ శబ్దము మహిమాన్వితమైనదని, కృష్ణశబ్దమును స్మరించగనే అంతర్గత శత్రువులైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను అరిషడ్వర్గములను నాశనము చేస్తుందని పలికాడు.



శ్రీకృష్ణుని బాల లీలలు మధురాతి మధురమైనవి. పురాణాలు స్వామిని లీలా మానుష విగ్రహునిగా పేర్కొన్నాయి. స్వామి ప్రదర్శించిన లీలలెన్నో పరమాత్ముని మహిమలకు ప్రతీకలు.

ఒకనాడు యశోదాదేవి తన ఒడిలో బాలుడైన శ్రీకృష్ణుని కూర్చోబెట్టుకుని ముద్దులాడుచుండగా శ్రీకృష్ణుడు అంతకంతకూ బరువు పెరగసాగాడు. దానికి కారణమేమో తెలియని యశోద ఆశ్చర్యపడి అతని బరువు మోయలేక అతనిని కింద కూర్చుండబెట్టింది. ఇంటిలోనికి వెళ్ళి పని చేసుకుంటూ ఉండగా అప్పటికే కంసుడు పంపించిన తృణావర్తుడనే ఒక అసురుడు శ్రీకృష్ణుని చంపటానికి ఇదే సరైన సమయమని యెంచి

సుడిగాలి రూపం లో వచ్చి శ్రీకృష్ణుని ఆకాశంలోకి వేగంగా తీసుకునిపోయాడు. సుడిగాలికి దుమ్ము రేగి అంతటా చీకటి అలుముకోవడంతో ఎవరూ గమనించక తెలుసుకోలేకపోయారు.

శ్రీకృష్ణుని తీసుకుని ఆకాశంలోనికి వెళ్ళిన తృణావర్తుడు క్రమక్రమంగా బరువు అధికమవుతున్న శ్రీకృష్ణుని మోయలేక పోయాడు. బాలకృష్ణుడు తృణావర్తుని కంఠాన్ని తన చేతులతో గట్టిగా పట్టుకున్నాడు. శ్రీకృష్ణుని బరువును మోయలేని ఆ రాక్షసుడు బాధను భరించలేక హాహా కారాలు చేస్తూ ఒక రాతిపై పడిపోయి ప్రాణాలను వదిలి పెట్టాడు. కిందపడిన ఆ భయంకరాకారుడైన రాక్షసుని చూచి అందరూ భయకంపితులయ్యారు. రాక్షసుని అవయవాలు అన్నీ చూర్ణం అయినాయి. ఎటువంటి ఆపద లేకుండా కిందకి వచ్చిన శ్రీకృష్ణుని చూసి వ్రేపల్లెలోని గోప గోపీ జనంతో పాటు యశోదయు ఆనందాన్ని పొందారు.

ఒకనాడు బాలకృష్ణుడు దధి భాండమును (పెరుగుకుండ) పగులగొట్టి తల్లి కోపానికి గురయ్యాడు. ఇంట్లో వెన్న తిన్నది గాక వేరొక గోపిక ఇంట్లో వెన్న దొంగిలించి తల్లి కంట పడ్డాడు. దండిస్తే కాని బుద్ధిగా ఉండడని తల్లి యశోద భావించి కొడుకును కొట్టడానికి చేతులు రాక రోటికి కట్టివేసింది. ఇంటిలోనికి వెళ్ళి పని చేసుకుంటూ ఉండగా తల్లి తనను కట్టిన రోటిని లాగుకొని వచ్చి అక్కడే ఎత్తుగా ఉన్న చెట్లను కూల్చి నలకూబర, మణిగ్రీవుల యొక్క శాపవిమోచనము గావించాడు.

ఒకనాడు కాళిందీనదిలో కాళీయుడను సర్పము నివసిస్తూ అందరినీ భయభ్రాంతులకు గురి చేస్తూ తన విషముచే నీటిని కలుషితము గావించింది. కలుషితమైన ఆ నీటిని త్రాగి గోపికలు, గోవులు మరణించగా తన చూపులనే అమృత ధారలతో వారిని బతికించాడు. గర్వించిన కాళీయుని శిక్షింపదలచి వాని పడగలపై ఎక్కి నాట్యము చేసి పీచమణచాడు. ప్రాణావశిష్టుడైన తమ భర్తను రక్షింపమని కాళీయ సర్ప పత్నులు ప్రార్థించారు. వారి ప్రార్థనలను మన్నించి, కరుణించి కాళియుని విషమును కక్కించి రక్షించాడు.

బలరామకృష్ణులకు విద్యాభ్యాస మొనరించు సమయమాసన్నము కాగానే యశోదానందులు సాందీపని అను గురువు గారి వద్దకు పంపించారు. బలరామకృష్ణులు వారి వద్ద విద్యాభ్యాసం చేసి అరువది నాలుగు దినములలో అరువది నాలుగు విద్యలు నేర్చి గురువుగారికి ఆశ్చర్యం కలిగించారు. శిష్యుల మహిమను గుర్తించిన సాందీపని గురుదక్షిణగా ప్రభాస తీర్థానికి వెళ్ళి సముద్ర స్నానమాడబోయి, అందు మునిగిపోయి, తిరిగిరాని, మరణించిన తన కుమారుని బ్రతికించి తెచ్చి ఇమ్మని కోరాడు. కెరటమొకటి లోనికి లాక్కునిపోగా పంచజను రాక్షసుడు ఆ బాలుని మింగెనని చెప్పి, ఆ బాలుడుండు చోటు సముద్రుడు వారికి చెప్పాడు. కృష్ణుడు ఆ ప్రదేశానికి వెళ్ళి ఆ రాక్షసుని చంపి పొట్ట చీల్చి చూడగా, అందు బాలుడు కనిపించకపోయేసరికి యముని వద్దకు వెళ్ళారు. యమధర్మరాజు రామకృష్ణులను సాదరంగా ఆహ్వానించి వారి రాకకు కారణమును తెలుసుకుని గురుపుత్రుని వారికి అప్పగించాడు. రామకృష్ణులు గురుపుత్రుని తీసుకొని వచ్చి గురువుగారికి అప్పగించారు. తమ కుమారుని బ్రతికించి తెచ్చి ఇచ్చిన రామకృష్ణులకు కృతజ్ఞతలు తెల్పారు గురుదంపతులు.

ఒకనాడు గోపబాలురు వనమునకు మేత కొరకు లేగ దూడలను తోలుకొని పోవుచుండగా వారితో పాటు బాలకృష్ణుడు కూడా వనమునకు వెళ్ళాడు. వనములో లేగదూడలను మేపుతూ గోపబాలురు శ్రీకృష్ణుడితో ఆటలాడుకొన్నారు. చెట్టపట్టాలు పట్టుకుంటూ, తన్నుతూ, గుద్దుతూ, నవ్వుతూ ఒకరిపై ఒకరు మీద పడుతూ కలిసి ఆడుకుంటూ ఎంతో ఉత్సాహముతో పరిగెడుతూ ఆటలాడారు. ఆటలు ఆడి ఆడి ఎండలో అలసిపోయి ఆకలి గొన్నవారై ఒక మంచి పచ్చిక మైదానంలో చల్దులారగించడానికి సిద్ధపడి కృష్ణుని తామరలోని దుద్దులాగా చేసి తామర రేకుల్లాగా గోపబాలురు కూర్చున్నారు. రాతిపలకలు, వెడల్పుగా ఉన్న చిగురుటాకులు, గడ్డిపోచలు, తీగలు, చిక్కములు (తీగలు మొదలైనవానితో అల్లిన పసుల మూతికి కట్టే బుట్ట) పూలు, ఆకులు మున్నగువాటినే కంచములుగా చేసుకుని చల్దులారగించసాగారు. ఒక గోపబాలుడు తన వేళ్ళ మధ్య ఇరికించుకున్న ఊరగాయ ముక్కలు పక్కవాడికి చూపిస్తూ, ఊరిస్తూ తింటున్నాడు. ఇంకొకడు పక్కవాని కంచములోని పదార్థములను తటాలున లాక్కొని మింగేసి, పక్కవాడు అడుగగా ఏమీలేదని తన నోరు చూపిస్తూ, ఇన్ని పదార్థములు ఉన్నప్పుడు ఇతరులకు పంచిపెట్టి తినడం స్నేహ ధర్మమని, ఇతరుల కంచాల్లోని పదార్థములను తీసి బంతెన గుండ్లు ఆడుతూ, ఇతరులను నవ్విస్తూ నవ్వుతూ, ముచ్చట్లు చెప్పుచూ అల్లరి చేస్తూ చల్దులారగించారు. యోగులు, యోగీశ్వరులు ఏ పరమాత్మ ధూళిని, మూర్తిమత్వాన్ని తమ కనులతో చూడలేరో అట్టి శ్రీకృష్ణునితో కూడా గోపబాలురు ఆటలాడుకున్నారు. కలిసి ఆడుకుంటూ, ఆదరిస్తూ, ఆనందించే గోపబాలుర యొక్క భాగ్యము లెంత గొప్పవో కదా.


అచ్యుతుడు, అనంతుడు, పద్మమాలాధరుడైన శ్రీకృష్ణపరమాత్మ యొక్క లీలలు అనంతములు. ఆయన లీలలు కమనీయమై రమణీయమైనవి. కృష్ణాష్టమి పర్వదినాన ఆ లీలా మానుష విగ్రహధారియైన కృష్ణపరమాత్మను ధ్యానించి, పూజించి తరించెదము గాక.

"వసుదేవసుతం దేవం కంసచాణూర మర్దనం
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుం"



29వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు



## తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 29 వ భాగపు లీలల ప్రచురణ. (మార్చి 2014 నుండి నవంబర్ 2014 వరకు).

భగవంతుని సాధనకు అవసరమైన ఏకాంతము, దృఢ సంకల్పమును సాధించుటకు ఆటంకముగా ఉన్న మా వ్యాపారాన్ని మానివేయమని గత కొంతకాలంగా చెప్పసాగారు. ప్రతిగా నా పోషణ భారమును స్వయంగా చూచుకుందునన్నారు. నాకు జన్మ జన్మల సేవాభాగ్యముతో పాటు మా అమ్మకు వైకుంఠం ప్రసాదించానని తెలిపారు. నన్ను హరిదాసు జీవితం గడపమన్నారు. కాని మేము వ్యాపారం పూర్తిగా మానలేక కాలక్షేపం కోసం చిన్నగా కొనసాగించాము. దీనికి కోపోద్రిక్తుడైన స్వామివారు శారీరక రుగ్మతలను ప్రసాదించి మార్చుటకు ప్రయత్నించారు. అయినప్పటికీ మా మూలంలో మార్పు జరగని కారణంగా ప్రస్తుతము ఉగ్రుడైనాడు, భయభ్రాంతులకు గురి చేశాడు, ఏవిధంగానైనా మా చేత వ్యాపారాన్ని మానిపించాలని ఈ క్రింది లీలలను చూపాడు. నిజానికి ఈ లీలలను ఆ సమయాన మేము అర్థం చేసుకోలేదు. ఎందుకు జరుగుచున్నదో తెలియక స్వామివారిని శరణు వేడాము.

### వ్యాపారము చేయరాదంటూ భయపెట్టుట

మేము హైదరాబాదులో ఉన్న విద్యానగర్ లోని మా ఆఫీసును అమ్మి హబ్సిగూడ వీధి నెం.1 లో ఒక పాత ఇల్లును కొని, దాని స్థానములో 4 అంతస్తుల బంగ్లాను నిర్మించుకున్నాము. అందులో మొదటి ఫ్లోర్‌ను మా ఆఫీసుగా పెట్టుకుని మిగిలిన వాటిని అద్దెకు ఇచ్చాము. కొన్నప్పుడు ఇంటి యజమాని, వారి కుటుంబ సభ్యుల సంతకాలు తీసుకున్నాము. ఇది 2010 సంవత్సరంలో జరిగిన విషయం. కాని తేది 27-02-2014 శివరాత్రి నాడు ఆ ఇంటి యజమాని కొడుకు మా ఆఫీసుకు వచ్చి పెద్ద న్యూసెన్స్ చేశాడు. బోర్డులను పగులకొట్టాడు, ఎవరినీ ఆఫీసులోకి పోనివ్వకుండా



**హబ్సీగూడలోని మా ఆఫీస్**

బీభత్సము సృష్టించాడు. ఇది మాదేనంటూ మా వాచ్‌మెన్‌ను బెదిరించాడు. కిరాయివారిని రా ని వ్వలేదు. వీడికి ఈమధ్యనే పిచ్చి పట్టిందట, దానిని ఇక్కడ మరీ ఎక్కువ చేశాడు. వాడు బలమైనవాడు కావడంతో అందరం భయపడిపోయాము. దీనితో పోలీసులకు కంప్లైంట్ చేశాము. ఆ తెల్లవారి కూడా చాలా పెద్ద గొడవ జరిగింది. పోలీసుల సహాయముతో అతడిని పిచ్చి హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. కాని అక్కడ వారిని కొట్టి పా రిపోయాడు. మళ్ళీ వచ్చునని మేము భయపడ్డాము. రక్షించమని స్వామివారిని ప్రార్థించాము. అప్పుడు స్వామివారు ఈ రెండు లీలలను నా భార్య సురేఖకు చూపాడు.

**తేది 01-03-2014 కల:** సురేఖ మరియు మా డ్రైవర్ కలీం కలిసి దాదాపు ఒక రెండు కోట్ల రూపాయలు కలిగిన సూట్ కేసు మరియు డబ్బు సంచులతో ఒకరికి ఇవ్వటానికి కారులో ప్రయాణమై వెళ్ళుచున్నారట. దీనిని గమనించిన ఒక దొంగ వీరిని అనుసరించాడట. ఈ విషయాన్ని పసిగట్టిన నా భార్య సురేఖ మరియు డ్రైవర్, కారును మరింత వేగంగా నడిపారట. ఆ దొంగ కూడా అదే వేగంతో వీరిని అనుసరించాడట. వీరికి ఏమి చేయాలో తోచలేదట, చాలా భయపడ్డారట. ఆ దొంగ మోటార్ సైకిల్ పై, వీరి స్పీడుకు తగినట్లు స్పీడ్ పెంచి, ఎలాగో వీరి కారు అద్దమును క్రిందకి దించి ఒక సంచిని లాక్కునిపోవుటకు తీవ్ర ప్రయత్నం చేశాడట. వీరు ఆ సంచిని అందనివ్వకుండా స్పీడ్ పెంచి మరింత దూరము పోయారట. వాడు ఎలాగైనా ఆ సంచిని చేజిక్కించుకోవాలని విశ్వప్రయత్నం చేశాడట. చివరికి వాడి బాధ తప్పదని తలచి డబ్బులు వేరే బ్యాగ్ లోనికి మార్చి ఒక ఖాళీ బ్యాగులో ఏదో ఒకటి పెట్టి, అందులో డబ్బు ఉందని వాణ్ణి నమ్మించారట. వాడు మళ్ళీ వీరిని అందుకుని ఆ ఖాళీ బ్యాగ్ ని తీసుకుని పారిపోయాడట. కాని ఆ బ్యాగులో ఏమీ లేదని గ్రహించి తిరిగి వీరిని అనుసరించాడట. ఇంతలో ట్రాఫిక్ మధ్యన వీరు వానికి తెలియకుండా ఒకప్రక్కన దాగున్నారట. వీరు వాని బారినుండి తప్పించుకున్నామని సంతోషించారట. ఇది మొదటి కల. మా సురేఖ ఆ దొంగ బారినుండి తప్పించుకున్నానని సంతోషించింది కాని స్వామివారు మాత్రం నీవు తప్పించుకోలేవంటూ మరో కలను అదేరోజు ఈ క్రింది విధంగా చూపెట్టారు.

**రెండవ కల :** మా సురేఖ వారి బంధువుల పెళ్ళి తాండూరు దగ్గరలోని వారి అమ్మమ్మ ఊరిలో జరుగుచున్నదట. అందుకు ఈమె, తన విలువైన నగలను తీసుకొని ఒక బ్యాగ్ లోని నగల పెట్టెలో పెట్టుకొని కారులో వెళుతోందట. దీనిని గమనించిన ఒక దొంగ, ఓరకంట దొంగ చూపులు చూస్తూ వీరిని వెంబడించాడట. విలువైన వజ్రాలు, నగలు కలిగిన ఈ చెక్క డబ్బాపై వాడి దృష్టి పడిందట. ఎలాగో వాడిని తప్పించుకొని చివరికి పెండ్లి స్థలానికి చేరుకున్నారట. పెండ్లికి వాడు కూడా వచ్చి వీరి బంధువులతో ఎంతో ఆప్యాయంగా, చాలా మంచివాడిగా మాట్లాడసాగాడట. దీనిని గమనించిన మా సురేఖ వీడు మంచివాడు కాదని, వారితో చెప్పే అవకాశం లేకుండా పోయిందట. ఈమె ఎక్కడికి వెళితే అక్కడికి వచ్చి వీరి బంధువులతో ఆప్యాయంగా మాట్లాడసాగాడట. ఈమె ఎంత ప్రయత్నించినా వాడు చెడ్డవాడని చెప్పలేకపోయిందట. చెప్పినా వారు నమ్మే స్థితిలో లేరట. తిరుగు ప్రయాణములో మళ్ళీ వీరిని వెంబడించి, అనుసరించాడట ఆ దొంగ. చివరికి అలసిపోయిన వీరు ఆ చక్కని చెక్క డబ్బాలోని వస్తువులను వాడు చూడనప్పుడు వేరేదాని లోనికి మార్చి ఆ ఖాళీ డబ్బాను తీసుకోమని బయటికి విసిరివేశారట. వాడు ఆ డబ్బా కోసం అటు వెళ్ళేసరికి వీరు తప్పించుకున్నారట. ఇంతే కల.

ఇది మా పరిస్థితిని ప్రతిబింబించింది. ఆ రోజు దీని అర్థమును గ్రహించలేదు. కేవలము మాకు కీడు జరుగునని మాత్రమే భావించాము కాని దీని నిజమైన అర్థం – మేము స్వామి మాట వినక వ్యాపారము కొనసాగించినట్లైతే... మాకున్న ఆస్తి దొంగలపాలు అగునని, అపహరించబడునని హెచ్చరించారు. మమ్ములను వ్యాపారం మాని పూర్తికాలము స్వామి సేవలో మాత్రమే ఉండమన్నారు.

## సురేఖను అనుగ్రహించుట

ఈ అనుభూతులను పొందిన తరువాత మా సురేఖ భయపడిపోయింది. మాకు ఎలాంటి ఆపదలు రానీయకుమని

స్వామివారిని తీవ్రంగా ప్రార్థించింది. దీనికి సంతోషించిన స్వామివారు సురేఖకు ఒక పాము రూపంలో ఈ విధంగా అనుగ్రహించారు.

**తేది 27-02-2014 కల:** మేము, మా ఊరు చిన్నగుండవెల్లిలో ఉన్నామట. అక్కడ సురేఖ మా మిత్రుడు శేఖరము వారి ఇంటికి వెళ్ళిందట. వారు దాణా పెడితే ఒక పాము వచ్చి తినునని ఎప్పుడో అంతకుముందు ఈమెతో చెప్పారట. అయితే ఇప్పుడు ఈమె వెళ్ళి కుశల ప్రశ్నల తరువాత "ఏమైంది శేఖరం మీ పాము వస్తున్నదా?" అని అడిగిందట, అప్పుడు వారు, అవును వస్తున్నది, దానికి ఈ దాణా పెట్టాలని చెప్పి, వారి పని అయిపోయిన తరువాత ఒక గిన్నెలో పిండి వంటి ఒక దాణా




**దాణాను తినుటకు వచ్చిన పాము**

(ఆహారమును) వేసినారట. ఇంతలో ఒక చాలా పెద్ద పాము వారి ఇంటిలోనికి వచ్చి, వారు వేసిన ఆ దాణాను తిని వెళ్ళిపోయిందట. అంత పెద్ద పామును ఈమె ఎప్పుడూ చూడలేదట, నిగనిగలాడే చర్మంతో గోధుమ వర్ణంలో గల ఈ నాగుపామును చూచి ఈమె చాలా ఆనందించిందట. కల చెదిరింది.


దీనర్థం. స్వామివారు తృప్తి చెందే విధంగా మా ప్రవర్తనను సరి చేసుకొమ్మన్నారు. కాని ఈ భావాన్ని కల కన్నప్పుడు గ్రహించలేదు.

## టి.టి.డి ఈ.ఓ సంతోషించి స్వామివారి లడ్డూ ప్రసాదమును పంపమని ఆజ్ఞాపించుట

ఈ మధ్యన వ్యాపారము జరగక ఏ పనీ లేకుండా ఉన్న నాకు స్వామివారు ప్రసాదించిన సేవలను సమర్థవంతంగా చేయాలనిపించింది. ఏప్రిల్ 2007 సంవత్సరం నుండి, స్వామివారి ఆజ్ఞానుసారం 'శ్రీవేంకటేశం' మాసపత్రికను ప్రారంభించి, క్రమం తప్పకుండా ప్రచురిస్తున్నాము. కాని దీనిని ఇంకా చాలామంది భక్తులు చదవాలని, తెలియని ఎన్నో విషయాలు ఈ పత్రిక ద్వారా తెలుసుకోవాలని భావించాను. అందులకై స్వామివారికి సంబంధించిన, ముఖ్యంగా ఆయన గత చరిత్రకు సంబంధించిన ఎన్నో పుస్తకాలను సేకరించి చదివాను. అందులోని నచ్చిన విషయాలను కొన్ని వ్యాసాలుగా, మరికొన్ని బాక్స్ ఐటమ్స్ గా వేయాలని నిర్ణయించాను. గత మూడు నాలుగు రోజుల నుండి ముఖ్యంగా స్వామివారి పరిశోధకులు తిరుపతి వాస్తవ్యులైన కీ.శే. కె.వి.రాఘవాచార్యులు గారు రచించిన 'వేంకటాద్రి (తిరుమల) క్షేత్ర వైభవం' అను పుస్తకమును చదివాను. ఇది చాలా బాగుంది. ఇందులో తెలియని చారిత్రక విషయాలు చాలా ఉన్నవి. ఈరోజు ఈ పుస్తకము నుండి సుమారు 13 చిన్న వ్యాసములను సేకరించాను. వీటిని నెలకు ఒకటి చొప్పున ప్రతినెల శ్రీవేంకటేశం మాసపత్రికలో వేయాలని అనుకున్నాను. ఎందుకో కాని ఈరోజు నా మనస్సు చాలా ఆనందముతో నిండింది. స్వామివారు నాపై పెట్టిన బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు భావించాను. ఎందుకో మొత్తం మీద మహా సంతోషంతో మనస్సు ఉప్పొంగింది. సాయంత్రం స్వామివారిని ఇవి బాగున్నాయా ప్రభూ... అంటూ ప్రార్థించి ఇంటికి వెళ్ళాను.

నా ఈ ప్రయత్నానికి స్వామివారు ఎంతో సంతోషించారు. నా రాబోయే పుట్టినరోజు నాడు తన ప్రసాదమైన లడ్డూను పంపవలసిందిగా తన వారిని ఆజ్ఞాపించారు, మరియు నేను తొలి ఏకాదశి నాడు పుట్టానని విశ్లేషణాత్మకంగా తెలిపారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 03-05-2014 కల :** ఈరోజు 4.30 గంటల ప్రాంతమున ఈ కల వచ్చింది. ఇందులో తిరుమల తిరుపతి దేవస్థానపు అప్పటి ఈ.ఓ శ్రీమాన్ ఎం.జి గోపాల్ గారు పూజా దుస్తులతో కనబడ్డారు. ఏదో ఒక యాగం, బహుశా జప సమర్పణ యాగం జరుగుచున్నది. అందులో నేను కూడా ఉన్నాను. శ్రీ గోపాల్ గారు నన్ను, ఈ సేవను చూచి చాలా మెచ్చుకున్నారు. అక్కడున్న వారితో నా గురించి ఏదో గొప్పగా చెప్పారు. చివరికి "ఈయన పుట్టిన రోజుకి లడ్డూలను పంపాలి" అని అన్నారు. ఈ మాట నాకు వినపడేటట్లు మాట్లాడారు. శ్రీ గోపాల్ గారు




**టి టి డి ఈ ఒ శ్రీ యం జీ గోపాల్ గారు ప్రసాదమును పంపమని చెప్పట**

ఈ పూజా కార్య క్రమములో చాలామంది పూజారులతో పాటు ఉన్నారు. కార్యక్రమ నిర్వాహకునిగా తలకు పంచెను రుమాలుగా చుట్టుకుని ఉన్నారు. మొత్తం మీద నా గురించి సంతోషాన్ని వెలిబుచ్చారు. ఇది నాకు ఆనందాన్నిచ్చింది. కల చెదిరింది.

కాని ఇక్కడొక సంతోషం, మరొక అనుమానం కలిగాయి. నా పుట్టిన రోజు తొలి ఏకాదశి అని భావించాను. కాని అది ఖచ్చితంగా తెలియదు. అంతేకాకుండా మేము ప్రతి తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినము నాడు హైదరాబాద్ లో 'భజగోవిందం' నిర్వహిస్తాము. కాబట్టి ఆ రోజు నేను తిరుపతి వెళ్ళే సమస్యయే ఉండదు. మరి స్వామివారు నాకు ఏవిధంగా లడ్డూ తినిపిస్తారని అనుమానించాను. ఆ సమయం కోసం వేచి చూడసాగాను.

## స్వామివారి ఉత్సవాన్ని చూపుట, మా పిల్లలను భాగస్వాములుగా చేయుటకు సూచనలు ఇచ్చుట

పత్రికకు సంబంధించి మరో అద్భుత కల కన్నాను. వచ్చే జూన్ 8 న శ్రీకూర్మజయంతి ఉన్నది. దీని గురించి ఒక ఆర్టికల్ చాలా ఆలస్యంగా వచ్చింది. దీనిని ప్రచురించాలా వద్దా అనే సందిగ్ధములో ఉన్నాను. ఆ రోజు రాత్రి ఈ కల వచ్చింది.

**తేది 14-05-2014 కల :** నేను మా కుటుంబంతో సహా ఒక ఆలయానికి వెళ్ళాను. అప్పుడు ఆ ఆలయంలో బ్రహ్మోత్సవం లాంటి ఒక ఉత్సవం జరిగిన పిదప స్వామివారి కళ్యాణోత్సవం జరుగుచున్నది. ఆ ఆలయం ఆదివరాహస్వామి లేక కూర్మావతారముదై ఉంటుంది. ఆయన కళ్యాణము శ్రీ లక్ష్మీ అమ్మవారితో జరుగుచున్నది. చాలామంది భక్తులు ఈ కార్యక్రమము చూడటానికి వచ్చారు. బ్రాహ్మణులు శిఖలు ముడుచుకొని, ధోవతులు ధరించి, చక్కని తిరునామము సహితులై స్వామివారి కళ్యాణము చేస్తున్నారు. మంత్ర పఠనము చేస్తున్నారు. కొందరు బ్రాహ్మణులు చెవుల పైన పూర్తిగా వెంట్రుకలు లేకుండా కటింగ్ చేసుకుని తల పైభాగములో మాత్రమే వెంట్రుకలతో ఉన్నారు. శ్రీవైష్ణవ స్వాములతో ఆ ఆలయ పరిసరాలంతా హడావుడిగా ఉన్నది. ఇది టీవీలో లైవ్ గా ప్రసారమగుచున్నది. ఇక టీవీలో వార్తలు చదివే సమయము వచ్చింది. అక్కడున్న టీవీ వారు ఒక ఆడ, ఒక మగ ఇద్దరికీ మైకు ఇచ్చి జరుగుచున్నది చెప్పమన్నారు. ఆ మగ మనిషి నా రెండవ కుమారుడు చి॥ అరవింద్ రెడ్డి. వాడు మైక్ తీసుకుని వార్తలను చెప్పసాగాడు. ''స్వామివారికి అమ్మవారితో పెండ్లి అయింది. ఆయన వైఫ్ తో మాలలను మార్చుకుంటున్నారు'' అని

చెప్పినప్పుడు భార్యకు బదులుగా వైఫ్ అనే పదమును వాడాడు. దీనిని దూరము నుండి గమనించిన నేను వైఫ్ కు బదులు భార్య అనమని సైగ చేశాను. తరువాత కల చెదిరింది. ఈ విధంగా పత్రిక విషయమై రెండు లీలలను చూపి ఆనందింపచేశారు. మరియు వారి సేవలో మా పిల్లలను కూడా భాగస్వాములను చేయుదురని సూచనలిచ్చారు.

ఈ కల చూసిన వెంటనే స్వామి ఆజ్ఞగా కూర్మావతార వ్యాసమును జూన్ నెలలో ప్రచురించాము.

## స్వామివారి తిరునాళ్ళు చూపుట

ఈ మధ్యన స్వామి లీలలను చూడాలని స్వామివారిని తీవ్రంగా ప్రార్థించాను. ఒక లీల చూపారు. కాని దీని అర్థమును సరిగా గ్రహించలేదు.

**తేది 27-05-2014 కల :** అది ఒక తిరునాళ్ళు జరిగే ప్రదేశం. ఈ ప్రదేశం ఒక చెరువు కట్టపై ఉన్నట్లున్నది. ఈ కట్ట ప్రక్కన ఒక పెద్ద చింత చెట్టు ఉన్నది. దాని మొదలు దగ్గర దాదాపు 6 X 10' వెడల్పుతో చెంబులు పెట్టి వాటిని దారాలతో బంధించి దేవుళ్ళకు పూజ జరిగినట్లు ఉన్నది. ఆ పూజలో నేనే ప్రధానంగా పాల్గొన్నానట. ఈ తిరునాళ్ళకు వచ్చిన భక్తులు అక్కడక్కడ తిరుగుచున్నారు, కావలసినవి కొంటున్నారు, సందడిగా ఉంది. ఈ కట్ట ప్రక్కన ఒక దిగుడు బావి ఉన్నది. నేను అందులోనికి వెళ్ళి స్నానము చేయాలని భావించి దిగాను. లోన, నీటిమట్టము సమీపమున అనువైన స్థలం కోసం ఒక దరి నుండి మరో దరికి పోయాను. స్నానము చేయుటకు సిద్ధముగా ఉన్నాను. ఈ స్నానం చేసిన పిదప తిరిగి స్వామివారి పూజలో పాల్గొనవలెనని అనుకున్నాను. ఇంతలో కల చెదిరింది. ఈ బావి మా ఊరిలోని మా ప్రక్క పొలము వారిదిగా భావించాను.

దీనర్థం: బహుశా స్వామివారు మెచ్చే రీతిలో స్వామిసేవ చేయుదునని సూచన కావచ్చును.

## నేను తొలి ఏకాదశి నాడు పుట్టానని సూచించుట

**తేది 03-05-2014** నాటి కల ప్రకారం, నేను నా పుట్టిన రోజైన తొలి ఏకాదశి నాడు కుటుంబ సమేతంగా అనగా భార్య, చిన్న కుమారుడు చి॥ అరవింద్ రెడ్డి సహితంగా తిరుమలకు వెళ్ళాను. అక్కడ స్వామి వారిని దర్శించి స్వామి సూచించినట్లు వారి ప్రసాదమును తిన్నాను. ఇది స్వామివారి సంకల్పము. ఇది యాదృచ్ఛికంగా జరిగింది. ఎలా అంటే... మామూలుగా నేను ప్రతి తొలి ఏకాదశి నాడు హైదరాబాద్ లోని హిమాయత్ నగర్ లో ఉన్న టి.టి.డి హాల్ లో 'భజగోవిందము'ను నిర్వహించుట ఆచారమైంది. కాని తేది 03-05-2014 నాటి కల ప్రకారం ఈ సంవత్సరం భజగోవిందమునకు (నా పుట్టినరోజు నాడు) స్వామివారి ప్రసాదమును పంపుదురా? అని అనుకున్నాను. లేదా స్వామి మహిమ ఏమిటో తెలియక ఊరుకున్నాను. కాని కొన్ని రోజుల తరువాత నా రెండవ కుమారుడు చి॥ అరవింద్ రెడ్డి అమెరికాకు ఎం.ఎస్ చదువుటకై వెళ్ళుటకు సిద్ధం కాగానే వాడికి స్వామి దర్శనం చేయించి, స్వామి లాకెట్ మెడలో కట్టుటకై తిరుపతికి వెళ్ళవలసి వచ్చింది. మరియు దీనికై టికెట్ బుక్ చేయునప్పుడు నాకు తెలియకుండానే తొలి ఏకాదశి రోజున తిరుపతిలో ఉండేవిధంగా చేసుకున్నాము. అంతే కాకుండా భజగోవిందం నిర్వహించుటకు టి.టి.డి హాల్ గురించి ఒక నాలుగు నెలల ముందే అప్లై చేసినప్పటికీ, వారు మాకు హాలు కేటాయించలేదు. అందుకని హైదరాబాద్ లో భజనను చేయక తిరుపతికి వెళ్ళి స్వామి దర్శనము చేసుకున్నాము. మరియు స్వామి ప్రసాదం తిన్నాము. స్వామి సూచించినట్లు నా పుట్టిన రోజైన తొలి ఏకాదశి రోజు స్వామి ప్రసాదమును తిన్నాను. మరియు ఈ లీల ద్వారా నేను తొలి ఏకాదశి రోజు జన్మించానని ఇన్ డైరెక్టుగా స్వామివారు సూచించారు.

## రథయాత్ర ప్రారంభం

తేది 24-07-2014 నాటి సాయంత్రం మా ఇంటి నుండి తిరుమల స్వామివారికి 12వ పర్యాయంగా 7 కోట్ల జపసమర్పణకై 'నమో వేంకటేశాయ' రథయాత్ర ప్రారంభమైనది. ఇది శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎం.ఎల్.ఎ శ్రీ ఎన్.వి.ఎస్.ప్రభాకర్, ముషీరాబాద్ ఎం.ఎల్.ఎ డా॥ లక్ష్మణ్, డా॥ పులిగడ్డ విజయలక్ష్మి మొదలగువారు హాజరయ్యారు. మంచి సంఖ్యలో భక్తులు వచ్చారు. అందరూ ఆనందించారు. తరువాత భోజనాలు చేసి వెళ్ళారు. ఈ పర్యాయం హైదరాబాదులో తేది 09-08-2014 వరకు తిరిగిన పిదప నల్గొండ, గుంటూరు, చిలకలూరిపేట, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరులో తిరిగి తేది 16-08-2014 సాయంత్రం తిరుపతి చేరుకున్నాము.

## గోకులాష్టమి నాడు 12వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

తేది 17-08-2014 సాయంత్రం 5 గంటలకు అలిపిరి పాదాల మండపము వద్ద 12వ పర్యాయంగా 7 కోట్ల జపమును స్వామివారి పాదాలకు సమర్పించి పూజ నిర్వహించాము. ఈ జపాన్ని స్వీకరించమని స్వామివారిని వేడుకున్నాము. ఆ తరువాత తేది 18-08-2014 గోకులాష్టమి నాడు ఎస్.వి డైరీఫాంలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము వద్ద జపహోమాదులు నిర్వహించుట జరిగింది. ఈ.ఓ శ్రీమాన్ ఎం.జి

గోపాల్ గారు, మరికొందరు ముఖ్యులు వచ్చి, పూర్ణాహుతి కావించి స్వామివారికి 12వ పర్యాయంగా 7 కోట్ల జపమును సమర్పించారు. ఆ తరువాత చాలామంది భక్తులు ఈ జప సమర్పణను కావించి ధన్యులమైనామని తృప్తి చెందారు. ఈ కార్యక్రమము చాలా చక్కగా మనశ్శాంతిగా, తృప్తిగా జరిగింది. నా స్వామివారికి చేసిన సంకల్పంలో భాగంగా 12వ పర్యాయంగా 7 కోట్ల జపమును సమర్పించు భాగ్యమును కల్పించి, సమర్పించినందులకు నేను కూడా ధన్యుణ్ణి అయ్యానని అనుకున్నాను.

పాదాల మండపం పైన మరియు జప సమర్పణ వద్ద స్వామివారి దర్శన భాగ్యము యథావిధిగా జరిగింది. కార్యక్రమము తరువాత కొండపైకి వెళ్ళి తేది 19-08-2014 నాడు స్వామివారిని దర్శించుకున్నాము. తిరిగి ఇదేరోజు సాయంత్రం హైదరాబాద్ ప్రయాణమై 20-08-2014 నాడు ఇల్లు చేరుకున్నాము.

## స్వామివారి దర్శనము

12వ జప సమర్పణ సందర్భంగా స్వామివారు ఈ క్రింది మూడు లీలలను ఒకటి నాకు, రెండు సురేఖకు చూపారు. అవి ఈవిధంగా ఉన్నాయి.

రథము తేది 24-07-2014 నాటి రాత్రి ప్రారంభించాము. తెల్లవారి అంటే 25-07-2014 నాడు ఉదయము, సాయంత్రము రథమును కొన్ని ప్రాంతాలలో త్రిప్పాము. రథానికి నాలుగు ప్రక్కలా స్వామివారు ఉంటారు. రథానికి ఒక భజన మండపము కూడా ఉంటుంది. కాని కాలక్రమంలో దీనిలో జనరేటర్, జపపుస్తకములు, కావలసిన సామాన్లు పెట్టుకుంటున్నాము. నేను కూడా ఇందులోనే కూర్చుండి మైక్ ద్వారా రథానికి సూచనలిస్తుంటాను. భజన మండపానికి రథమునకు మధ్యన బ్రాహ్మణుడు కూర్చుంటాడు. వీరు రథం వద్దకు వచ్చిన భక్తులకు పూజలు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల సంపత్ కుమార్ అని మా ఆఫీసులో పనిచేయు వ్యక్తే దీనిని నిర్వహిస్తున్నాడు. ఇలా ప్రతి రథ యాత్రలో రథం ముందు సంపత్ (బ్రాహ్మణుడు), అతని తరువాత భజన మండపములో నేను కూర్చుందును. నాకు, రథమునకు మధ్యలో పూజారి (సంపత్) కూర్చుంటాడు. నాకు, నా ఎదురుగా రథంలో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారి మధ్యన ఈ పంతులు ఉండుట వలన స్వామివారు నాకు సరిగా కనబడరు. నాకేమో రాత్రి లైట్ వెలుగులో స్వామివారిని అదేపనిగా చూడాలని కోరిక, కాని ఈ పంతులు వలన ఇది సాధ్యం అవడంలేదు. అందుకని మనస్సులో కొంత బాధ కలిగేది. ఇది ప్రతి సంవత్సరం జరిగే సంగతే... అయితే ఈసారి నా మనస్సును గ్రహించిన స్వామివారు ఈ క్రింది లీల చూపి ఆనందింప చేశారు.

**తేది 26-07-2014 కల :** ఈ కలలో నమో వేంకటేశాయ రథములోని స్వామివారు, అదే విగ్రహ రూపముగా బంగారు కాంతితో దర్శనమిచ్చారు. నాకు, స్వామివారికి మధ్యలో ఉండు పంతులు గారు లేరు. స్వామివారు నాకు తనివితీరా దర్శనమిచ్చి నా కోరిక తీర్చారు. నేను స్వామివారి ఎదురుగా ఉండి తృప్తిగా దర్శించాను. కల చెదిరింది.

## భవిష్యత్తులో స్వామి సేవ కొనసాగునని సూచించుట

ఇక సురేఖకు కలిగిన అనుభూతి అత్యంత విలువైనది మరియు ముఖ్యమైనది. మేము 2002 సంవత్సరంలో జప సమర్పణ కార్యక్రమమును, 2004 సంవత్సరంలో రథయాత్ర కార్యక్రమమును చేపట్టాము. నేటికి 12వ జప సమర్పణ మరియు 11వ రథయాత్రను నిర్వహించాము. రోజులు గడిచిన కొద్దీ మాలో వయస్సు పెరుగుతున్నది. శరీరంలో జబ్బులు చేరిపోతున్నవి. ఈ మధ్యన మోకాళ్ళ నొప్పులు చాలా బాధ కలిగించాయి. ప్రస్తుతం నా వయస్సు 54 సంవత్సరాలు, నా భార్యది 51 సంవత్సరాలు. ఈ శారీరక బాధ వలన ఈ రథయాత్ర కార్యక్రమము ఎలా నిర్వహించగలమని ఈ యాత్ర ప్రారంభానికి ముందు భావించాము. కాని దేవుని దయ వలన అంతా సుఖంగా జరిగింది. మాకు, జపానికి ప్రత్యేక పూజల నుండి జపసమర్పణ వరకు మొత్తం 35 రోజుల పని ఉంటుంది. దీనిని చూచి నా భార్య చింతించింది. ఎలా చేయగలమని విచారించింది. భవిష్యత్తులో ఈ కార్యక్రమము ఎలా జరుగునని బాధపడ్డది. ఒకవేళ మేము చేయకపోతే ఎలా? అనే దిగులు ఆమెను ఆవహించింది. దీనికి జవాబే ఈ కల. ఇది తేది 27-07-2014 నుండి తేది 05-08-2014 మధ్యన వచ్చింది.

కల: సాధారణంగా ప్రతిరోజూ మేము మా పూజగదిలో స్వామివారికి పూజ చేస్తాము. ఈ రోజు కూడా మేము లేచి స్నానము ముగించి, సిద్ధమై స్వామివారిని సేవించుటకు వెళ్ళామట. నా భార్య ముందు వెళ్ళింది, నేను వెనక ఉన్నానట. కాని మేము వెళ్ళేసరికి మా స్థానములో పంతులు లాంటి వారు ఒకరు కూర్చుండి ఉండుటను చూచిన సురేఖ ఒక్కసారి ఆశ్చర్యపోయిందట. మా ఇంటిలో, మేము కూర్చుండే చోట కూర్చున్నారేంటి అని అనుకున్నదట. ఇంతలో ఆయనతో తెగేసి అన్నదట, ''ఇది మా స్థానము మేము కూర్చోవాలి'' అని మీరెందుకు కూర్చున్నారనే అర్థం వచ్చేలా మాట్లాడిందట. ఇంతలో ఆయన తిరిగి ఈమెతో అతి నెమ్మదిగా, మృదుమధురంగా ఇలా అన్నారట ''మీరు చెప్పినట్టే చేస్తానమ్మా. మీరు చెప్పినట్టే చేస్తాను'' అని అన్నాడట. ''కాని ఇక్కడ మేము కూర్చోవాలి కదా'' అని ఈమె అంటుంటే,

పర్వాలేదు నేను "మీరు చెప్పినట్టే చేస్తాను" ఇబ్బంది లేదని చెప్పారట. ఇంతలో ఈ కలలోని సీను మారింది. ఆయన కూర్చున్న చోటు 'నమో వేంకటేశాయ' రథము పైన పంతులు గారు కూర్చుండే స్థానమున కూర్చున్నాడట. సురేఖకు ముందు ఇంటిలోని పూజామందిరములో కూర్చున్నట్లు కనబడ్డాడు. చివరికి రథములో స్వామివారి ముందు భాగములో కూర్చున్నట్లు కనబడ్డాడు. మరియు సురేఖ ఆవేశాన్ని తగ్గించి, శాంతింప చేశాడు. కల చెదిరింది.

దీనర్థం ఏమిటంటే – కొన్ని సంవత్సరాల తరువాత మేము శారీరకంగా ఈ సేవను నిర్వహించలేనప్పుడు మా స్థానములో వేరేవారిని స్వామివారు ప్రవేశపెట్టుదురు. కాని ఈ కార్యక్రమము మాత్రం కొనసాగునని, మరియు మా స్థానమునకు ఇబ్బంది ఉండదని అర్థము.

ఇంత చక్కని కలను ప్రసాదించి, ఎంతో సంతోషమైన విషయమును వినిపించిన నా స్వామికి కోటి కోటి ప్రణామాలను తెలుపుకున్నాము. ఎందుకంటే మేము ప్రారంభించిన ఈ కార్యక్రమము ఇలాగే కొనసాగవలెనని మా కోరిక. దీనిని స్వామివారు అలాగే కొనసాగించుదునని తెలిపినప్పుడు మా ఆనందానికి హద్దులు లేవు.

## మా పిల్లల బాధ్యతను తీసుకున్న స్వామివారు

ఈ కల కూడా 12వ రథయాత్ర మధ్యలో వచ్చింది. కాని ఇది రథయాత్రకు సంబంధించింది కాదు. మా సురేఖ మానసిక స్థితిని ఉదాహరణగా చూపుచూ, భగవంతుని అండను తెలియజేశారు. మా బాధ్యతలు స్వామివారు తీసుకున్నారు.

మాకు ఇద్దరు పుత్రులు. ఈ రోజు నాటికి పెద్దవాడు చి॥ వేదాంత్ రెడ్డి అమెరికాలో ఎం.ఎస్ చేసి ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నవాడు, చి॥ అరవింద్ రెడ్డి తేది 08-08-2014 నాడు ఎం.ఎస్ చదువుటకని అమెరికాకు వెళ్ళాడు. ఇలా ఇద్దరు పుత్రులూ వెళ్ళేసరికి మేము ఒంటరివారిమి అయిపోయాము. పైగా వీడు చిన్నకొడుకు కావటం వలన, తల్లికి ప్రేమ ఎక్కువ ఉండుట వలన, అక్కడ ఎట్లుండునో అనే బెంగతో ఉన్నది. మరియు మేము ఇక్కడ ఒంటరిగా పిల్లలను విడిచి ఉందుమనే బాధతో సురేఖ ఉన్నది. ఈ చింతను తీర్చుమని స్వామివారిని ప్రార్థించింది. స్వామివారు ఈ క్రింది చక్కని లీలను ప్రసాదించారు.

కల : మా కుటుంబం అంటే నేను, సురేఖ, మరియు చిన్నకుమారుడు చి॥ అరవింద్ రెడ్డి ముగ్గురం కలిసి ఎక్కడికో పోయామట. ఒక తీర్థయాత్రకు, లేదా ఒక ఎగ్జిబిషన్ లాంటి ప్రదేశానికి వెళ్ళామట. అక్కడ అంతా క్రొత్త ప్రదేశము కావున అది, ఇది అంతా చూశాము. ప్రతి వస్తువును పరిశీలించాము. ఇంతలో మా ముందు ఒక పెద్ద పొడవైన రోలర్ కోస్టర్ లాంటి వంకరలు తిరిగిన ప్లాస్టిక్ గొట్టం, ఒక ఆట వస్తువు లాంటిది కనబడిందట. ఇంతలో ఎక్కడో వెనుక ఉన్న మా అరవింద్ పరుగెత్తుకు వచ్చి ఆ గొట్టము లోనికి జంప్ చేసి లోనికి పోయాడట. ఈ దృశ్యమును చూచిన సురేఖ ఎంతో దిగులు చెందింది. మరియు తాను అరవింద్ ని అందుకోబోయి, తాను కూడా ఎగిరి ఆ ప్లాస్టిక్ గొట్టములో అరవింద్ వెనుక దూకిందట. ఇంతలో ఎవరో ఒక అదృశ్య వ్యక్తి మాటలు ఇలా విన్నబడ్డాయట. "భయపడకమ్మా ఏమీ కాదు, క్రింద జాలీ వేయబడింది. దీని యజమాని జాగ్రత్తగా ఉండుటకు జాలీని ఏర్పాటు చేశాడు. ఆ అబ్బాయికి ఏమీ కాదు బాధ పడకండి, పైకి రండని" ఈమెను పైకి రమ్మన్నాడు. ఈమె ఆ గొట్టంలో దూకింది కాని ఈయన మాటల వలన ఆ పైపు అంచును పట్టుకుని తిరిగి పైకి వచ్చిందట. ఆ తరువాత అందరం, ఆ అదృశ్య వ్యక్తితో పాటు, క్రిందికి వెళ్ళి చూచేసరికి మా కొడుకు చిన్నపిల్లవాడుగా మారి ఆ జాలీ వద్ద ఆడుకుంటున్నాడట. ఏమీ కాలేదు. దీనిని చూచి ఆ వ్యక్తి "నేను చెప్పాను కదా!" అని అన్నారట. కల చెదిరింది.

అంటే... మీరు, మీ పిల్లలు దూరమైనారని భయపడకండి, వారి బాధ్యతలను చూచుకుంటానని స్వామివారు మాతో చెప్పారన్నమాట.

ఒకవివరణ:తిరుమలస్వామివారుతనసాధనకుఅవసరమైన పరిస్థితులు కల్పించుటకు వ్యాపారము చేయకూడదన్నారు. క్షణము వదలకుండా హరినామ స్మరణ చేయమన్నారు. మా ఆర్థిక బాధ్యతలను వారే చూచుకుందునన్నారు. ఇప్పుడు మా మనస్సు పిల్లలపైకి పోకుండుటకు, వారికి అమెరికాలో గ్రీన్ కార్డు ఇప్పించుటతో పాటు వారి బాగోగులు తానే చూచుకుందునని మాట ఇచ్చారు. ఈ విధంగా మమ్మల్ని సాధకులుగా మార్చుటకు ఆటంకంగా ఉన్న అన్ని విషయాలను చక్కబెట్టుచున్నారు. ఇలా మా పిల్లల బాధ్యతను తీసుకోవడంలో ఇదే ఉద్దేశమని ఈ భాగం వ్రాస్తున్నప్పుడు భావించాను.

## స్వామి సేవకులతో సమానంగా ఉండుమనుట

ప్రతి సంవత్సరం నమోవేంకటేశాయ రథయాత్ర హైదరాబాదులో 16 రోజులు తిరుగుతుంది. నాతో కలిపి రథములో మొత్తం 7 మందిమి ఉంటాము. ఈ 16 రోజులు సురేఖనే మా అందరికీ ఇష్టముతో వండి పెడుతుంది. ఈ రథయాత్రలో పనిచేయు స్వామి సేవకులు చాలామంది మా వద్ద పని చేసేవారే. కాని మేము ఈ సమయంలో వారిని మాతో సమానంగా చూసుకొనేవారిమి. నేనైతే రథయాత్రలో రాత్రుళ్ళు వారితో సమానంగా పడుకునేవాడిని. ఇక సురేఖ

వారికి అప్పుడప్పుడు డబ్బులు ఇస్తూ ప్రోత్సహించేది. అందరం కలిసి తింటూ, కలిసి ఉండేవాళ్ళం. చివరికి జప సమర్పణ తరువాత అందరం కొండకు పోయి స్వామివారిని దర్శించి, వారి ప్రసాదమును తిన్న తరువాత వారు రథంలో, మేము ట్రెయిన్ లో హైదరాబాద్ వచ్చేవాళ్ళం. ఈవిధంగా స్వామి సేవకులతో సమాన భావముతోనే మెలిగేవారిమి. కాని 2014 సంవత్సరంలో ఒక సంఘటన జరిగింది. ఇందులో రథయాత్ర చేసి జపసమర్పణ తరువాత అందరం కలిసి స్వామివారిని దర్శించుకోలేకపోయాము. తేది 18-08-2014 నాడు తిరుపతిలో జపసమర్పణ చేశాము. అప్పటికే తెలంగాణలో ఏర్పడిన నూతన ప్రభుత్వము తేది 19-08-2014 రోజున రాష్ట్రం మొత్తం జనాభా సర్వే చేపట్టింది. మా వారిలో కొందరు ఈ సర్వే నిమిత్తమని స్వామివారిని దర్శించుకోకుండానే తేది 18-08-2014సాయంత్రం హైదరాబాదుకు తిరిగి వచ్చారు.కాబట్టి మేము వారితో కలిసి స్వామి దర్శనం చేసుకోలేకపోయాము. ఇది స్వామివారికి ఆగ్రహం తెప్పించింది. దీని సారమే సురేఖకు వచ్చిన కల.

**తేది 30-08-2014 కల :** అది రథయాత్ర జరుగు రోజులట. యాత్ర తరువాత ఇంటి వద్ద అందరికీ భోజనాలను ఏర్పరచామట. అందరూ భోజనాలకు సిద్ధమై ఉన్నారు. కాని ఈ రథములోని సేవకులలో ఒకరు మాత్రము, భోజనానికి రాక ఏదో పనిపై ఉన్నారట. ఇంతలో భోజనాలకు సిద్ధమైన మమ్ములను చూచిన ఒక ఆకర్షణీయంగా, తేజోవంతంగా ఉన్న ఒకామె "ఆగండి ఒక సేవకుడు రాలేద"ని అన్నదట. ఇంతలో సురేఖ కలుగజేసుకుని మనము తినేద్దాము, ఆయన వచ్చిన తరువాత తింటారులే! అని అన్నదట. ఇంతలో ఆ తేజోవంతంగా కనబడుచున్నామె ఇలా అన్నదట. " మీరు స్వామిసేవ చేయువారు అలా అనకూడదు" అని మందలించిందట. వెంటనే కల చెదిరింది.

అంటే... అందరూ స్వామి సేవకులు సమానంగా ఉండమని ఆమె చెప్పిందని అర్థం. దీనిని మేము స్వామివారి ఆజ్ఞగా భావించుకున్నాము.

## స్వామివారు నొచ్చుకొనుట

గత కొన్ని రోజుల నుండి నా ఆరోగ్యము చెడిపోయింది. నరాల బలహీనతతో బాధపడుచున్నాను. నిజానికి ఇది భగవంతుడు ఇచ్చిన ఫలితంగా భావించి అనుభవించుట మంచిది. లేదా దీనిని ఆసరాగా తీసుకుని స్వామివారిని మరింత ఎక్కువ సమయము స్మరించుట ఉత్తమము. ఎందుకంటే శారీరక రుగ్మత వలన ఇతర కార్యాలు చేసే, చింతించే అవసరం లేదు కాబట్టి ఈ సమయాన్ని భగవంతుడి ధ్యానానికై ఉపయోగించాలి. కాని నేను మాత్రం తిరిగి పుంజుకొనుటకై రకరకాల మందులను వాడుచు, నా దృష్టిని కేవలం మందుల పైననే ఉంచి కాలము గడుపుచున్నాను. ఇది తగినది కాదని నాకు తెలుసు కాని స్వామి నన్ను కరుణించలేదనే మనస్తాపంతో కావాలనే మందులు వాడుటకు ఉపక్రమించాను, ఫలితంగా స్వామి స్మరణ తగ్గింది. మరియు స్వామివారు నాకు ప్రసాదించిన సేవలో అంటే ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ, నమో వేంకటేశాయ రథయాత్ర మరియు శ్రీవేంకటేశం మాసపత్రికను ఏ తప్పూ లేకుండా చేస్తున్నప్పటికీ నా సమస్యలను పట్టించుకొనుట లేదు, పైగా వ్యాపారము మానమని ఆదేశిస్తున్నారు. లోకంలో నన్ను అత్యంత క్రింది స్థాయి వ్యక్తిగా నిలబెట్టారనే భావము నా మనస్సులో ముద్రించుకున్నది. నా కళ్ళముందటి వ్యక్తులు నా కంటె ఉన్నత స్థితిలో ఉండుట చూచి కూడా నా మనస్సు చలించుటకు కారణమైంది. గత కొన్ని రోజుల నుండి స్వామిసేవను కొనసాగిస్తున్నప్పటికీ లౌకిక విషయాల పట్ల ఆసక్తి కనబరచాను. మరియు నిరంతరం జరిగే స్వామి స్మరణ అవసరమా? అనిపించింది. దీనితో స్వామివారికి కోపం వచ్చింది. నేను స్వామి ఆదేశాలను పాటించకుండా అత్యంత హీనమైన దారిలో పోతున్నానని ఘాటుగా ఈ లీల ద్వారా సూచించారు.

**తేది 02-09-2014 కల :** ఈ కలలో నేను ఒక దూరపు ప్రాంతమునకు ఒక ఫంక్షన్ కొరకై వెళ్ళాను. కాని అక్కడ నాకు సరైన వసతులు కనబడలేదు. వసతికై వెతికితే అన్నీ మరుగుదొడ్లు కనపడ్డాయి. ఎంత వెతికినా, ఎక్కడకు పోయినా అవే కనబడ్డాయి. వసతి కొరకు ఎక్కడికి వెళ్ళాలా అని ఇతరులను అడిగాను, వారు ఈ ప్రక్కకు వెళ్ళమన్నారు. నేను ఆ ప్రక్కకు వెళ్ళగా అవే కనబడ్డాయి, కొన్ని చోట్ల మంచి రూములు కనబడ్డాయి, కాని డోర్ తీయగానే మరుగుదొడ్లు ఉన్నాయి. ఇంతే కల.

నా ప్రవర్తన వలన స్వామివారు నొచ్చుకున్నారని భావించాను. నిజానికి నేను ఎప్పటికీ స్వామివారిని సంతోషించే విధంగా ప్రవర్తించేవాడిని. నా సంతోషం కంటే ఆయన సంతోషమే ముఖ్యమనుకునే వాణ్ణి. కాని ఇప్పుడు నా కారణంగా స్వామివారు బాధపడ్డారని చూచి కలత చెందాను. స్వామి వారిని తప్పైంది క్షమించమని వేడుకున్నాను. నా ప్రవర్తన వలన స్వామివారు ఏ స్థాయిలో బాధపడ్డారో అదే స్థాయిలో సంతోష పరచదలచాను. సహాయం చేయమని స్వామివారిని తీవ్రంగా ప్రార్థించాను.

నా ఈ పశ్చాత్తాపమునకు ఫలముగా ఈనాటి రాత్రి స్వామివారు నన్ను క్షమించినట్లు అనుభూతి పొందాను.


## తీవ్ర సాధన, మతిమరపు సూచనలు, హరినామ క్షేత్రం సన్నాహాలు

పై లీల తరువాత స్వామివారిని తృప్తి పరచాలనే భావం నాలో తారాస్థాయికి చేరింది. స్వామివారిని క్షణము విడువక

సదా స్మరించసాగాను. ఏవిధంగా స్వామివారిని తృప్తి పరచగలనో రకరకాలుగా ఆలోచించాను. లౌకిక విషయాలను మరచిపోయాను. ఎప్పుడు చూచినా, ఎక్కడ చూచినా స్వామివారిని క్షమించమని వేడుకుంటూ స్మరిస్తున్నాను. చిన్న తప్పే అని కాంప్రమైజ్ అయితే అది మరిన్ని తప్పులకు దారి తీయుననే మరో భావం నా హృదయంలో కలిగింది. కాబట్టి స్వామి తప్ప మరో భావాన్ని నా దరికి చేరనీయలేదు. బహుశా అఖండ హరినామ స్మరణ క్షేత్రం ఏర్పాటు చేస్తే స్వామివారు సంతోషిస్తారని భావించాను. ఎలాగైనా ఈ క్షేత్రాన్ని ఏర్పాటు చేయాలనే దృఢమైన భావం కూడా ఏర్పడింది. ఇలాంటి క్షేత్రాల గురించి తెలుసుకొనుట మొదలుపెట్టాను.

నా ఈ స్థితిని చూచిన స్వామివారు ఆనందించారు. మరియు ఈ స్థితికి అనుగుణంగా ఒక లీలను ఈ క్రింది విధంగా చూపారు.

**తేది 05-09-2014 కల :** నేను ఒక ఆలయములో జరుగు ఒక ఫంక్షన్‌కు వెళ్ళాను. దాని నిర్వాహకులలో నేను కూడా




**హారతి పళ్ళెంలో డబ్బులు మరచిపోవటం**

ఒక ముఖ్యమైన వాడినే. దాని నిర్వహణలో నాతో పాటు నా ఇంజనీరింగ్ మిత్రుడు ప్రస్తుతం ఈవెంట్ నిర్వహణలో ఉన్న శ్రీమాన్ కె.కె.రాజా అనే అతను కూడా ఒకరు ఉన్నారట. చాలామంది భక్తులు, ప్రేక్షకులు వచ్చారు. ఈ ఫంక్షన్ ముందు జరుగు ఒక ఉత్సవములో భగవంతునికి పూజ జరిగింది. పూజ తరువాత స్వామివారికి ఒక పళ్ళెములో హారతి ఇచ్చారు. ఈ హారతిని అందుకున్న నేను నా వెనుక ఉన్న భక్తులకు హారతి అందేవిధంగా, ఈ హారతి పళ్ళెమును ఒక వ్యక్తికి ఇచ్చివేశాను. కాని నేను ఈ ఉత్సవము కొరకు తెచ్చిన డబ్బులో కొంత ఖర్చు చేశానట, మరికొంత మిగిలిందట. ఆ మిగిలిన డబ్బు ఐదు వందల రూపాయల కట్టలు ఒక మూడు నాలుగు ఉన్నవి. వీటిని హారతి అందుకొనుటకు ముందు ఆ పళ్ళెములో పెట్టి తిరిగి తీసుకొనుట మరచిపోయి, నా వెనక ఉన్న వ్యక్తికి ఇచ్చివేశాను. అంటే హారతి పళ్ళెములోని డబ్బు కట్టలతో సహా ఇచ్చివేశాను. దీనిని గమనించిన ఇతర భక్తుల గోల విని కె.కె.రాజా వారు ''ఈమధ్యన ఈయనకు మతిమరపు ఎక్కువైనదని'' అన్నారు. నిజానికి నాకు ఆ డబ్బుపైన ధ్యాస లేదు. కల చెదిరింది.

దీనర్థం : నాలో కొంత మార్పు కలుగుతుందని, లౌకిక విషయాల పట్ల ఆసక్తి తగ్గుతుందని మరియు భవిష్యత్తులో నాకు మతిమరపు వచ్చిందనే స్థితికి చేరుకుంటానని సూచనలిచ్చారు.

## సురేఖ సహకారం

స్వామివారు కొన్ని రోజుల తరువాత మరో లీలను ఈ క్రింది విధంగా ప్రసాదించారు. కాని అప్పుడు దీని భావమును గ్రహించలేదు.

ఈ లీల విచిత్రంగా, నా పెండ్లి రోజుల నాటిదిగా ఉన్నది.

**తేది 07-11-2014 కల :** ఒక ఫంక్షన్ హాలు లోనికి నా భార్య సురేఖ నన్ను తీసుకుపోయింది. ఆ హాలులోనికి వెళ్ళగానే అనగా మేము హాలులో ఉన్నప్పుడు కలను చూచాను. ఆ హాలులో అప్పటికే ఒక ఫంక్షన్ అయిపోయింది, ఎవరూ లేరు, మేము మాత్రమే ఉన్నాము. మేము ఈనాడు అనగా తేది 07-11-2014 నాటిలాగా లేము, అప్పటికి మేము మా పెండ్లినాటి రోజుల లాగా ఉన్నాము. నేను, మరియు సురేఖ వయస్సు చాలా తక్కువగా అనగా పెండ్లి నాటికి ముందు వయస్సు ఉంది. రూపం కూడా అదే విధంగా యవ్వనంగా ఉంది. నా చేయి పట్టుకొని ఆ మండపానికి కొద్ది దూరములోని ఒక మెట్టుపైన కూర్చోపెట్టింది. ఆ హాలు ఒక యూనివర్సిటీకి సంబంధించిన ఫంక్షన్ హాలు లాగా ఉన్నది. ఫంక్షన్ అయిపోయిన ఆనవాళ్ళు కనబడ్డాయి. కల చెదిరింది. దీని అర్థం గ్రహించలేదు. బహుశా భవిష్యత్తులో సురేఖ స్వామివారు ఆశించే విధంగా, పరీక్షలో ఉత్తీర్ణులగుటకు సహకరించగలదని భావము కావచ్చును.

## హరినామ క్షేత్రాలను దర్శించుట

గత కొన్ని రోజుల నుండి అఖండ హరినామ స్మరణ క్షేత్రం ఏర్పాటు చేయాలని తీవ్రంగా ప్రయత్నించాను. అలాంటి క్షేత్రాల గురించి ఆరా తీశాను, తెలిసినవారిని విచారించాను. శ్రీమాన్


కసిరెడ్డి వెంకటరెడ్డి అని నాకు తెలిసిన ఒక ఆధ్యాత్మిక వ్యక్తి ఉన్నారు. వారిని విచారించాను. వారు ఈ రకమైనవి ఒక స్వామీజీ ఆధ్వ ర్యములో మహబూబ్ నగర్ జిల్లాలో తనకు తెలిసినవి ఉన్నాయన్నారు. తేది 18-11-2014, మంగళవారము, ఏకాదశినాడు హరినామ సంకీర్తనలను చేసే చోట్లు చూచుటకు వెళ్ళాము. శంషాబాద్ లోని శివానందాశ్రమమును దర్శించాము. అందులో 1988 నుండి అఖండ హరినామ సంకీర్తన జరుగుచున్నదట. హరే రామ హరేరామ రామ రామ హరే హరే హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే మంత్రమును పలుకుచున్నారు. ఒక చిన్న గదిలో ఈ నామ సంకీర్తన జరుగుచున్నది. అక్కడ నుండి జడ్చర్ల లోని గంగాపురం వెళ్ళి అక్కడి శివానంద ఆశ్రమమును చూచాము. అక్కడ ''నమో నారాయణాయ'' అను మంత్రమును ఉచ్చరిస్తున్నారు. ఇక్కడ 6 సంవత్సరాల నుండి ఈ నామోచ్చారణ జరుగుచున్నదట. ఆశ్రమంలో భక్తులు నివసించుటకు కొన్ని గదులను కూడా నిర్మించారు. పిదప గంగాపురము లోని శ్రీ అనంత పద్మనాభ స్వామివారిని దర్శించి తిరిగి వచ్చాము. ఇది నా ఆశయమునకు ఒక రూపముగా భావించాను. దీనిని సాధించాలంటే... కొన్ని గదుల నిర్మాణముతో పాటు దృఢసంకల్పము కలిగిన భక్తులను తయారు చేయాలని భావించాను. తగిన స్థలముకై శోధన చేయసాగాను.

## వ్యాపారము మానివేయ నిర్ణయము

చాలా రోజుల నుండి స్వామివారి లీలలను చూడనందున, లీలలను చూపమని దీనంగా ప్రార్థించాను. చివరికి తేది 23-11-2014 ఉదయం 5 గంటల ప్రాంతమున ఒక భయానకమైన లీలను చూపారు. మమ్మల్ని చివరికి కాలక్షేపము కొరకైనా వ్యాపారము చేయరాదని హెచ్చరిస్తున్నట్లు ఈ లీల ఉంది. ఈ లీల తరువాత మేము వ్యాపారాన్ని పూర్తిగా మానివేశాము. ఆ లీల ఈవిధంగా ఉంది.

నేను 1990 నుండి బిల్డర్ గా అపార్టుమెంట్స్ వ్యాపారము చేశాను. స్వామివారి లీలలో భాగంగా 1999 నుండి అపార్టుమెంట్స్ స్థానములో ఇంటిపెండెంట్ ఇళ్ళు కట్టడం మొదలుపెట్టాను. 2002 సంవత్సరం నుండి 2012 సంవత్సరం వరకు కేవలం నా జీవనోపాధి నిమిత్తమే వ్యాపారం చేశాను. 2012 సంవత్సరం డిసెంబర్ మాసంలో వ్యాపారం పూర్తిగా మానమని స్వామివారు చెప్పారు. కాని కాలక్షేపం కోసమని కేవలం 2 ఇళ్ళను మాత్రమే నాగోలు ప్రాంతంలో ప్రారంభించాను. అవి స్వామివారి లీలా విశేషం చేత ఎంత ప్రయత్నించినా అమ్ముడుపోలేదు. చాలా దుఃఖం కలిగించాయి. ఒకటి కేవలం వారం క్రింద అమ్ముడుపోయింది. కొన్నవారు డబ్బులు ఇంకా ఇవ్వాలి. ఈ కల ఈ డబ్బు విషయమై, ఒక దొంగ గురించి వచ్చింది. నన్ను జాగ్రత్తగా ఉండమన్నారో లేక ఇలా జరుగునని హెచ్చరించారో తెలియదు కాని అది జరగకుండా నామస్మరణ తీవ్రంగా చేశాను. స్వామి అనుభూతిని చాలా రోజుల నుండి పొందని నేను ఆయనపై భక్తిని తగ్గించుకున్న వానిలాగా అనిపించేది. ఈ లీల ద్వారా తిరిగి భక్తిని పెంపొందించుకున్నాను.

**తేది 23-11-2014 కల :** నేను ఒక వ్యక్తి నుండి నాకు రావలసిన రు.18 లక్షలను తీసుకుని నా బ్రీఫ్ కేసులో పెట్టుకున్నాను. ఆ డబ్బులను అందులో పెడుతున్నప్పుడు ఆ బ్రీఫ్ కేస్ అడుగున నాకు సంబంధించిన దాదాపు ఎనిమిది తొమ్మిది పేపర్లు ఉన్నవి. పైన పేపర్ మాత్రం నా ఓటర్ కార్డు జిరాక్స్ కాపీ ఉన్నది. దానిపై నా ఫొటో, ఇంటి అడ్రస్ నాకు స్పష్టంగా కనబడింది. ఆ పేపర్లపైన నాకు రావలసిన 18 లక్షల రూపాయలను జమ చేసి అందులో పెట్టాను. ఈ బ్రీఫ్ కేస్ నేను డబ్బుల రవాణాకు వాడే బ్రీఫ్ కేసే కావడం విశేషం. ఈ బ్రీఫ్ కేస్ కాకుండా నా వద్ద మరొక నల్లని బ్యాగ్ కూడా ఉన్నది. ఇది కూడా బరువుగానే ఉన్నది. బహుశా ఇందులో కూడా డబ్బే ఉండవచ్చు. ఇలా నేను బ్యాగును భుజాన వేసుకుని, సూట్ కేసును చేతితో




దొంగలు నా డబ్బు బ్యాగును దొంగిలించుటకు ప్రయత్నించుట

పట్టుకొని దగ్గరలోనే మరో స్థలములో ఉన్న బ్యాంకులో పెట్టుటకు వెళ్ళుచున్నాను. దీనిని గమనించిన ఇద్దరు వ్యక్తులు నా వద్దకు వచ్చారు. సహాయం చేస్తామని చెప్పి ఒకతను నా సూట్ కేసును తీసుకున్నాడు. నేను కూడా ముందు వద్దన్నాను. చివరికి ఒకే చెప్పి అతనికి సూట్ కేసును ఇచ్చాను. దగ్గరలోనే ఉన్న మరో స్థలమునకు, బ్యాంకు వద్దకు పోయిన తరువాత నా సూట్ కేసును ఇవ్వమన్నాను. దానికి అతను నిరాకరించాడు. ఆ సూట్ కేస్ తనదేనని చెప్పాడు. తనదే కావున అందులో ఏమున్నదో తనకు తెలుసునని, అందులో డబ్బు ఉన్నదని రెండవ వ్యక్తితో చెప్పాడు. ఆ రెండవ వ్యక్తి, అయితే ఇది నీదే అని అతనికి వత్తాసు పలికాడు. దీనిని గ్రహించిన నేను, ఇది మోసం అని, నన్ను మీరు చాలా సేపటి నుంచి గమనించి ఈ పని చేస్తున్నారని భావించాను. ఒక్క క్షణం బుర్ర పనిచేయక అయోమయంలో పడ్డాను. అప్పటికే ఆర్థిక కష్టాలలో ఉన్నాను కావున, దీనితో బెదిరిపోయాను. చివరికి డబ్బు పెట్టే సమయంలో సూట్ కేస్ అడుగున నా పత్రాలు, అందులో ఉన్న నా ఓటర్ కార్డు జిరాక్స్ గుర్తుకొచ్చింది. దీనితో ధైర్యం వచ్చింది. కల ముగిసింది.

తెల్లవారి ఆదివారం నా ఇల్లు కొన్న అతను వచ్చి డబ్బులు ఇస్తానని చెప్పాడు. సాయంత్రం 7.30 గంటలకు వచ్చి 17 లక్షలు ఇచ్చాడు. నేను అదే సూట్ కేసులో పెట్టాను. అలాగే ఆ సూట్ కేస్ అడుగున ఒక ఎనిమిది-పది పేపర్లు ఉన్నవి. అలాగే పై పేపర్ నాది కాకుండా నా భార్య ఓటర్ ఐడి, ఆమె ఫొటోతో పాటు ఉన్నది (దాని క్రింద నా ఓటర్ ఐడి ఉన్నది). కలలో చూసిన మాదిరిగానే ఉన్నది. ఆ డబ్బును ఆ పేపర్లపై పెట్టి రక్షించమని నా ప్రభువును మరీ మరీ వేడుకున్నాను. ప్రభూ నేను చాలా దీనస్థితిలో ఉన్నాను. నాకు ఎలాంటి ఆపదలను దరి చేరనివ్వకండని వేడుకున్నాను. తెల్లవారి ఒక మంచి కలతో పాటు ఏ ఆపద లేకుండా ఈ డబ్బును బ్యాంకులో జమ చేశాను.

దీని అర్థం : స్వామివారు మమ్ములను కాలక్షేపము కొరకు కూడా వ్యాపారము వద్దన్నారు. మరియు మేము చేయలేని స్థితిని కలిగించారు.

దీనికి ఆజ్యం పోస్తూ, గతంలో సైనిక్ పురి వద్ద కట్టిన చిన్న అపార్టుమెంట్ కు రు. 20 లక్షలు కట్టవలసిందిగా ఐ.టి వారు నోటీసు ఇచ్చారు. నిజానికి మేము సకాలములో కట్టవలసిన పైకము కట్టినప్పటికీ ఈ నోటీసు రావడం కలచి వేసింది. వీటన్నింటిని పరిగణన లోనికి తీసుకుని చివరికి నేను, నా భార్య ఆలోచించాము. సురేఖ సూచన మేరకు పూర్తిగా మా వ్యాపారాన్ని విరమించేలా నిర్ణయం తీసుకున్నాము. స్వామివారు కూడా "కిరాయిలు" అనే రెండు ఆర్థిక వ్యవస్థలు కల్పించి మా పోషణతో పాటు సేవ నడిచేలా ఏర్పాటు చేశారు.

నా దశ : భగవంతుని సాధనకు అవసరమైన ఏకాంతమును కలిగించుటకు స్వామివారు ప్రయత్నించారు. నేను తొలి ఏకాదశి నాడు పుట్టానని స్వామివారు చెప్పారు. స్వామివారి దర్శనం లభించింది. భవిష్యత్తులో మా సేవ కొనసాగునని చెప్పారు. మా పిల్లల బాధ్యతలను స్వామివారు తీసుకున్నారు. హరినామ క్షేత్ర సాధన మొదలుపెట్టాను.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**



## తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

**స్వామివారి 700 దివ్యలీలలు**

1వ మరియు 2వ సంపుటములు

**ఉచిత పంపిణి**




**ఆసక్తి కలవారు ఈ క్రింది అడ్రస్ నుండి నేరుగా పొందవచ్చును. లేదా పోస్టు ద్వారా పొందగోరు వారు పోస్టు ఖర్చుల నిమిత్తం సంపుటము ఒకంటికి రూ. 75/- లను ఫోన్‌పే / గూగుల్ పే / పేటీఎం ద్వారా 9348212354కు మీ అడ్రస్‌తో పాటు పంపి పొందవచ్చును.**

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

**ఇ.నం. 1-1-53, వీధి నం.1, హబ్సిగూడ,**
**హైదరాబాద్ - 500 007. ఫోన్:040-27175050,**
**సెల్: 93482 12354 (మెసేజ్ మాత్రమే)**

# తిరుప్పావై

## శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు

గత సంచిక తరువాయి



### 22వ పాశురము

అంగణ్ మాఞాల త్తరశర్, అభిమాన
బజ్గమాయ్ వన్దు నిన్ పళ్ళిక్కట్టిల్ కీళే,
శంగ మిరుప్పార్ పోల్ వన్దు తలై ప్పెయ్ దోమ్,
కింగిణి వాయ్ చ్చెయ్ ద తామరై ప్పూప్పోలే,
శెంగణ్ శిఱిచ్చిఱిదే యెమ్మేల్ విళియావో,
తింగళు మాదిత్తియను మెళున్దాఱ్పోల్,
అంగ ణిఱణ్డుం కొండు ఎంగళ్ మేల్ నోక్కుదియేల్,
ఎంగళ్ మేల్ శాప మిళిన్దేలో రెమ్బావాయ్.

తాత్పర్యము – అందమైన దేశములతో విశాలమైనట్టి ఈ భూమిని తమ స్వంతమైనదని గర్వించిన చిన్నజీవి నుండి రారాజు లందరున్నూ తమ అభిమానములను వదలుకొని నీవు తప్ప వేరు దిక్కులేక వచ్చి నీవు శయనించిన మంచము క్రింద నీ సేవకై చేరి సంఘములుగ పడిగాపులు పడియున్నట్లే మేమున్నూ మా యొక్క స్త్రీత్వాభిమానమును వదలి అనన్య గతికులమై నిన్ను చేరగల్గితిమి. స్వామీ! చిరుమువ్వలు నోళ్ళు తెరుచుకుని యుండునట్లున్నూ, అప్పుడే విచ్చుకొనుచున్న శెందామరల వలెనూ నీ యొక్క ఎఱ్ఱని నేత్రములను, ఒక్కసారి తెరువక, మెల్ల మెల్లగ మేము ఓర్చుకొనగలుగునట్లు తెరచి నీ చూపు మాపై ప్రసరింపచేయవా! సూర్యచంద్రులొకతరి ఉదయించినట్లు చల్లని తేజస్సును ప్రసాదించుచున్న సుందర వికసితనేత్ర ద్వయముతో, ఒకతరి మమ్ము కటాక్షించితివా ఇక నిన్ను వదలుట యనెడి మేమనుభవించి తీరవలసియున్న ప్రారబ్ధమంతయు నశించి నీ సంశ్లేషమనే పుణ్యాన్ని పొందగలము.

విశేషార్థము – దురభిమానం దూరమైంది. నిను చేరి స్తుతించి, మేల్కొనే సౌందర్యమును సేవించాలని వచ్చాం 'అని గోపీజనులు అన్నా', అసలు వీళ్ళ అంతరంగాల్లో ఏముందో చూడాలని మెదలలేదు స్వామి. తను కాదంటే వీళ్ళు మరోచోటు వెతుక్కుంటారా! లేదా అని.

స్వామివైన నీకే సొత్తులైనవారం. మరి వేరే దేనికీ చెందము. స్వీకరించినా వదులుకున్నా నీ ఇష్టం సుమా! అంటారు వీరు.

లంక వదిలాడు విభీషణుడు. రాముడున్న ఉత్తరతీరం చేరాడు. ఆకాశంలో నిలిచాడు. భార్యాపుత్రులు, సిరి సంపదలూ అన్నీ వదిలేశాడు. రామ రక్షణ కోరాడు. రాముడు రక్షించకున్నా తిరిగిపోయేది లేదు. వదిలేసిన వాటిని పట్టేది లేదు అంటూ పూర్ణ శరణాగతి చేశాడు. గోపికలూ అదే చేస్తున్నారు.

'భగవంతుడొక్కడే నాకు అనుకూలం' మొదట కలగాలి.

వానికంటే వేరైనవన్నీ ప్రతికూలమేనని వాటిని వదలాలి.

స్వామి రక్షించి తీరుననే విశ్వాసముండాలి.

విశ్వాసానికి తగ్గట్టు ఆశ్రయించాలి.

వెళ్ళి తననొకసారి అర్పించాక వాడు ఏమి చేసుకున్నా తనకు సంబంధం లేదనాలి.

తన దోషాలను అంగీకరించాలి. విశ్వాసంతో శరణాగతి చేసినవాడిలో ఈ ఆరు గుణాలు ప్రకాశిస్తాయి.

భగవంతుణ్ణి అనుకూలమే అనుకుంటారు చాలామంది. కాని ప్రాపంచిక వస్తువులు వదల్లేదు. నాది నాదనే 'మమత' పెంచుకుంటారు. నిజానికివన్నీ దేవునివే. మనం 'నాది' అంటున్నామంటే భగవంతుడి వస్తువునే దొంగిలిస్తున్నాం. వాడికి చెందినవిగా గుర్తించి, నేనూ వాడి దాసుణ్ణే కనుక ఆ సంబంధం 'నాది' అనవచ్చు కాని, అలా అనుకోవడం మనకి నచ్చదు. మన అభిమానానికి అడ్డొస్తుంది. ఇలాంటి కూడని అభిమానాలు ఎన్నెన్ని వస్తువుల మీదో పెంచుకుంటున్నాం. వాస్తవానికన్నీ మన హృదయానికి గుచ్చుకొనే శోకపు మేకులేనంటారు.

జీవుల కర్మానుగుణంగా ఈ వస్తువులన్నీ పరమాత్మే కల్పించి ఇచ్చాడు, కనుక ఇవన్నీ పరమాత్మవే అనాలి.

కాని 'ఈశ్వరోహం అహంభోగి' నేనే వీటికి ప్రభువును, నేనే ఇవన్నీ తయారు చేసుకున్నానంటాడు.

ఇది దురభిమానం కదూ! అది మేము వదలి వచ్చాము స్వామీ అంటోంది ఆండాళ్ ఈ రోజు.

'సుందరమైన విశాలమైన గొప్ప ప్రదేశములుగ ఈ భూమినంతటినీ పాలించిన రారాజులందరూ, ఒక నాటికి తమ తమ రాజరిక అభిమానాలను కోల్పోయి, గతిలేక నీ పాదాశ్రయం కోరి నీ పడకమంచపు కోళ్ళ వద్ద గుంపులు గుంపులుగా పడి ఉంటారు' స్వామీ! మేము అలానే ఇంతకాలానికి వచ్చి నీ పాద సన్నిధి చేరగలిగామే! ఏమాశ్చర్యం అంటోంది ఆండాళ్.

ఈ భూమినంతా అత్యంత సుందర రమణీయ ప్రాంతాలుగా తయారు చేశాడు పరమాత్మ. ఎందుకు? జీవులు కర్మానుగుణంగా వీరికి అనుభవింపచేయాలని. భూమి భగవానుడిదే. అనుభవింపచేసేది ఆయనే. కర్మకొద్దీ ఒక్కొక్కడికీ ఈ భూమి మీద చీమ పదవి, ఒక్కొక్కడికి బ్రహ్మ పదవి వస్తాయి. పదవికి తగ్గ అధికారం, అధికారానికి తగ్గ చోటు, నియంత్రణశక్తి లభిస్తాయి. లభించిన దానితో, ఇవి దేముడిచ్చాడని, నడిపించేది వాడే, వాని అనుగ్రహానికి ఇది సాధనం కావాలని తెలియాలి. కాని పదవి రాగానే గర్వం కూడా బయలుదేరి, ఇదంతా నాది, అదంతా నీది అంటూ పట్టింపులు, ఆక్రమణలు, అన్యాయాలు బయలుదేరుతాయి. ఒకడిదొకడు కొల్లగొడుతూ ఉంటాడు. ఇంద్రుణ్ణి బలిచక్రవర్తి లాగా. ఇది చూసి మధ్య మధ్యలో పరమాత్మే దిగివచ్చి తన పాదాలతో కొలిచి 'ఇదంతా నాదే, అయినా మీకు ఇస్తున్నాను జాగ్రత్తగా మెలగండి' అంటూ ఉంటాడు. కాని వీళ్ళకి లక్ష్యం ఉండదు. చీమకి చీమంత గర్వం. బ్రహ్మకి బ్రహ్మంత గర్వం.

తరించాలంటే బ్రహ్మ, చీమ కూడా పరమాత్మ మీదే ఆధారపడాల్సిందే. వారిరువురి ప్రయత్నం సాధకం కాదు. ఇరువురిలోను ఎవ్వరికీ త్వరగా ఫలసిద్ధి కలుగుతుందంటే, ఎవరికి తక్కువ అభిమానం ఉంటే వారికి ఏ యోగ్యతలు లేవు. ఏ అనుష్ఠానం చేతకాదనుకున్నవాడికి వదలాల్సిన బాధ్యతలు తక్కువగానే ఉంటాయి. కనుక వాడికి భగవత్సమాశ్రయణం, భగవద్రక్షణను అంగీకరించడం సులభం.

నాకెన్నో బాధ్యతలున్నాయని, నాకెంతో శక్తి ఉందని గర్వించే బ్రహ్మాదులకి, అన్నీ వస్తేనే కదా రక్షణ! అవి వదలడానికి ఏడేడు జన్మలూ చాలవు.

ఏడేడు జన్మలు సాధనలు చేసినా చతుర్ముఖాదులకి లభించని ఫలం కొందరికి ఏం చెయ్యకుండానే లభిస్తుంది. గోపికలంతే కదా! బ్రహ్మాదులకు మేము చెయ్యగలమనే గర్వం. మరి గోపికలకి తాము ఏమీ చేయలేమనే విశ్వాసం, గర్విష్ఠులకి వదలవలసినవి ఎక్కువ. బంధాలు ఎక్కువే కదా. మరి వీరికైతే ఏమీ ఉండవు. ఇద్దరికీ సాధనం దేవుడే. ఏమీలేని వాడు వెంటనే అంగీకరించి, చేయి ఆనందంతో చాస్తాడు. ఉన్నాయనుకున్నవాడు ప్రయత్నాలు చేసి చేసి, ఎదురు దెబ్బలు తిన్నాక కూడా మరి తనవల్ల కాదని గుర్తించాక అప్పుడు చేయి చాస్తాడు ఏడుస్తూ.

ఒకసారి నిన్ను చేరాక, మళ్ళీ రాజ్యమిచ్చి పొమ్మంటే, పాత కష్టాలు స్మరించి పోనే పోరట భయం వల్ల. నీ వద్దే ఉండిపోతామంటారు. నీ వద్దే ఉన్నాడు కనుకనే లక్ష్మణుడు ఏ నిందా పొందక పొగడబడ్డాడు. దూరంగా ఉన్నందువల్లే కదా తెలియని నేరం మోయవలసి వచ్చింది భరతునికి. దూరం కావలసి వస్తుందని రాజ్యమే వద్దన్నాడు లక్ష్మణుడు. అలానే రాజులంతా నీ మంచపు పాదాల వద్దనే ఉంటామంటారు.

ఆ గర్విష్ఠులు నిన్ను చేరడానికి ఎంతకాలం పడుతుందో స్వామీ! మేము నిన్ను చేరడానికంత కాలము పట్టింది. మా స్త్రీత్వాభిమానం దూరం చేసింది ఇంతకాలము. ఇది తొలగి నీ సన్నిధి చేరటం నీ ప్రయత్నమే. సముద్రంలో కొట్టుకుపోయేవాడికి ఓడ దొరికినట్లు ఇంతకాలానికి నిన్ను చేరామయ్యా!

పరమాత్మ మనకై సృష్టించిన అందమైన భూమి మనకిచ్చిన శరీరాలే. దీనిలో భోగాలు కర్మానుగుణంగా ఆయనే ఇచ్చి మన సేవగా తలవమన్నాడు. అది మరచి ఎన్నెన్ని జన్మలెత్తామో! తానే ఎన్నో సుకృత్యాలు చేర్చి ఈ మానవశరీరం, కృష్ణప్రేమని ఇచ్చుకున్నాడు.

మేం విడిన దూరం, నీ వద్దకు రావడంలోని దౌర్లభ్యం చూడవయ్యా! విడిన సీత తిరిగి రాముణ్ణి చేరడం ఎంత ఆశ్చర్యమో, మేము నిన్ను చేరడం అంతే ఆశ్చర్యంగా ఉంది. ఆ రాజులు శరీర రక్షణ కోసం వస్తారు. మేమేమీ ప్రయోజనం కోరకనే వచ్చాం తెలుసా? అన్నారు వీరు. 'సరి చేరిపోయారు కదా!' ఊరుకున్నాడు. 'చేరాం కానీ ఫలం చిక్కవద్దా?' 'ఏమది?' అడిగాడు స్వామి. నీవు నిదుర లేచే సౌందర్యం మేం చూడాలి

అన్నారు. నిదురించే నీవు చిరుమువ్వల గజ్జెల వలెనున్న నీ దివ్య నేత్రాలను పద్మము వికసిస్తున్నట్లు, అసలు పద్మాల్లా మెల్లగా తెరవాలి. అపుడు ఆ సౌందర్యం మేంచూడాలి అన్నారు. అంతలోనే నీ కంటికి పోలికలు కావు. అంతకంటే వేరు పోలికలు లేవు. నీ నేత్రాలకు అవే సాటి. వేరే పోల్చలేం.

ఆ వాత్సల్యపూర్ణ నేత్రాలను తెరచుచు, మెల్ల మెల్లగా మావైపు కటాక్షించవా! ఆ చూపుల్లో చల్లదనాన్ని, ప్రేమను ఒక్కసారి తెరచేస్తే మేం ఓర్చుకోలేం. ఆరార తెరచి, ఆ ప్రేమ మేం సహించగలిగాక మళ్ళీ తెరవాలి. స్వామీ! మా తప్పులు నీ కళ్ళను మూసుకొనేటట్లు చేస్తాయి. అమ్మ అనుగ్రహం వాటిని తెరిపిస్తుంది. మాకు బాగుపడే కాలం రాలేదని కనులు మూసుకుంటావు. మా ఆర్త ధ్వని తెరుస్తుంది. వాటిని ప్రథమ స్పందనం నుండి చూడాలనుకుంటున్నాము అన్నారు. 'పూర్తిగా మేం భరించగలిగాక అపుడు తెరిస్తే నీ రెండు నేత్రాలూ పూర్తిగా తెరిస్తే సూర్యచంద్రులు ఒక్కసారి ఉదయించినట్లు ఉంటుంది. సూర్యుని అంత కాంతి, చంద్రుని చల్లదనమున్నూ, ఒక్కసారే ప్రవహించే ఆ నేత్రాలతో మమ్మల్ని చూస్తే మామీదుండే శాపాలన్నీ పోతాయి తండ్రీ! అలా మమ్మల్ని అనుగ్రహించమని ప్రార్థించారు.

నీ చూపు వల్ల శరీరాభిమానం నశించింది. మేం స్వాతంత్ర్యం తొలగి నీవారమని తెలిసింది. అన్యులకు కాదు నీకే చెందినవారమని గుర్తించాం. మా రక్షణ భారం నీదేనని విశ్వసించాం. నీవే సర్వబంధువని ఆశ్రయించాం. ఈ జ్ఞానపు ఫలమంతా నీ తృప్తి కోసమే కాని మాకేమీ ప్రయోజనం వద్దని తెలిపింది ఆండాళ్ బృందం.

స్వామీ! నీ ఎడబాటే మా పాపం! అది నిన్ను చేరితేనే కద తీరేది! అనుగ్రహించు.

రుద్రుని శాపం అమ్మవల్ల పోయింది.

అహల్య శాపం నీ పాద రజ స్పర్శ వల్ల పోయింది.

దక్ష శాపం స్నానం వల్ల పోయింది.

మాకీ నాలుగు నీతో కావాలి. మా పాపాలు అప్పుడే తొలగుతాయి అనుగ్రహించు అంటూ మేల్కొలుపు పాడింది ఆండాళ్.

## 23వ పాశురము

**మారి మలై ముళఞ్జిల్ మన్ని క్కిడన్దుఅంగుమ్**
**శీరియశింగమఱివిత్తు త్తీవిళిత్తు,**
**వేరిమయిర్ పొంగ వెప్పాడుమ్ పేర్ న్దుదఱి,**
**మూరి నిమిర్ న్దు ముళంగి ప్పుఱప్పట్టు,**
**పోదరుమాపోలే నీ పూవైప్పూవణ్ణా, ఉన్**
**కోయిల్ నిన్ఱు ఇంగనే పోన్దరుళి, క్కోప్పుడైయ**
**శీరియ శింగాసనత్తిరున్దు, యామ్ వన్ద**
**కారియ మారాయ్ న్దరుళేలో రెమ్బావాయ్.**

తాత్పర్యము – వర్షాకాలమునందు పర్వతగుహలో ముదుచుకొని నిశ్చలముగ పడి యుండి నిదురించుచుండు శౌర్యము కల సింహము మేల్కొని, తీక్షణములైన తన చూపులను నలువైపుల ప్రసరింపచేసి, పరిమళము కల తన జూలు నిక్కబొడువ ఇటునటు దొర్లి, లేచి ఒడలు దులుపుకొని, మెల్లగ దేహమును సాగదీయుచు ఒళ్ళు విరుచుకుని, ఒక్కసారి గర్జించి, అడుగులు వేయుచు గుహనుండి బయల్వెడలినట్లే, ఓ అతసీపుష్పమును పోలిన దేహకాంతి కల స్వామీ! నీవు కూడా ఇటులనే మమ్ము అనుగ్రహించినట్లు నీ భవనమునుండి విచ్చేసి, సుందరముగా అలంకరింపబడిన జయశీలమగు శ్రేష్ఠమైన సింహాసనము నలంకరించి మేము వచ్చిన కార్యమును పరిశీలించి, మా కోరిక ననుగ్రహించుమా!

విశేషార్థము – 'వేరు గతిలేక నీ సన్నిధి చేరి పడి ఉండే వారిలాగే అనన్య గతికలమై మేము వచ్చాము' అన్నారు నిన్న. ఇది విన్న స్వామికి బాధ కలిగింది. నీళాదేవి ప్రక్కన ఉండగా నా వాళ్ళై ఉండి, 'గతిలేని వాళ్ళమనుకోవడం తప్పు. వీళ్ళ కోరిక తీర్చడంలో కొంచెం ఆలస్యమయిపోయిందే అని కృష్ణుడు పరితపించాడు.

పంచవటిలో ఋషులంతా శ్రీరాముని చూసి 'ఈ శరీరాలు ఋషులవి ఎలా శిథిలమైనాయో! రక్షకులు లేనందువలన' అని చూపిస్తే 'అయ్యో! నా అజాగ్రత్తే మీకిన్ని బాధలు కలిగించింది. నాకు చాలా సిగ్గుగా ఉంది. మీకడ్డు వచ్చే అసురులందరినీ నాశనం చేస్తా. ఆలస్యానికేమీ అనుకోవద్దు' అని బ్రతిమాలినట్లే కృష్ణుడు వీళ్ళని బ్రతిమాలుతానంటాడు.

లంక వదలి, ఆకాశంలో నిలబడి, ఆత్మార్పణ చేసిన విభీషణుని గురించి కోతులందరికీ నచ్చచెప్పి, అంగీకరించవద్దనిన సుగ్రీవుణ్ణే పంపించి విభీషణున్ని రప్పించి, 'అంత ఆలస్యమైనందుకు నన్నపార్థం చేసుకోకు, రా సోదరా!' అని కళ్ళతోటే అతణ్ణి త్రాగేస్తున్నట్లు దగ్గరకు తీసుకొని ఓదార్చాడు రాముడు. కృష్ణుడిలానే వీళ్ళని ఓదారుస్తానంటాడు.

ఏమీ సత్కరించని గుహుడు, తనను ఎదుర్కోడానికి రెండడుగులు వేసి రాగానే 'అబ్బా! అన్ని పూజలూ పూర్తయ్యాయి లేవయ్యా! చాలు' అంటూ గుహుడు రావడమే మహాగొప్ప అని రాముడు అనుకున్నట్లు, గోపికలింతమంది ఇలా నడిచివచ్చి ఎంత శ్రమించారని కృష్ణుడు అడగబోయాడు. 'పురుషుల కష్టాలకే అంత అండ నిలచిన నేను, మీలాంటి స్త్రీలను ఎలా వదిలేస్తానర్రా! ద్రౌపది కష్టాలు తీర్చేసి, అవతారం ముగిస్తూ', అన్ని కష్టాలు పడేట్టు చూస్తూ ఎందుకసలు నేనూరుకొన్నా వాళ్ళ బాధలకు నేనే కారణమైనానే' అనుకున్నట్లే, బాధగా 'ఏమర్రా! చెప్పండి నా భక్తులు గతిలేని వారెన్నటికీ కారు. ఏమిటి కోరి

వచ్చారు? తప్పక తీరుస్తా. అమ్మ పురుషకారం కూడా ఉందాయె' అడిగాడు స్వామి.

ఆండాళ్ వెంటనే స్వామీ! ఇక్కడే, ఇపుడే చెప్తే తరువాత 'నిద్రమత్తులో ఉన్నప్పుడేదో చెప్పారు' అనేస్తావు. గుర్తులేదు అనేయగలవు. కనుక లేచి సభాస్థలంలో దివ్యసింహాసనం పైకి రా. ఆడినమాట అది తప్పనీయదు. అక్కడ చెప్తాం అంది. నిజానికి వీళ్ళకి లేచి, నడిచే స్వామి అందం చూద్దామనే తప్ప, ఏ క్షుద్రకోరికలూ లేవు అడగడానికి. ఆయన లేస్తుంటే 'ఆగు ఎలా లేవాలో చెప్తా'మని క్రమాన్ని ఆజ్ఞాపిస్తోంది. నిన్న ఎలా కనులు ఎలా తెరవాలో శాసించింది. ఈరోజు ఎలా లేచి రావాలో శాసిస్తోంది. వీళ్ళ ప్రేమకి లొంగిన స్వామి 'శాసనానికి లొంగి అలానే చేసేటంత సులభుడై పోయాడు'.

ఆయన భవనంలోంచి బయటికి రావడానికి ఎలా రావాలో సింహంతో పోల్చి చెప్తోంది. ''వర్షాకాలపు పర్వత గుహలోంచి, ఆదమరచి నిర్భీతిగా నిదురించిన జంట సింహము కాలమైనపుడు తెలివి పొంది, కనులు తెరచి, తీక్షణముగా చుట్టూ చూచి, జూలు దులిపి, నిక్కబొడిచి, నాలుగు తెరగుల పొరిలి, జూలు దులిపి, కాళ్ళు చాపి, మూలుగుతూ సాగదీసి, వెన్ను లేపి, ఒళ్ళు కుదిపి, దిక్కులన్నీ పిక్కటిల్ల గర్జిస్తూ గమనిస్తూ గాంభీర్యములుట్టిపడే పరాక్రమ ప్రకర్షతో బయలుదేరి బయటకడుగు పెట్టినట్లు, మా స్వామీ కృష్ణా! నీవూ రావాలి'' అన్నారు.

'ఓ అలాగే. నృసింహం లాగానా, రాఘవ సింహం లాగానా? ఎలా రావాలి? అని అడిగాడు. ''అమ్మో! మేమేమీ హిరణ్యకశిపులమా, రావణులమా? ఆ సింహాలు పోలికకే తప్ప క్రౌర్యానికి కాదు. నిన్ను నీవు మరచావా స్వామీ? నీవు అతసీపుష్పం కంటే సుందరుడవు, సుకుమారుడవు కదా! పుష్పంలో పరాక్రమం లేదు. సింహంలో సౌకుమార్యాదుల్లేవు. నీలో ఆ రెండూ ఉన్నాయి'' అవి ప్రదర్శితమయ్యేట్టు దర్శనమియ్యి అన్నారు.

'సరి సరి! అయితే రండి. లోనికి వచ్చి సేవించండి' అన్నాడట. 'స్వామీ మేల్కొంటుంటే చూచాం ఏమి అందమో! ఇక నీ నడక సౌందర్యం కూడా సేవించవద్దా? కనుక, ముందు నందగోప భవనమన్నాం కద! ఇపుడు నీ ప్రాప్యదశలో నీ భవనమిది. దాన్లోంచి నీవు అడుగులిడుతూ నడచి 'ఇలా' విచ్చేయాలి' ఎలా నడవాలో గూడ నేర్పుతోంది మన ఆండాళ్.

'శార్దూల, సింహ, గజ, వృషభ గమనములు గల 'చతుర్గతి', నడక చక్రవర్తివి నీవు. వృషభ గర్వము, గజ గాంభీర్యము, సింహ తేజః పరాక్రమాలు, పులి చమత్కారపు దూకుడు నీ నడకలో మేము సేవించాలి'. నడిచాడు స్వామి. ఆపై నీవు కూర్చొనే అందము చూడవద్దూ! 'ఇదిగో! ధర్మాధర్మ జ్ఞానాజ్ఞాన, ఐశ్వర్యానైశ్వర్య, వైరాగ్యా వైరాగ్యాలనే వాటితో అలంకరించబడి ఈ విశ్వాన్ని శాసించజాలిన శక్తికి స్థానమై, ఆడినమాట తప్పనివ్వని గొప్ప సింహాసనమిది. ఎవ్వరి అడ్డూ అక్కడ లేదు. దానిపై నీవు కూర్చో. ఇప్పుడు మేమెచ్చిన పనేమిటో పరామర్శించి కృప జూపుమా! అన్నారు. అపుడే అడిగేయవచ్చు ఏమి కావాలో కాని అడగరు స్వామిని. సేవించడమే చాలు. ఏమీ అడగక తగదని, అమ్మ నేర్పుతోంది. భరతుడు తన కోరిక నీడేర్చుమని ఆశతో వచ్చి రమ్మని ప్రార్థిస్తే శ్రీరాముడు పాదుకలిచ్చి పంపేశాడు. స్వతంత్రుడు స్వామి. ఒకటి అడిగితే మరేదో ఇచ్చి పంపేయవచ్చు. అందుకే అడగలేదు ఇక్కడ.

స్వామిని చేరేదాకానే శాస్త్రం, నియమము. కటాక్షం లభించాక ఇక శాస్త్ర క్రమంలో సాగదు. అక్కడ ప్రమాణమున కందని ప్రేమానంద దివ్యానుభూతి లభిస్తుంది కదా! 'అత్యన్త భక్తి యుక్తానాం న చ శాస్త్రం నైవ చ క్రమః' తల్లి పిల్లకు, భార్యా భర్తలకు ఉండే ప్రేమానురాగాలు శాస్త్రం చెప్పక్కర్లేదు. శాస్త్ర పరిధిలో అవి ఉండవు. 'ఒకరినొకరు లేపుకుంటూ మంచులో నాన్నగారిని, అమ్మను, అన్నను, నీళాదేవిని ఇలా... ఎంత శ్రమపడ్డారర్రా! మిమ్మల్నెంత కష్టపెట్టానో కదా!' అంటూ ఆయన పడే బాధను ఉపశమింపచేస్తోంది ఆండాళ్.

సృష్టికి ముందు 'సదేవ, ఏకమేవ, అద్వితీయం' అంటూ, ఒక్కటే 'సత్' అనే తత్వం ఉంది. అతడే ఏ ఇతర అపేక్ష లేక తనలోని తేజస్, జలము, గంధము కల పృథ్విని వెలికి తీసి, పాళ్ళు వేసి కలిపి అండములు బ్రహ్మాండములన్ని ఒకే ఒక్క క్షణంలో అన్ని దిక్కుల వ్యాపించేట్లు తయారు చేసి, అండాధిపతిగ ఒక చతుర్ముఖుని సృష్టిస్తాడట. అతనికి వేదం నేర్పి అతనిలో తానుండి, అతని ద్వారా ఈనాడు చూస్తున్న చరాచరాత్మక జీవరాశులను ప్రాణులన్నింటిని సృజించి, తిరిగి వాటి సత్తా ప్రవృత్తులకై హృదయదేశంలో ఉంటాడు. ఇవన్నీ తనలోంచే వెలికి తీశాడు. తిరిగి ప్రళయంలో తనలో చేర్చుకొని ఒకడే ఉంటాడు. సృష్టించాక, సృజ్యవస్తువులు అన్నింటిలో ఉన్నాడు. కనుక వానిపేరు 'సత్, సత్' అంది ఉపనిషత్. తేడా ఏమంటే, ఒకనాడు సూక్ష్మరూపంలో చరాచరాలను తనలో కలిగి, ఆవేళ అవి కలవో లేవో అన్నట్లు, ఏదో ఒక్కటి మాత్రమున్నట్లు గుహలో సింహం వలె ఉంటాడు. తనలోంచి ఇవన్నీ వెలికి తీశాక స్థూలరూపంలో చరాచరాలన్నింటిలోనూ ఉంటాడు. ఒకనాడు వాటిని తాను శరీరంగా, చిన్నరూపంలో తిరిగి పెంచి లోపల ఉండి స్థూల శరీరంగా, తాను శరీరిగా ధరించి ఉంటాడు. ఈ కన్పడే చరాచరములన్నీ అతనిలోంచి వచ్చాయని ఆ ఉపనిషత్ చెప్పింది. సింహంలో పరాక్రమం, జూలు యొక్క గంధం లాంటివి బయట నడిస్తే తెలిసినట్లు, ఇప్పుడూ అప్పుడూ కూడా తాను వీటన్నిటితో కూడి ఉంటాడని ఆ ఉపనిషత్ ముందు దశని 'తత్' అనిన్ని, ఇప్పటి విస్తరించిన దశను 'త్వం' అని తెల్పింది.

మనమందరమూ, అలా నే అతణ్ణి మనలో ఆధారంగా కలిగి ఉన్నాము అంటూ 'తత్త్వమసి' వాక్యార్థాన్ని ఆ ఉపనిషత్ 9 సార్లు చెప్పింది. మన ఆండాళ్ దాన్ని సింహంతో పోల్చి రమణీయంగా వర్ణించింది ఈ పాశురంలో.

## 24వ పాశురము

**అన్ఱు ఇవ్వులగ మళన్దాయ్! అడి పోత్తి,**
**శెన్ఱంగు తెన్నిలంగై శెత్తాయ్! తిఱల్ పోత్తి,**
**పొన్ఱ చ్చగడ ముత్తైత్తాయ్! పుకళ్ పోత్తి,**
**కన్ఱు కుణిలా వెఱిందాయ్! కళల్ పోత్తి,**
**కున్ఱు, కుడైయా వెడుత్తాయ్! గుణమ్ పోత్తి,**
**వెన్ఱు పగై కెడుక్కుమ్ నిన్ కైయిల్ వేల్ పోత్తి,**
**ఎన్ఱెన్ఱున్ శేవగమ్ యేత్తి ప్పఱై కొళ్వాన్,**
**ఇన్ఱు యామ్ వన్దోం ఇఱంగేలో రెమ్బావాయ్.**

తాత్పర్యము – దేవతల రాజ్యములను అపహరించిన బలి యొక్క అభిమాన మడంచుటకై వామనుడవై బలిని యాచించి వెంటనే త్రివిక్రముడవై కఠినమైన ఈ లోకములను కొలచినవాడా! ఆనాడు కందిపోయిన సుకుమారమైన నీ దివ్య పాదారవిందముల కీనాడు మంగళమగుగాక!

నిన్ను నమ్మిన సీత లంకకు కొనిపోబడగా ఆమె కొఱకై లంకకు వెళ్ళి సుందరమైన ఆ లంకానగరమును నేలపాలు చేసినవాడా! ఆనాటి నీ బాహుబలమునకు ఈనాడు మంగళమగుగాక!

నీడకొఱకుంచిన బండిపై అసురుడావేశించగ, ఈ శకటాసురుని కీళ్ళూడునట్లు కాలును జాపి తాకించిన నీ కళ్యాణగుణకీర్తికి మంగళమగుగాక!

మాకు ఆధారమైనట్టి నిన్ను సంహరింపదలచి వచ్చిన ఇరువురిలో ఒకడైన వత్సాసురుని గోటిబిళ్ళవలె, రెండవవాడైన కపిత్థాసురుని పైకి విసిరి ఇరువుర నొకేమారు నేలకూల్చిన సమయాన ముందుకు జాపిన నీ శ్రీపాదమునకు మంగళమగుగాక!

ఇంద్రుడు ఆకలి కోపముచే రాళ్ళు వర్షించగా, వానినుండి గో గోపాలురను రక్షించుటకై సమీపమందున్న గిరినొకదానిని గొడుగుగ నెత్తి రక్షించిన నీ వాత్సల్యమునకు మంగళమగుగాక!

తన జయశీలతచే ఎదర్చిన శత్రువులను సమూలముగ నశింపచేయు నీ చేతిలోని బల్లెమునకు మంగళమగుగాక! ఇలా ఇలా నీ యొక్క వీరచరితమునే కీర్తిస్తూ నీనుండి పఱై అనుదానిని పొందునిమిత్తమై ఓ స్వామీ! ప్రస్తుతము మేము వచ్చితిమయ్యా! దయ చూపవయ్యా!

విశేషార్థము – భగవంతుణ్ణి గుర్తించిన చేతనుడికి భగవత్సేవ చేయడంలో రెండు దశలుంటాయి. 1. జ్ఞానదశ 2. ప్రేమదశ. మొదటిది కాయలాంటిది. తర్వాతది రసములూరే పండులాంటి స్థితి. జ్ఞానదశలో పరమాత్మ యొక్క పరతత్త్వ గుణాన్ని భావిస్తాడు. ఆయన సర్వజ్ఞుడు. సర్వశక్తి కలవాడు. జీవులందరినీ రక్షిస్తానన్నవాడు. మంచిగుణాలన్నీ కలవాడు. సమస్త విశ్వమూ తన సొత్తుగా కలవాడు అని తెలుస్తుంది. ఇక జీవుడనేవాడు తన స్వరూపం గురించి నేను అల్పుడను, అజ్ఞానిని, ఏవిధమైన శక్తి లేనివాణ్ణి, ఆయన చేత రక్షణ పొందాలి, నేను దుర్గుణాలకు ఆకరము. ఆయన వస్తువును నేను, అని తలచి దానికి తగ్గట్టుగానే భగవంతుణ్ణి రమ్మంటాడు. 'ఇంత చేసినా దయలేదా' అంటాడు, రక్షించమంటాడు. ఈ సంసార విషవలయం తప్పించమంటాడు. రక్షించడం ఆ దేవుని బాధ్యత అన్నట్టుగా నిర్బంధిస్తూ ఉంటాడు. ఈ జ్ఞానదశలో జీవ పరమాత్మల స్వరూపం స్పష్టంగా ఉన్నదున్నట్లు తెలిసిందన్నమాట.

ఈ జ్ఞానమే పండితే 'ప్రేమదశ' అంటారు. వీరూ భగవంతుని సౌలభ్యగుణాన్ని, ఆయన యొక్క అతిలోక సౌందర్యాన్ని భావిస్తారు. సౌగంధ్య, సౌకుమార్య, లావణ్యాది గుణ విశిష్టమైన మూర్తి వీరికి గోచరిస్తుంది ప్రేమలో. అతని గొప్ప పరత్వాన్ని, శక్త్యాదులను మరచిపోతారు. ఈ సౌకుమార్యాదులు తమ స్వంత స్వామివేనని తెలిసింది. అంతవాడింత సులభుడైపోయాడే, ఎవ్వరూ రక్షణ లేరే! ఎవరి చూపు పడి చెదరిపోతాడో, ఎక్కడ కందిపోతాడో, ఏ ప్రమాదమేర్పడుతుందో ఈ రూపానికి అన్పిస్తుంది. ఆయనలో శక్త్యాదులను మరచిపోయినట్లే, తమలోని చేతకానితనాన్ని, అజ్ఞత్వాన్ని మరచిపోతారు. ఆ భగవానుణ్ణి అశక్తి, అజ్ఞానం కల శిశువుగా భావిస్తారు. తమను సర్వమూ తెలిసిన తల్లిగా భావిస్తారు. అంటే ప్రేమ పెరిగే కొద్దీ స్వరూపం తారుమారైందన్నమాట.

జ్ఞానదశ అంటే, శక్తికల తల్లి, వయసులో ఉన్న పిల్లవాడి శక్తిని చూచి 'అంత బలిసి ఉన్నావు, నీ పని నీవు చేసుకోలేవూ?' అంటూ పిల్లవాణ్ణి కేకలేసి పని చేయించడం లాంటిది. ప్రేమదశ అంటే ఆమె ముదుసలి అయినా కొడుకు బలమూ, యవ్వనం తొణికిసలాడే వాడయినా అమ్మని శ్రమపెట్టడం ఇష్టం లేక వాని పని వాడే చేసుకుంటాను అంటే 'అమ్మో! అలసిపోతావురా! నేను చేసిపెడతానని' వాడి శక్తిని తన ప్రేమ కప్పివేస్తే, తన అశక్తి మరచి వాడికన్ని సేవలూ చేయడం లాంటిది. ఋషులంతా జ్ఞానదశలో ఉన్నవారు. ఆళ్వార్లలో ఈ రెండు దశలూ మారి మారి కన్పిస్తాయి. మన ఆండాళ్ తండ్రిగారు శ్రీవిష్ణుచిత్తుల వారిలో నిండు ప్రేమ దర్శనమిస్తుంది.

భగవదాజ్ఞతో పాండ్యసభలో పరతత్వ నిర్ణయం చేసిన వీరిని అంబారీపై ఊరేగిస్తుంటే పరివారంతో పరమాత్మ ప్రత్యక్షమయ్యాడు. మిగిలిన ఆళ్వార్లు 'రా! కన్పించు!' అని పిలిచేవారు భగవంతుణ్ణి. వీరివద్దకు పరమాత్మ తానే వస్తే 'అయ్యో! వీళ్ళందరి కళ్ళ ఎదుట పడితే నీ కాంతి కందిపోదా!

వెళ్ళిపో. అయ్యో నీ అందానికి దృష్టి తీయాలి' అంటూ ఒక ప్రబంధమే పాడారు. అదే 'పల్లాండు. పల్ = అనేక, ఆండు = సంవత్సరాలు. నీకు దృష్టిదోషం రాకూడదు గాక' అంటారు. దీనినే 'మంగళాశాసనమంటారు'. సాధారణంగా పెద్దలు పిల్లలకు చేసే ఆశీర్వచనం లాంటిదన్నమాట ఇది. 'మరి మనం చేయవచ్చా? పరమాత్మకి'. చేయవచ్చో కూడదో ఆలోచిస్తున్నామంటే ప్రేమ లేనట్లే. జ్ఞానదశలో ఉన్నామన్నమాట. అది మొదటిదశ. ప్రేమ అతిశయిస్తే క్రమం మరచిపోతుంది. 'శబరి ఎంగిలి పళ్ళను, విదురుడు కృష్ణునికి ప్రేమలో ఏం చేస్తున్నదీ తెలీక పండ్లు పారవేసి తొక్కలు పెట్టినా అంత ప్రేమతోటే ఈయన కూడా అవే తినేసి బ్రహ్మానందపడిపోయాడు కద!' అలాగే పెద్దలకి పిన్నలైనా మంగళాశాసనం చేయడం ప్రేమాధిక్యమున్న నాడు వద్దన్నా జరుగుతుంది. క్రమం తల్లక్రిందులౌతుంది. ఆయన రక్షింపబడే వాడైపోతాడు. మనమే రక్షించేవారం అని భావిస్తాం. దేవునికి ఆలయాల్లో రక్షణ కల్పించడమంటే ఈ భావనతో ఏర్పడ్డదే. మన ఆలయాలలో హారతి ఇవ్వడం లాంటిదే. ఆలయాల్లో పెద్ద సమూహంలో భక్తులంతా గోష్ఠిగా చేరేది ఈ మంగళాశాసనం పాడి రక్షణ కవచం వేయాలనే. ఆండాళ్ ఇంతమంది గోపికలతో బయలుదేరినది కూడా అందుకే. తలుపులు తాళాలు ప్రాకారాల నిర్మాణం ఆ ప్రేమతోటే చేస్తారు. ఆ భక్తుల ప్రేమపూర్వక మంగళాశాసనమే భగవంతునికి గొప్ప ప్రాకారం. అది లేకుండా బాహ్యంగా ఎన్ని నిర్మించినా, ప్రార్థనలు చేసినా, పూజలు పునస్కారాలు చేసినా దండగ. అలాంటి ప్రేమికుల కోసమే తాను ఆలయాల్లో ఉంటాడు. వాని కోసం వారూ అంత జాగరూకులై కాపాడుకుంటూ ఉంటారు. అది తెలియని కొందరు దేవునికి ఇవన్నీ ఎందుకు? అలాంటి వాడేమి దేవుడు అంటూ అమాయక ప్రలాపాలు చేస్తుంటారు.

ఈ పెరియాళ్వార్ల ముద్దులొలికే ముగ్ధ కన్నెయే మన ఆండాళ్. కనుక ఈమె కూడా నాన్నగారి కంటే అధిక ప్రేమతో మంగళాశాసనం చేస్తుందీనాడు శ్రీకృష్ణుని సేవించి. మన ఇతిహాసాల్లో పెద్దలందరిలోనూ ఈ ఆచరణే ప్రమాణంగా కన్పిస్తోంది. ముందు రామాయణం చూడండి.

'అహంవేద్మి' రాముడంటే సర్వేశ్వరుడని నాకు బాగా తెలుసునన్న విశ్వామిత్రుడు తాటక సంహార సమయంలో ఆమె వీరి మీదికి దూకుతుంటే శ్రీరామసౌందర్యం సేవించిన ప్రేమపారవశ్యంతో, రామశక్తిని అంతలోనే మరచి, 'స్వస్తి రాఘవయోరస్తు', 'రామ లక్ష్మణులకు మంగళమగుగాక!' అన్నాడు.

సీతాకళ్యాణం కాగానే తిరుగు ప్రయాణంలో దారిలో పరశురాముడొచ్చినపుడు, రాముని పరాత్పరత్వం మరచిపోయి, బాల్యమే కన్పించింది తండ్రికి. 'అభయం దాతు మర్హసి' నా చిన్నపిల్లవానిని ఏమీ చేయనని చెప్పవా అంటూ మంగళం పాడి బ్రతిమాలుతూ మూర్ఛపోయాడు దశరథుడు.

సీతారాముల కళ్యాణంలో పాణిగ్రహణం కాగానే ఆ రెండు శ్రీహస్తముల కాంతికేమి భంగము వాటిల్లునోనని 'భద్రంచేత ప్రతీచ్ఛ చేనాం', 'ఈమెను గ్రహించు నీకు మంగళమన్నాడు' జనక చక్రవర్తి. అంతకంటే జ్ఞానులూ తపశ్శాలురైన దండకారణ్య ఋషులంతా తత్త్వవేత్తలై ఉండికూడా, శ్రీరాముని అందం చూసి శక్తిమరచి 'మంగళాని ప్రయుంజానాః ప్రత్యగృహ్ణన్' మంగళాశాసనం చేయకుండా ఉండలేకపోయారు.

జటాయువు ఒక పక్షి. శ్రీరాముని చూచి సీత లభించువరకు నీకే ప్రమాదమూ రాకుండుగాక! 'యాం ఓషధిమివాయుష్మన్ అన్వేషసి మహావనే' అంటూ ఆశీర్వదించి ప్రాణం వదిలింది. ఇది తగునా అని ఆలోచిస్తే తెలియదు. ప్రేమలేని హృదయం ఉండటం వల్ల మన లోపమే అది. కోతి హనుమ శ్రీరాముని మొదటిసారి చూస్తూనే 'కిమర్థం న విభూషితాః బాహవః', 'చేతులారా అలంకారాలతో కప్పుకోకుండా ఉన్నావే? ఎవరిచూపైనా పడితే వాడిపోవు?' అన్నాడు. ఎన్నని చెప్తాం? సీత సుగ్రీవుడు అయోధ్య పురజనులు అందరూ ప్రేమతో శ్రీరామునికి మంగళం పాడినవారే. ఇక భాగవతంలోకి వస్తే కృష్ణుని విషయంలో నందుడు, గోపికలు, జైలులో వసుదేవుడు, దేవకీదేవి, విదురుడు చెప్పుకుపోతూ ఉంటే భక్తులంతా మంగళాశాసనపరులే. భగవానుని నిష్కల్మషమైన ప్రేమతో ఆశీర్వదించారు. ఈనాడు మన ఆండాళ్ అదే చేస్తోంది.

స్వార్థం కల అర్జునుడు ''సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ'' అనగానే చిత్తం అంటూ నిలబెట్టాడు రథాన్ని. ఇక ప్రేమమూర్తులయిన గోపికలు చెప్తే చేయడూ మరి. లేచి రమ్మనగానే నడువసాగాడు. 'ఇంగనే!' అన్నారు. ఇలా ఇలాగంటూ చూపారు. అలానే చతుర్గతితో, వీళ్ళని కాస్త అల్లరి పెడదామనే చిలిపివాడు కావడంతో పాదాలు ఎత్తి ఎత్తి నడుస్తున్నాడు. వీరూ వెనుకనే నడుస్తున్నారు. స్వామి పాదాల ఎఱ్ఱదనం వీరికి కనిపిస్తోంది. ఆసనంలో అమ్మతోపాటు కూర్చున్నాడు. ఒక పాదం క్రింద చాపి రెండవ పాదం తొడపై పెట్టాడు. ఆ పాదం వీరికి కన్పిస్తోంది. పైగా అరికాలు ఊపుతున్నాడు కూడా. వీళ్ళు ఆ ఎఱ్ఱదనం చూచి అది సహజమైన రంగే అయినా తాము నడిపించినందువల్ల కందిపోయిందని కలత చెందారు. ఏదో అడగాలని వచ్చామన్నది మరచారు. శ్రమ పరిహారం కోసం మంగళం పాడనారంభించారు.

పద్మపుత్రియైన, అత్యంత సుకుమారి లక్ష్మీదేవి కూడా స్పృశించడానికి ఎక్కడ కందిపోతాయోనని బెంగపడే పాదారవిందాలవి. గోపికలు తమ శిరస్సులపైన, వక్షస్థలంపైన సేద తీర్చుకునే పాదారవిందాలవి. అట్టివాటిని, ప్రేమ ఉందనుకుని

నేలపై నడిపించి కందిపోయేట్లు చేశామే. స్వార్థపరులైన దేవతల కోసం ఎన్నో సార్లు భూమిపై సంచరించినపుడు కూడా ఇలాగే కందిపోయి ఉండవచ్చు. స్వామి సౌకుమార్యాన్ని చూడకుండా ఆనాడు వాళ్ళు ఇలానే త్రిప్పారే, మేము అదే చేశామే ఎంత కఠినులము మేము అని నొచ్చుకున్నారు.

ఈనాడు ఈ శ్రమతో పాటు ఆనాడు త్రివిక్రముడై భూమి కొలిచినప్పుడు కలిగిన శ్రమకు మంగళం పాడసాగారు. అప్పటిదానికి ఇప్పుడెందుకు? అనిపిస్తుంది మనకైతే. కాని భక్తులకు, భగవానుడు కాలమనే ఉపాధి అడ్డు తీసేస్తాడు. అప్పటివీ ఇప్పటివీ అన్నీ వీరికి ఎదురుగానే సాక్షాత్కరిస్తున్నాయి. ఆయా కాలాల్లో కలిగిన శ్రమకు అప్పుడెవరూ దృష్టి తీయలేదే! ఆ లోపం తీరేట్టు ఇప్పుడు మంగళం పాడదాం అంటూ షడ్రసోపేత భోజనం చేస్తున్నట్లు పోత్తి, పోత్తి అంటూ ఆరుసార్లు మంగళం పాడింది.

'అడగడని వారందరి తలలపై కాదు, మోడనక, కొండ, గుట్టనక, మట్టి, ముల్లనకా ఈ లోకమంతా కొలిచి ఇంద్రునికి రాజ్యం, బలికి కీర్తినిచ్చి నీ పుష్పహాస కోమల సుకుమార పాదాన్ని ఎంత శ్రమ పెట్టావయ్యా! కృతజ్ఞతా సంతోషం రెండూ తెలియని భూమిని కొలచి బలి అభిమానాన్నుంచి కాపాడినట్లే మా స్త్రీత్వాభిమానాన్నుంచి మమ్ము కాపాడి నీ పాదాల దాసులుగా చేసుకొన్నావే! మా అభిమానాన్నుంచి సన్మార్గంలో నిలిపేది నీ శ్రీపాదమే. ఆ వాత్సల్యపూర్ణమైన శ్రీపాదానికి మంగళం. ఆనాడెవ్వరికీ ఆ జ్ఞానమే లేకపోయింది. ఆ లోటు తీర మేమీనాడు పాడుతున్నామయ్యా!' అంటూ మంగళం పాడారు.

ఇంతలో మరొకటి గుర్తుకొచ్చింది. రామావతార సమయంలో జరిగినది. కదలక కొలిచిన ఆ పాదం సంగతలా ఉంచండి. అయోధ్య నుండి లంకానగరం దాకా నడచిన ఈ పాదం చూచారా? ఆనాడు త్రివిక్రముడై కొలిస్తే ఆ పాదాన్ని బ్రహ్మ కడిగే, శివుడు శిరమున ఆ తీర్థాన్ని దాల్చే, దానికేమీ పధ్నాలుగు సంవత్సరములు దారీ తెన్నూ లేని కారడవిలో తెగించి నడచిన పాదము మా శ్రీరామునిది. పైగా పాదుకలు కాస్తా భరతుడు తీసుకొనిపోయాడు. పులి ఉండే పొదలో దూరి దాన్ని లాగి చీల్చినట్లు రావణుడే లంక చేరి ఏ ఇతర సహాయమూ లేకుండా దేవతలందరినీ గడగడ లాడించిన రావణుడిని చిత్రవధ చేసి చంపాడు శ్రీరాముడు అంటూ శ్రీరామునికి రక్షగ బలమున్న ఆ బలానికి రక్షగ మంగళం పాడారు.

ఇంతలో కృష్ణుని చిన్నతనం గుర్తొచ్చింది. వెంటనే ఆ రాముడికేమి చక్రవర్తైన దశరథుడు తండ్రి. రాముడు బలాఢ్యుడు. శస్త్రధారి. గురువులు మంత్రవేత్తలు. ఆయన కోసమెందుకర్రా బెంగ? మన కృష్ణుడి సంగతి చూడండి. మూడవ నెల నిండకుండానే తల్లి కావాలని పరుండబెట్టింది అసురుడున్నాడని తెలియక బండిక్రింద. ఆనాడిక రక్ష ఎవరు? మన కన్నయ్యకి, మనకి. ఆయన శ్రీపాదమొకటుంది. ఎదుట పడని ప్రచ్ఛన్న శత్రువుని గుర్తించి ముందుకు సాగి తాకిందంతే. శకటాసురుడు కీళ్ళూడిపడ్డాడు. ఆ పాదం చాపిన కీర్తికి మంగళం పాడుదాం. శ్రీకృష్ణుని పరాభిభవన సామర్థ్యానికి పల్లాండు!

అంతకంటే మరొకటి తాను దూడలంటే వెంట పడతాడని వత్సాసురుడు, వెలగచెట్లెక్కుతాడే కృష్ణుడని కపిత్థాసురుడు మాటలాడుకొని ఒకేసారి అనుకూలురు లాగ వస్తే దూడని పట్టుకొని వెలగచెట్టుకి కొట్టి ఒకేసారి ఇద్దరినీ నేలకూల్చాడు. అప్పుడు వంచిన ఆ త్రిభంగి పాదానికి పాడాలి మంగళం.

ఏ ఇంద్రుడి కోసం ఇవన్నీ చేశాడో, వాడే భగవద్ద్రవ్యాన్ని దొంగిలించాలని అనుకున్నాడొకసారి. సాగనివ్వని కృష్ణుని మీద కోప్పడి రాళ్ళవాన కురిపిస్తే, ఆకలి కోపంలే పాపం! అదే పోతుందని సహనంతో ఏడు దినాలు గోవర్ధనాన్ని ఒంటివేలుపై నిలిపి గో గోప గోపీజనాన్ని కాపాడావే! తండ్రీ! నీ సహనగుణానికి మంగళం.

అయ్యో! ఇలా ఇన్ని గుణాలున్నాయని అన్నామంటే దృష్టి తగులుతుంది. అసలివన్నీ నీ గొప్పలు కావయ్యా! నీ చేత పట్టిన బల్లెం ఇన్ని చేస్తుంది. ఆశ్రితుల శత్రువులను సంహరించేది అదే. అది స్వామి చక్రమే అన్ని రూపాల్లో ఉంటుంది కదా అని మంగళం పాడుతున్నారు.

లోకులు నీ వద్ద చేరినా క్షుద్రకోరికలు అడుక్కోవడమే చేస్తారు. మాకు ఇతరములు ఇవ్వవద్దు, నీవు అసలేమీ ఇవ్వవద్దు! మేము నీకు మమ్మల్నిచ్చి పైగా సేవలు చేస్తాం. ప్రీతితో చేస్తాం అన్నారు. ప్రేమ వల్ల పాట వస్తుంది. ఈ ప్రేమ ఎన్నటికీ తరిగిపోదు. కనుక ప్రేమ ఉన్నంతవరకూ ఈ పాట కూడా పోదు. ఆ పాటే మంగళం. దానికోసం తప్ప ఏదో పఱై కోసం వచ్చినది. నీ కీర్తిగానమే ప్రయోజనం. ఊరివారంతా మమ్మల్ని అంగీకరించారనే కృతజ్ఞతతో వారి కోసం పఱై నువ్విస్తానంటే పుచ్చుకుంటున్నాం అంతే.

మాలో మంచి బుద్ధి ఉన్న ఇప్పుడు, పెద్దలు అంగీకరించిన ఇప్పుడు, ఆ రోజుల్లో ఎవరూ నీ శ్రమ చూడక, ఆ శ్రమ తీరా పాడాలనే జ్ఞానం మాకు కలిగిన ఇప్పుడు, విశ్లేష వ్యధ నోర్వజాలని మేము మా బింకము వదలి వచ్చాము. నీవే రావాల్సి ఉండగా మేము వచ్చాము. నీవూ మమ్మల్ని పరీక్షించడం మానవద్దూ! ఇక అనుగ్రహించవయ్యా అన్నారు. స్వామి చిరునవ్వులు చిలికిస్తూ... చూస్తున్నాడు.

మేమెన్ని అన్నా మా ప్రార్థన కాదు సాధనం! మరి? నీ దయ అంతే. దయ చూపుము అని అడగడం కూడా తగదు. కేవలం నీ దయ, మా ప్రాప్తం అంటూ మంగళాశాసనం చేస్తోంది ఆండాళ్.

★★★



# మహిళల ప్రీతికర పర్వం రాఖీ పర్వం

: చిల్లర సీతారామారావు

**విష్ణుమూర్తి జన్మనక్షత్రము శ్రవణము. శ్రవణా నక్షత్ర సమీపమున చంద్రుడు చరించు మాసము శ్రావణమాసము. ఆహ్లాదకరమైన ఈ మాసమున పుణ్యప్రదాయకమైన, ఆహ్లాదకరమైన పర్వములు ఉన్నాయి. శ్రావణ శుక్ల పూర్ణిమ నాడు వచ్చు పర్వము రాఖీ పర్వము. మహిళలకు అత్యంత ప్రీతికరమైన పర్వం రాఖీ పర్వం. ఈ రోజున సోదరులకు సోదరీమణులు రాఖీలు కడతారు.**

రాఖీ పర్వమునకే రక్షాబంధనము అని మరో పేరు. రక్ష అనుదానికి తోరము అని అర్థము. బంధనము అనగా కట్టుబడి యుండుట అని అర్థము. రక్ష (తోరము) ను కట్టించుకొనినవాడు, రక్ష (తోరము) ను కట్టినవారికి రక్షణగా నిలబడతాడు. అందువలన ఈ పర్వమునకు రక్షాబంధనము అని పేరు వచ్చిందని పెద్దలు చెబుతున్నారు. రక్షాబంధనమునకు ఉపయోగించు తోరమును పట్టుదారముతో గాని, నూలు దారముతో గాని చేస్తారు.

రాఖీ పర్వము మహిళలకు చాలా ఇష్టమైన పర్వము. శ్రావణ మాసము రాగానే రాఖీ పర్వము ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటారు. రాఖీ పండుగకు రెండు మూడు రోజుల ముందే రాఖీలను కొని పెట్టుకుంటారు. రాఖీ పండుగ రోజున అక్క చెల్లెళ్ళు, తమ సోదరులు ఆయురారోగ్యములు, సుఖసౌఖ్యాలు, సిరిసంపదలు మున్నగు వాటితో జీవితాంతం కళకళ లాడుతూ ఉండాలని ఆకాంక్షిస్తూ వారికి రాఖీని కడతారు. సోదరి కట్టు రాఖీ సమర్పణ, నిష్ఠ, సంకల్పబలమును సూచిస్తుంది. రాఖీ కట్టించుకొనిన సోదరుడు తనకు జీవితాంతము సర్వవిధములా ఆదుకుంటూ, అండగా నిలబడతాడు అని ఆశిస్తుంది. సోదరుడు కూడా అండగా ఉంటాను అని భరోసాను కలిగిస్తాడు.

రాఖీ పర్వమును జరుపుకొనుటకు అపరాహ్ణ తిథిని తీసుకుంటారు. రాఖీ పండుగ రోజున ప్రతి సోదరి వేకువ జాముననే లేచి స్నానాదికములు ముగించుకుని, సోదరుని కోసం పలు రకములైన స్వాదిష్టములైన వంటకములను తయారు చేయడానికి పూనుకుంటుంది. పూజామందిరమును శుభ్రం చేస్తుంది. మందిర మధ్యభాగమున ఒక నాలుగు కాళ్ళ పీట ఏర్పాటు చేస్తుంది. ఆ పీట మీద ఒక కలశమును ఉంచుతుంది. ఆ కలశము మీద రక్షా సూత్రమును ఉంచి దానికి యథావిధిగా పూజలు చేస్తుంది. సోదరుడికి తూర్పుదిక్కున పీట వేసి కూర్చుండబెడుతుంది. సోదరుడి నుదుట తిలకమును దిద్ది హారతినిస్తుంది.

**శ్లో ॥ "యేనబద్ధో బలీ రాజా దానవేంద్రా మహాబలః**
**తేన త్వామను బధ్నామి రక్షో మాచల మాచల"**

(ఓ రక్షా! దానవ ప్రభువు అయిన బలిచక్రవర్తిని బంధించిన దుష్కార్యాలన్నింటినీ నీ యందు నేను బంధిస్తున్నాను. నీవు కదలకుండా ఉందువు గాక) అను ఈ మంత్రమును చదువుతూ రాఖీని తన సోదరుడికి కడుతుంది. రాఖీ కట్టడం వలన అపమృత్యు దోషాలు తొలగిపోతాయి. రాఖీ కట్టునది చెల్లెలు అయితే తన సోదరుడి పాదములకు నమస్కరించి ఆశీర్వాదములను తీసుకుంటుంది. రాఖీ కట్టినది అక్క అయితే సోదరుడు ఆమె పాదములకు నమస్కరించి దీవెనలు తీసుకుంటాడు. రాఖీ

కట్టించుకొనిన తరువాత సోదరుడు తన శక్త్యానుసారము సంతోషముతో పట్టుచీరలు, నగలు, ధనము మున్నగునవి వారికి ఇచ్చి ఆనందపరుస్తాడు.

రాఖీని భార్య భర్తకు కట్టాలని శాస్త్రము. ఆచరణలో అది మార్పు చెంది సోదరి సోదరునకు కడుతూ ఉన్నదని వ్రతోత్సవ చంద్రిక వివరిస్తోంది. వీటికి సంబంధించిన కథలు ఇలా ఉన్నాయి. మొదటిది భార్య భర్తకు రాఖీ కట్టుట.

పూర్వకాలమున యుద్ధమునకు వెళ్ళు భర్తలకు భార్యలు వారి రక్షణార్థము, తమ మాంగల్య సుస్థిరత కోసం రక్షాబంధనమును మంత్రపూర్వకముగా కట్టెడివారు. దేవతలకు, దానవులకు భయంకరమైన యుద్ధము పన్నెండు సంవత్సరముల పాటు జరిగింది. ఆ యుద్ధములో దేవతలు పరాజితులు అయ్యారు. పరాజితుడైన ఇంద్రుడు ఒకచోట రహస్యముగా దాగి, తగిన సమయం కొరకు ఎదురు చూస్తూ, కాలము గడపసాగాడు. ఒకనాడు ఇంద్రుడు తన భార్య శచీదేవితో వెళ్ళి దేవతల గురువు బృహస్పతిని కలుసుకొని తన మనోవ్యథను వెల్లడించాడు. ఆచార్యా! ఓటమి నన్ను బాగా క్రుంగదీస్తున్నది. ఇక్కడ నేను సురక్షితముగా ఉండలేకపోతున్నాను. నా క్షోభ తీరవలెనంటే నేను తిరిగి దానవులతో యుద్ధము చేయాలి. ఆ యుద్ధములో వారిని ఓడించాలి. అప్పుడే నా మనస్సుకు శాంతి లభిస్తుంది. కనుక నాకు తగిన ఉపాయమును తెలియజేయండి అని ప్రార్థించాడు. ప్రక్కనే ఉన్న శచీదేవి ఇంద్రుడితో నాథా! మీరు ఇంత వ్యథ చెందవలసిన పని లేదు. రేపు శ్రావణ శుద్ధ పూర్ణిమ. రక్షాబంధన దినము. దానవులతో జరుగు యుద్ధమున మీకు విజయము చేకూరడానికి, నేను విధి విధానములతో పూజ చేసి రక్షాసూత్రమును ఏర్పాటు చేస్తాను అని ఓదార్చింది. శ్రావణ శుద్ధ పూర్ణిమ నాడు బృహస్పతి పూజలు చేయించి, శచీదేవి చేత మంత్రబద్ధమైన రక్షాసూత్రమును ఇంద్రుడి ముంజేతికి కట్టించాడు. రక్షాసూత్ర ప్రభావము వలన దేవేంద్రుడు దానవులతో యుద్ధము చేసి వారిని పరాజితులను కావించాడు. శచీదేవి ఇంద్రుడి చేతికి బంధించిన రక్ష కాబట్టి దీనికి రక్షాబంధనము అని పేరు. ఇది ఆనాటి రక్షాబంధన పద్ధతి. ఆనాడు శుభములను కోరుతూ భార్యలు భర్తలకు రక్షాతోరములను కట్టెడివారు. కాలక్రమేణా రక్షాబంధన పద్ధతులలో మార్పు చోటు చేసుకున్నది. సోదరి సోదరునకు రక్షాసూత్రమును కట్టు ఆచారము ఆరంభమైంది.

సోదరి సోదరునకు రక్షాబంధనమును కట్టుట : ఒకనాడు శ్రీకృష్ణుడు చాకుతో ఫలమును కోసుకొని తింటూ ఉండగా అకస్మాత్తుగా చాకు తగిలి చేతికి గాయమయింది. రక్తము స్రవించసాగింది. దానిని గమనించిన ద్రౌపది తన చీరకొంగును చింపి శ్రీకృష్ణుడి చేతికి కట్టు కడుతుంది. ఆ కారణముగానే శ్రీకృష్ణుడు ఒక సోదరుడిగా వస్త్రాపహరణ సమయమున చీరలు ఇచ్చి రక్షించాడు.

బలి చక్రవర్తికి ఇచ్చిన మాట ప్రకారం మహావిష్ణువు బలిచక్రవర్తితో కలిసి పాతాళ లోకమునకు వెళ్ళిపోయాడు. లక్ష్మీదేవి మహావిష్ణువును వైకుంఠమునకు తీసుకుని వద్దామని సంకల్పించుకున్నది. ఒక బ్రాహ్మణిగా పాతాళ లోకమునకు వెళ్ళింది. శ్రావణ శుద్ధ పూర్ణిమ నాడు రక్షాబంధన సందర్భముగా ఆ బ్రాహ్మణి బలిచక్రవర్తి చేతికి రాఖీని కట్టింది. బలిచక్రవర్తి ఆనందించి బ్రాహ్మణికి సోదరునిగా అండగా ఉంటానని ప్రతిజ్ఞ చేస్తాడు. వెంటనే బ్రాహ్మణి లక్ష్మీదేవిగా మారి తనతో పాటు విష్ణువును వైకుంఠమునకు పంపమని అడుగుతుంది. లక్ష్మీదేవి కోరికను మన్నించి బలిచక్రవర్తి మహావిష్ణువును వైకుంఠమునకు వెళ్ళాడానికి అంగీకరిస్తాడు.

రక్షాబంధన పద్ధతుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఒక స్త్రీ ఒక పురుషుడికి అతడు తన సోదరుడు కాకపోయినా, సోదరుడిగా భావించి రాఖీని పంపి అతడి నుండి రక్షణ పొందే పరిస్థితి ఏర్పడింది. మొగల్ పాదుషా హుమాయున్ చిత్తోడ్ దుర్గం మీద దండెత్తి యుద్ధం చేస్తాడు. భయంకరంగా సాగిన ఆ యుద్ధంలో చిత్తోడ్ రాణా సాంగా మరణిస్తాడు. భర్తను కోల్పోయిన చిత్తోడ్ రాణి కర్ణావతి తన ప్రజల సంరక్షణార్థం హుమాయూన్ కు ఒక సోదరిగా రాఖీని పంపిస్తుంది. ఆ రాఖీని అందుకున్న హుమాయూన్ చిత్తోడ్ రాణి కర్ణావతిని తన సోదరిగా స్వీకరించి, ఆమె కోరిక ప్రకారము యుద్ధమును విరమించుకుంటాడు. మరొకసారి గుజరాత్ పాదుషా రాజు లేని రాజ్యము అని భావించి దండెత్తుతాడు. ఆ సంగతి తెలుసుకుని ఢిల్లీ పాదుషా హుమాయూన్ తన సైన్యముతో వచ్చి గుజరాత్ పాదుషాతో యుద్ధము చేసి చిత్తోడ్ ను రక్షిస్తాడు.

వర్తమాన కాలములో అన్నదమ్ములు లేని మహిళలు రాఖీ పండుగ రోజున బాగా పరిచయం ఉన్న వ్యక్తులకు రాఖీలు కట్టి తమ సోదర ప్రేమను వ్యక్తీకరిస్తారు. రాఖీను కట్టించుకొని వారు, రాఖీని కట్టినవారిని తమ సోదరిగా భావించి, ఆమె రక్షణ బాధ్యతను స్వీకరిస్తారు.

శ్రావణమాస శుద్ధ పూర్ణిమ నాడు వచ్చు రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళ మమతానురాగాలకు, అనుబంధాలకు ప్రతీక. రాఖీపండుగ విశ్వాసము, రక్షణ, ఆపత్కాలమునందు రక్షణగా నిలబడతారన్న విశ్వాసమును నింపుతుంది. రాఖీ శక్తి మహత్తరమైనది. ఈ శక్తి ముందు లోహపు సంకెళ్ళ శక్తి ఎందుకూ పనికిరాదు.

శ్రావణ శుద్ధ పూర్ణిమ నాడు రాఖీ పండుగను సోదరీమణులతో కలిసి ఆనందోత్సాహములతో జరుపుకుందాం. సోదరీమణులకు రక్షణ కవచములుగా నిలబడుదాం. సంస్కృతీ సంప్రదాయములను రక్షించుకుందాం.



# శుభకర శ్రావణ పూర్ణిమ

- డా॥ దేవులపల్లి పద్మజ

**మన హైందవ సాంప్రదాయములో సంవత్సరంలో వచ్చే పౌర్ణమి రోజులలో శ్రావణ పౌర్ణమికి ఒక ప్రత్యేకత ఉంది. గాయత్రీ మంత్రోచ్చారణ, జ్ఞానప్రదాత హయగ్రీవ జయంతి, అన్నా చెల్లెళ్ళ పండుగ మొదలైన విశేషములను ఒకే రోజున నిర్వహించుకునే ముఖ్యమైన రోజు.**

"జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిం ।
ఆధారం సర్వవిద్యానాం శ్రీహయగ్రీవముపాస్మహే"॥

అనే మంత్రానుష్ఠానముతో హయగ్రీవుని ఆరాధన చేయటం జరుగుతుంది. విద్యా, జ్ఞాన సంపదలను అనుగ్రహించే హయగ్రీయ కవచ పారాయణ కూడా అత్యంత ఫలప్రదము. ఇది శ్రావణ పౌర్ణమిరోజున జరుపుకునే మొదటి ప్రత్యేకత.

ద్వితీయ విశేషం శ్రీగాయత్రీ ఆరాధన. విధివిధానాలతో చేసే గాయత్రీ మంత్ర అనుష్ఠానము సకల విద్యలకు నెలవు. ఈ రోజు మంత్ర ప్రక్రియలతో నూతన యజ్ఞోపవీతమును పురుషులు ధారణ చేసి, పాత యజ్ఞోపవీతముతో దానిని అనుసంధానము చేయాలి. తదుపరి పాత యజ్ఞోపవీతమును విసర్జన చేయాలి. గాయత్రీ మంత్రము అన్ని మంత్రాలలోకెల్లా శ్రేష్ఠమైనది. 'గయాన్ త్రాయతే ఇతి గాయత్రి', శంకరుని భాష్యం ప్రకారం ప్రాణాన్ని రక్షించేది గాయత్రి. పరబ్రహ్మ, పరమాత్మల క్రియాభాగం గాయత్రి. పరమశివుడు బ్రహ్మానందంలో తన ఢమరుకంలో చేసిన 24 ధ్వనులే శ్రీగాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలు. ఇవి 24 దైవిక శక్తులకు ప్రతీకలు. వీటిలో 12 వైదిక మార్గాలు కాగా, 12 తాంత్రిక మార్గాలు.

విఘ్ననాయకుడైన వినాయకుడు, పరాక్రమ శక్తికి అధిపతి. నృసింహస్వామి, పాలనా శక్తికి అధిపతి శ్రీమహావిష్ణువు, జీవుల ఆత్మ పరాయణత్వ ప్రదాత శివుడు, యోగశక్తి అధిపతి శ్రీకృష్ణుడు, ప్రేమాధిక్యతకి రాధాదేవి, వైభవ శక్తులకి లక్ష్మీదేవి, తేజోమూర్తి విరాజిత అగ్నిదేవుడు, రక్షాశక్తి ఇంద్రుడు, విద్యాజ్ఞాన ప్రదాత సరస్వతీమాత, దమనశక్తి స్వరూపిణి దుర్గాదేవి , నిష్ఠాశక్తి హనుమంతుడు, ధారణాశక్తియుత భూదేవి, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ, మర్యాద కీర్తి ప్రదాత శ్రీరాముడు, ఆధ్యాత్మికోన్నత స్థాయి సీతాదేవి, మానసిక శాంతి ప్రదాత చంద్రభగవానుడు, కాలపాశధారి యముడు, సృష్టికర్త విధాత బ్రహ్మదేవుడు, ఆనంద ప్రదాత వరుణుడు, నిర్మలత్వ ప్రదాత నారాయణుడు, సాహసశక్తి హయగ్రీవుడు, వివేకానికి స్ఫూర్తి హంస, పవిత్ర తత్వవేత్త తులసీ మాత, వీరు తమ తమ శక్తులతో విరాజిల్లు తూ ఉండే మహత్తరమైన మంత్రమే శ్రీగాయత్రీ మంత్రం.

"ఓం భూర్భువ స్వః తత్సవితుర్వరేణ్యం,
భర్గోదేవస్య ధీమహీ, ధియో యోనః ప్రచోదయాత్"

ఈ విశేష మంత్రరాజాన్ని అనుష్ఠానం చేసే పరమ పవిత్రమైన దినం ఈ శ్రావణ పౌర్ణమి.

తృతీయ విశేషం రాఖీ పౌర్ణమి. ఈ రోజు రక్షాబంధనం జరుపుకుంటారు అన్నా చెల్లెళ్ళు. రక్షాబంధనం ఆవిర్భావం శ్రీకృష్ణుడికి, ద్రౌపది ప్రప్రథమంగా కట్టినట్టు తెలుస్తోంది. శ్రీకృష్ణుడు , శిశుపాలుని వధించు సమయంలో బొటన వేలికి గాయమై రక్తం స్రవిస్తున్నపుడు ద్రౌపది తన పట్టుచీర, చీరకొంగు చింపి శ్రీకృష్ణుని చేతికి కట్టింది. ఆ సందర్భంలో శ్రీకృష్ణుడు ద్రౌపదికి సోదరుడిగా నీకు రక్షగా ఉంటానని మాట ఇచ్చాడు.

ద్రౌపదిని నిండుసభలో కౌరవులు అవమానిస్తున్నపుడు ఆపద సమయాల్లో శ్రీహరిని స్మరించమని బాల్యంలో వసిష్ఠులవారు చేసిన ఉపదేశం ఆమె స్మృతిలో మెదిలింది.

"మహాత్యాపది సంప్రాప్తే స్మర్తవ్యో భగవాన్ హరిః"

కృష్ణా! గోవిందా! గోపాలా! అని పదే పదే స్మరిస్తూ ఉంది.

**ఆపత్స్వభయదం కృష్ణ లోకానాం ప్రపితామహం**
**గోవింద ద్వారకా వాసిన్ కృష్ణ గోపీజనప్రియ!!**
**కౌరవైః పరిభూతానాం మాంస కింద జానాసి కేశవ !**
**హే నామ హే రమానాథ వ్రజనాథ ఆర్తినాశనా !**
**కౌరవార్ణవ మన్నెం మాముద్ధరస్వ జనార్దన!!**

కృష్ణా! ఘోరమైన ఆపదలో ఉన్నాను. నాకు అభయాన్ని ప్రసాదించు. విశ్వభావనా! గోవిందా! కౌరవుల బారిన పడి మునిగిపోతున్న నన్ను రక్షించు. కౌరవుల చేత అవమానింపబడుతున్న స్త్రీ మర్యాదను కాపాడు. నన్ను దుఃఖం నుంచి కాపాడు అంటూ ఆర్తిగా వేడుకున్నపుడు, ద్రౌపది భక్తి కృష్ణుని హృదయాన్ని కదిలించివేసింది. శ్రీకృష్ణుడు అవ్యక్తంగా శోభిస్తూ, ద్రౌపదికి అక్షయంగా వస్త్రదానం చేస్తున్నాడు. దుశ్శాసనుడి దుశ్చర్యకి శ్రీకృష్ణుడు చేస్తున్న అక్షయ వస్త్రదానం, వివిధ వర్ణశోభిత వస్త్రములు ఆ స్త్రీ యొక్క గౌరవాన్ని నిలబెట్టాయి. అలసిపోయిన దుశ్శాసనుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. సభలోని వారంతా ద్రౌపది యొక్క భక్తిని, శ్రీకృష్ణుని అనుగ్రహాన్ని అద్భుతమైన ఆ దృశ్యమును చూచి చేతులెత్తి నమస్కరించారు. కౌరవపుత్రులను నిందించారు.

ఇదంతా ఓ సోదరుడికి కట్టిన రక్షకి ఫలితంగా ఇచ్చిన మాటకు కట్టుబడి కృష్ణుడు చెల్లెలికి రక్షణగా ఉన్నాడు. ఆ కారణంగా ఆనాటినుంచి రక్షాబంధన వేడుక అన్నచెల్లెళ్ళు ఆనందంగా జరుపుకుంటున్నారు.

వివాహానంతరం మెట్టినింటికి వెళ్ళిపోయే ఆడపడుచులు ఏడాదికి ఒకసారి ఈ రక్షాబంధనం జరపడానికి పుట్టింటికి వచ్చి తన వారితో కలసి వేడుక జరుపుకుంటారు. మన భారతీయ సంప్రదాయంలో రక్ష, రక్షణ కోరుతూ సోదరి తన సోదరుని నుదుటికి తిలకం దిద్ది, చేతికి రక్షా బంధనము చేసి, తీపి మిఠాయి తినిపిస్తారు. సోదరుడు తన కన్నా పెద్దవాడు అయితే ఆశీర్వచనం తీసుకుంటారు. చిన్నవాడైతే దీవెనలిస్తారు. సోదరుడు తన సోదరికి బహుమతులు అందచేస్తారు. సోదరికి రక్షగా ఉంటానని ప్రమాణం చేస్తాడు. కుటుంబ సభ్యుల మధ్య జరిగే ఈ సంబరం ఎంతో ఆనందదాయకంగా జరుగుతుంది.

మరొక విశేషం ఏమంటే ఈ రోజు కోజాగరి పూర్ణిమగా మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రాలలో విశేషంగా జరుపుకుంటారు. ఈ రోజుకోసం 24 రోజుల ముందుగా ఒక చెట్టు చుట్టూ ఉన్న మట్టిని తీసుకుని, కుండ చేసి అందులో నీరు, బార్లీ నింపి పౌర్ణమి వరకు రోజూ నీరు నింపి, పౌర్ణమి నాడు నదుల వద్ద వదలుతారు. ఒక విధమైన దోస విత్తనాలను లేక చిన్న మొక్కను నాటుతారు. దోసపాదులాగ వారి అనుబంధాలు అల్లుకోవాలని ఆకాంక్షిస్తారు. పౌర్ణమినాడు చంద్రుని, గోమాతను పూజించి తగు దానాలు జరుపుకుంటే ఉత్తమ ఫలితాలు కలుగుతాయని మన పురాణాలు, శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ రోజు మనందరం కూడా నియమ నిష్టలతో, భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించుకుని ఇహపర సుఖాలు అనుభవిద్దాం.


## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

# బాలకృష్ణుడు తన పాదపు బొటనవేలిని చీకటానికి కారణమేమిటి?

బాలకృష్ణుడు తన పాదపు బొటనవేలిని, రెండు చేతులతో పట్టుకుని చీకుతూ ఉండే ఫొటోలు, చిత్రాలు, క్యాలెండర్లు ఎన్నో ఉన్నాయి. బాలకృష్ణుని ఆ చర్యను చిలిపి చేష్టగా భావిస్తారు. ఆ భంగిమ, ఆ దృశ్యం భక్తులకు కనువిందు చేస్తుంది. శ్రీకృష్ణుడు తన పాదపు బొటనవేలిని నోటికి ఎందుకు అందిస్తాడు అని ఆలోచిస్తే, దాని వెనుక ప్రత్యేకంగా ఒక కారణం, కథ ఉన్నట్లుగా తెలుస్తోంది. అలా చేయడానికి వెనుక ఒక అద్భుతమైన అర్థం ఉంది.

ఒకసారి వైకుంఠంలో పాలకడలిపై శయనించి ఉన్న శ్రీమహావిష్ణువును – శ్రీదేవిని, గరుత్మంతుడు, విష్వక్సేనుడు, ఇతర దేవతలు భక్తితో సేవిస్తున్న సమయంలో శ్రీహరి తన దేవేరితో ఇలా అన్నాడు. ''ప్రాణసఖీ, నా భక్తులు, మహర్షులు, నన్ను సేవించే ఆళ్వార్లు అందరూ నా చరణ దర్శన భాగ్యం లభించడం ఎంతో సంతోషకరమని, నా పాదాలను సేవించడం వారి అదృష్టమని ఎంతో మురిసిపోతున్నారు. నా చరణామృత రుచి అమృతానికి మించినదని, నా చరణామృతానికి సాటి మరేదీ లేదని వర్ణిస్తుంటారు. మకరందంతో కూడిన పుష్పాల కంటే నా చరణాలు మిన్న అని స్తుతిస్తున్నారు''.

– కౌతా నిర్మల

ఏనాడూ అతిశయంగా తనను గురించి తాను చెప్పుకోని తన పతిదేవుడు ఆ విధంగా మాట్లాడటం ఆమెను విస్మితురాలిని చేసింది. ఆయన తనతో ఏమి చెప్పాలనుకుంటున్నాడో ఆమెకు అర్థం కాలేదు.

''స్వామీ! తమరు ఏమి చెప్పాలనుకుంటున్నదీ నాకు తెలియటం లేదు. దయచేసి స్పష్టంగా చెప్పండి'' అని అడిగింది లక్ష్మీదేవి.

లక్ష్మీదేవి మాటలకు శ్రీమన్నారాయణుడు చిన్నగా నవ్వుతూ ''దేవీ! నా చరణామృతం ఎంత రుచికరమైనదో తెలుసుకోవాలనిపిస్తోంది. భక్తులు చెప్పే మాటల్లో ఎంత నిజం ఉన్నదీ నాకు తెలియాలి. నా పాదాలను నేనే రుచి చూడాలన్న కోరిక నాలో ఏర్పడింది''.

''స్వామీ! ఇది మనుషులు నివసించే భూలోకం కాదు. ఇది దేవలోకమైన వైకుంఠం. ఇక్కడ మిమ్మల్ని సేవించే భక్తులకు తెలియకుండా, మీరు ఏ పనినీ చేయలేరు. ఈ లోకంలో రాత్రి, పగలు ఉండవు. ఇక్కడ ఉన్నవారు కనురెప్పలు మూయరు. ఒక్క క్షణం కూడా అయినా మీలో ఈ కోరిక కలగడం ఏమిటి? ఇదేదో విచిత్రంగా తోస్తోంది. ఇది అసాధ్యమైన కోరిక అని మీకు



తెలియనిదా నాథా! ఈ కోరికను మానుకోండి'' అని ఎంతో మృదువుగానూ, అనునయంగానూ నచ్చచెప్పింది లక్ష్మీదేవి.

అయినప్పటికీ విష్ణుమూర్తి తన కోరికను నెరవేర్చుకోవాలనే నిర్ణయంలోనే ఉన్నాడు. లక్ష్మీదేవి మాటలను పట్టించుకోలేదు. 'ఏం చేయాలి? తన కోరికను ఎలా తీర్చుకోవాలి?' అని తీవ్రంగా ఆలోచించసాగాడాయన. అలా ఆలోచిస్తుండగా ఆయన మనస్సులో ఒక ఆలోచన కల్గింది. ఒకరోజు విష్ణుభక్తులు ఆయనను పూజిస్తూ, భక్తి శ్రద్ధలతో ధూపాలను, హారతిని ఇవ్వసాగారు. ధూపపు పొగ ఆ ప్రాంతమంతా దట్టంగా అలుముకుంది. అప్పుడు శ్రీహరి తన కోరిక తీరటానికి ఇదే సరైన సమయమని తలచాడు. ఆ ప్రాంతమంతా అలుముకొన్న ధూపపు పొగ తగ్గకుండా, తన మహిమతో ఆ పొగ మరింత దట్టంగా వ్యాపించేలా చేశాడు. ఆ పొగలో ఒకరికొకరు కనిపించని సమయంలో భూలోకంలో దేవకీ వసుదేవులకు పుత్రునిగా జన్మించాడు విష్ణుమూర్తి. వసుదేవుని ద్వారా గోకులానికి చేరుకుని, నందుడు, యశోదల పుత్రుడుగా పెరగసాగాడు. తనలో ఏర్పడిన కోరికను పసిబాలుడుగా ఉన్న కృష్ణుడు తన పాదాన్ని పట్టుకుని బొటన వేలుని నోట్లో పెట్టుకుని చీకసాగాడు. తన చరణామృతాన్ని చప్పరిస్తూ, రుచి చూసి తన కోరికను ఆ విధంగా తీర్చుకున్నాడు. ఆ తర్వాత తృప్తి చెందాడు. అటు పిమ్మట శ్రీకృష్ణావతారాన్ని ముగించి వైకుంఠంలో ధూపపు పొగ తగ్గేలోగా తిరిగి వైకుంఠానికి చేరుకున్నాడు శ్రీమహావిష్ణువు. పసిబాలుడైన శ్రీకృష్ణుడు తన పాదపు బొటనవేలిని నోట్లో పెట్టుకోవడం వెనక ఉన్న కథ ఇది.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 365. సిద్ధాయ నమః

– శరణన్న వారికై ఏదేని ఒక ఉపాయముతో (సాధనముతో) సాధింపదగినట్లుగ సిద్ధముగా నుండువాడు విష్ణుదేవుడు. ఏ ప్రమాణముల చేతను, ఋజువులకు అందని స్వయం సత్తాకరమైన సత్యస్వరూపుడు సిద్ధుడు – విష్ణువు.

భక్తుల రక్షణ కొరకు తానే మొదటగ ఎల్లప్పుడూ సిద్ధముగా నున్నవాడు. షిధు అను ధాతువు పైక్త ప్రత్యయము వచ్చి సిద్ధః అను రూపము ఏర్పడింది. ఫలమును పొందుటకై చేయబడిన యజ్ఞాదుల వలె సాధ్య ఉపాయము గాక భగవంతుడు మొదటనే భక్త రక్షణకై ఏర్పడిన సిద్ధోపాయము అని అర్థము. ఇందుకు ''న్యాస ఇత్యాహుః మనీషిణో బ్రహ్మణమ్'' అను తైత్తిరీయ నారాయణము లోని వాక్యము ప్రమాణము. జ్ఞానులైన మహర్షులు పరమాత్మను (విష్ణు దేవుని) నిధి వలె దాచబడిన ధనము (న్యాసము) అని చెప్పుదురు అని ఆ ఉపనిషద్వాక్యమునకు అర్థము. ఎంతటి కార్యాన్నయినా ఇతరుల ఆపేక్ష లేకనే స్వతంత్రముగా నెరవేర్చగలవాడు. స్వయంసిద్ధుడు విష్ణువు. నిత్య నిష్పన్నరూపత్వాత్ సిద్ధః అని వ్యుత్పత్తి. అనన్యాధీనాం సిద్ధిం ప్రాప్తః సిద్ధః అని వివరణము.

భగవంతుడు సిద్ధోపాయము, యజ్ఞాదులు సాధ్యోపాయము అని గుర్తించాలి. న్యాసమనగా మనము శ్రమపడి సంపాదించు అవసరము లేకుండా మన పూర్వులు దాచి పెట్టి యున్న ధనము (నిధి) భక్తులకు అప్రయత్నముగా లభించిన కొంగు బంగారము వేంకటేశుడు అని తాత్పర్యము.

ఫలితము సిద్ధము, సాధ్యము అని రెండు విధములు. పూర్వమే సిద్ధమైనవి కొన్ని – న్యాసము అని భావము. మరికొన్ని కష్టపడి సాధింపతగినవి. భగవంతుడు సిద్ధోపాయము, న్యాసము అని నిష్కర్ష.

భక్తులను రక్షించుటకు నిరంతరము సిద్ధమై యున్నవాడు (ఆపన్న ప్రసన్నుండు) అగు విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ఈ నామము విష్ణు సహస్ర నామములలో 98, 825 సంఖ్యలతో ఉన్నది.

భాగవతములోని గజేంద్ర మోక్షమను ఇతిహాసము విష్ణుదేవుడు భక్త రక్షణకై సదా సిద్ధుడై యుండుటను తెలియ జేస్తున్నది.

గజేంద్రుడు బలహీనుడై మొసలితో పోరాడలేక ''లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్ ఠావుల్ దప్పెను... సంరక్షించు భద్రాత్మకా'' అని భగవంతుని ప్రార్థించాడు. శరణాగతి చేసినాడు. ఆ గజేంద్రుని ఆర్తనాదము విని వెంటనే విశ్వమయుడగు విష్ణుదేవుడు


**అల వైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబు దా**
**పల మందార వనాంత రామృత సరః ప్రాంతేందుకాంతోపలో**
**త్పల పర్యంక రమా వినోదియగు నాపన్న ప్రసన్నుండు"**

అగు విష్ణుదేవుడు సిద్ధుడగుటచే మొసలిని సంహరించి గజేంద్రుని రక్షించి సారూప్య మోక్షమును ప్రసాదించినాడు.



**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**







**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

## 366. పాండవ ప్రియకోత్సవాయ నమః

పాండవులకు ప్రియము చేయుటయే తనకు ఉత్సవముగా గలవాడు కృష్ణుడు.

భీష్ముని సోదరుడగు విచిత్ర వీర్యుని రెండవ కుమారుడు పాండురాజు. హస్తినాపురము రాజు. తల్లి అంబాలిక. అన్న ధృతరాష్ట్రుడు. పాండురాజునకు కుంతి, మాద్రి అను ఇరువురు భార్యలు కలరు. పాండురాజు నియోగమున కుంతి, మాద్రి యందు గలిగిన పుత్రులు ఐదుగురు. వారు ధర్మరాజు, భీముడు, అర్జునుడు కుంతీపుత్రులు. నకుల సహదేవులు మాద్రి పుత్రులు. ఈ ఐదుగురిని పాండవులు అని వ్యవహరిస్తారు.

ఈ పాండవులకు మేలు చేకూర్చటమే తనకు ఉత్సవముగా తలంచినవాడు కృష్ణుడు.

పాండవులకు ప్రియము కల్గించుటయే తనకు ఉత్సవముగా కలవాడు అగు కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 367. భద్ర ప్రియాయ నమః

లోక కళ్యాణమే తనకు ప్రియమని తలంచువాడు – కృష్ణుడు. భద్ర యొక్క ప్రియుడైన కృష్ణునకు నమస్కారము.

కృష్ణుని మహిషులలో భద్ర ఒకతి. కృష్ణుని అష్ట మహిషులు 1. రుక్మిణి 2. జాంబవతి 3. సత్యభామ 4. కాళింది 5. మిత్రవింద 6. నాగ్నజితి 7. భద్ర 8. లక్షణ (లక్ష్మణ).

భద్ర శ్రుతకీర్తి కుమార్తె. కృష్ణుని భార్య. శ్రుతకీర్తి కేకయరాజు భార్య. కృష్ణుడు భద్రను వివాహమాడుటను పోతన వర్ణించినాడు.

కృష్ణునికి మేనత్తయగు శ్రుతకీర్తి కేకయ దేశపు రాణి. ఆమె కుమారులు సంతర్దనాదులు, కూతురు భద్ర సంతర్దనాదులు తమ సోదరి యగు భద్రను కృష్ణునకు ఇచ్చి వివాహము చేసినారు.

శ్రుతకీర్తి వసుదేవుని సోదరి. ఆనక దుందుభి అను పేరు గల శూరుని కుమార్తె. కనుక భద్ర కృష్ణునికి మేన మరదలు. మేన మరదలు యగు భద్ర యొక్క ప్రియుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 368. సుభద్రాయా భ్రాత్రే నమః

కృష్ణుడు దేవకీ వసుదేవుల పుత్రిక యగు సుభద్రకు అన్న. ఈమె సోదరులు కృష్ణుడు, సారణుడు. భర్త అర్జునుడు. కుమారుడు అభిమన్యుడు.

సుభద్రకు సోదరుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం


– రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

## జంబుమాలి

ప్రహస్తుడు రావణుని మంత్రి. వాని కొడుకు జంబుమాలి. పెద్ద పెద్ద కోరలు కలవాడు. పెద్ద పెద్ద మిడిగుడ్లవాడు. ధనుర్ధారి. పరాక్రమశాలి. సమర దుర్జయుడు. ఎర్రని బట్టలు కట్టాడు. ఎర్రని పూలదండలు వేసుకున్నాడు. ధనుస్సు పట్టాడు. ఒకసారి ధనుష్టంకారం చేశాడు. దిక్కులు విదిక్కులు ప్రతిధ్వనించాయి. కంచర గాడిదల రథాన్ని అధిరోహించాడు. హనుమంతుడున్న వైపు పోయాడు.

చూశాడు వాయుపుత్రుడు. ఉప్పొంగిపోయాడు. సింహనాదం చేశాడు. తోరణం మీదున్న మారుతిని చూశాడు జంబుమాలి. వాడి బాణాలు తీసి వేశాడు. ఒకటి అర్ధచంద్రాకార బాణం. హనుమ ముఖాన్ని తగిలింది. మరొకటి తలకి తగిలింది. పది బాణాలు తీసి వేశాడు. హనుమ చేతులకి గుచ్చుకున్నాయి. బాధించాయి వాయుపుత్రుణ్ణి.



కపివరుని ముఖం ఎర్రబడింది. రక్తం చిమ్మింది. ఎర్ర తామరలా ఉంది ముఖం. కోపించాడు. పక్కన పెద్దరాయి కనిపించింది. దాన్ని పెళ్ళగించాడు. జంబుమాలి మీద వేశాడు. వాడు పది బాణాలు వేశాడు. రాయి ముక్కలైంది. రాయి వ్యర్థమైంది. చూశాడు చండవిక్రముడు హనుమంతుడు. ఒక పెద్ద సాలవృక్షాన్ని పెళ్ళగించాడు. తిప్పాడు, విసిరాడు. జంబుమాలి పది బాణాలు తీసి వేశాడు. మద్దిచెట్టు ముక్కలైంది. హనుమ భుజం మీద అయిదు బాణాలేశాడు. రొమ్ముపై ఒక బాణం

వేశాడు. పది బాణాలు దేహమంతా తగిలేట్లు వేశాడు.

ఉగ్రుడైనాడు మారుతి. పరిఘ తీసుకున్నాడు. గిరగిరా తిప్పాడు. మహావేగంగా పోయాడు. చటుక్కున జంబుమాలి గుండెలపై మోదాడు. అంతే.

**తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ ।**

**న ధనుర్న రథో నాశ్వాః తత్రా దృశ్యంత నేషవః**

జంబుమాలి నుగ్గునుగ్గయ్యాడు. వాడి తల లేదు. చేతుల్లేవు. మోకాళ్ళు లేవు. ధనుస్సు లేదు. రథం లేదు. అశ్వాల్లేవు. బాణాల్లేవు. ఏవీ కనబడలేదు. అన్నీ చూర్ణమయ్యాయి.

## ఏడుగురు మంత్రి పుత్రులు

జంబుమాలి చచ్చాడు. రావణునిలో రోషం పెరిగింది. మంత్రి పుత్రుల్ని పంపాడు. వాళ్ళు ఏడుగురు. అగ్నిహోత్రంలా తేజోవంతులు. మహాబలవంతులు. అస్త్ర శస్త్ర పండితులు. అమిత పరాక్రమవంతులు. వారి వెంట సేనలు కూడా కదిలాయి.

ఏడు రథాలు బంగారు తెరలున్న రథాలు, బంగారు కాంతులున్న ధనుస్సులు మారుతితో తలపడాలని పోయారు. వారు వెడుతుంటే ఏమవుతుందో అని చింతాక్రాంతులైనారు వారి తల్లులు. ఒక్కుమ్మడిగా దాడి చేశారు హనుమంతునిపై. లెక్కలేనన్ని బాణాలు వేశారు. ఆ శరవర్షంలో మునిగిపోయాడు హనుమంతుడు. వానజల్లులోని హిమవత్పర్వతంలా కనిపించాడు. ఒక్క ఉదుటున నిర్మలాకాశంలోకి ఎగిరాడు. వారి బాణ వర్షాన్ని వ్యర్థం చేశాడు. రథాలు తనని చేరకుండా చేశాడు.

మేఘాలతో గాలి ఆడుకున్నట్లు ఏడుగురు విలుకాండ్రతో క్రీడించాడు హనుమంతుడు. భయంకరంగా గర్జించాడు. దాంతో మహాసేన వణికిపోయింది. కొందరిని అరచేత చరిచాడు. చచ్చారు వాళ్ళు. కొందరిని కాళ్ళతో తన్ని చంపాడు. కొందరిని పిడికిళ్ళు పొడిచి చంపాడు. కొందరిని గోళ్ళతో చీల్చి చంపాడు. రొమ్ముతో అదిమి కొందరిని చంపాడు. తొడలతో తోసి కొందరిని మట్టి కరిపించాడు.

రాక్షస యోధులు రణరంగానికి బలైనారు. హతశేషులు భయకంపితులైనారు. నలుదిక్కులా పారిపోయారు. ఏనుగులు వికృతంగా అరిచాయి. నేలకూలాయి గుర్రాలు. రథాలు విరిగాయి. ధ్వజాలు, ఛత్రాలు ముక్కలు ముక్కలైనాయి. నెత్తురు కాల్వలై పారింది. మంత్రి పుత్రులు చచ్చారు. మళ్ళీ తోరణం మీదికి చేరాడు. ఎవరు వస్తారో చూస్తుండిపోయాడు.

## ఐదుగురు సేనాపతులు

మంత్రి పుత్రులు ఏడుగురు హతులైనారు. అది తెలిసింది రావణునికి. క్రుంగిపోయాడు. అయినా మేకపోతు గాంభీర్యం నటించాడు. బాగా ఆలోచించాడు. విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘసుడు, భాసకర్ణుడు – అయిదుగురు ప్రముఖ సేనానాయకులు. వాళ్ళు సామాన్యులు కారు. మహావీరులు. రణనీతికోవిదులు. హనుమంతుణ్ణి బంధించాలని ఉబలాట పడుతున్నారు. వాళ్ళని పిలిచాడు దశగ్రీవుడు. అంటున్నాడు.

చతురంగ బలాలతో వెళ్ళండి. ఆ వానరుణ్ణి శిక్షించాలి. వాణ్ణి పట్టుకోండి. వాడు వానరుడు కాదేమో. మహాభూతమేమో అని తోస్తోంది. మన నాశనాన్ని కోరేది ఇంద్రుడు. అతడు సృష్టించాడేమో. నాగులు యక్షులు గంధర్వులు అసురులు దేవతలు మహర్షులు – వీళ్ళని జయించాను. వారు నాకు అపకారం తలపెట్టారేమో. ఏమైనా సరే మీరు వాణ్ణి పట్టండి.

పూర్వం వాలిని చూశాను. సుగ్రీవుణ్ణి చూశాను. జాంబవంతుణ్ణి చూశాను. నీలుణ్ణి చూశాను. మరెందరో వానర వీరుల్ని చూశాను. వాళ్ళెవరికీ లేని భయంకర గమనశక్తి ఈ వానరుడిది. వీడిలో తేజస్సు ఉంది. పరాక్రమం ఉంది. బుద్ధిబలం ఉంది. ఉత్సాహ శక్తి ఉంది. కామరూపుడు. కనుక గట్టిగా ప్రయత్నించండి.

మీరు మహా పరాక్రమవంతులు. ముల్లోకాల్లోని దేవతలు, అసురులు, మానవులు ఎవరైనా మీముందు నిలువజాలరు. అయినా యుద్ధంలో జయాపజయాలు నిశ్చయించలేం. విజయం కోరేవారు నీతిజ్ఞులు. స్వరక్షణలో ఉంటారు. మీరు జాగ్రత్తగా ఉండాలి.

విన్నారు రావణుని ఆదేశం. రథాలు ఏనుగులు గుర్రాలు సేనలు మహావేగంగా కదిలాయి. సేనా నాయకులు ముందు వెడుతున్నారు. తోరణం మీదున్నాడు హనుమంతుడు. చూశారు. అందరూ చుట్టుకున్నారు. వివిధ ఆయుధాలతో విజృంభించారు.

దుర్ధరుడు ముందుగా వెళ్ళాడు. ఐదు ఇనుప బాణాలు తీశాడు. మారుతి శిరస్సుపై ప్రయోగించాడు. అవి గుచ్చుకున్నాయి వాయుపుత్రునికి. ఏమాత్రం బాధపడలేదు. సింహనాదం చేశాడు. దశదిశలు ప్రతిధ్వనించాయి. ఆకాశానికి ఎగిరాడు. చూశాడు దుర్ధరుడు. రథంతో పాటు పైకి ఎగిరాడు. వందలకొద్దీ బాణాలు వేశాడు. వాటిని చెల్లాచెదరు చేశాడు హనుమ. వేగంగా తన శరీరం పెంచాడు. పర్వతం మీద పిడుగు పడ్డట్లు దుర్ధరుని రథం మీద పడ్డాడు. రథం విరిగింది. ఎనిమిది గుర్రాలు చచ్చాయి. దుర్ధరుని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

చూశారు విరూపాక్షుడు, యూపాక్షుడు. రోషావేశ పూరితులైనారు. ఆకాశానికి ఎగిరారు. హనుమంతుని చేరారు. ముద్గరాలు (ఇనుప గుదియలు) చేతపట్టారు. ఎదురు రొమ్ము మీద కొట్టారు. చలించలేదు మారుతి. చటుక్కున నేలమీదికి వచ్చాడు. ఒక మద్దిచెట్టు చూశాడు. పెకలించాడు. ఆ ఇద్దరినీ కొట్టాడు. దెబ్బకు చచ్చారు ఇద్దరూ.


ముగ్గురి చావు చూశాడు ప్రఘసుడు. మహావేగంతో వెళ్ళాడు.

హనుమని ఎదుర్కొన్నాడు. మరోపక్క భాసకర్ణుడు దాడి చేశాడు. ప్రఘసుడు పట్టిన అడ్డకత్తి విసిరాడు. శూలాన్ని విసిరాడు భాసక ర్ణుడు. అవి ఆంజనేయుని గాయపరిచాయి. శరీరం రక్తసిక్తమైంది. ఒక పెద్ద కొండనెత్తాడు. ఇద్దరి మీద వేశాడు. అంతే దాని కింద నలిగారు. వారి శరీరాలు నువ్వుగింజంతలా ముక్కలు ముక్కలైనాయి.

మిగిలిన సైన్యాన్ని చూశాడు వాయుపుత్రుడు. గుర్రాల్ని గుర్రాలతో కొట్టాడు. చంపాడు. ఏనుగుల్ని ఏనుగులతో కొట్టి చంపాడు. యోధుల్ని యోధులతో ఢీ కొట్టించి చంపాడు. రథాలను రథాలతో కొట్టాడు. చూర్ణం చేశాడు. మళ్ళీ తోరణం అధిరోహించాడు. ప్రళయ కాలంలోని కాలునిలా కనిపించాడు హనుమంతుడు. రాక్షసుల కోసం ఎదురు చూస్తున్నాడు.

## అక్ష కుమారుడు

ఐదుగురు సేనానాయకులు చచ్చారు. వారి సేనలు నాశనమైనాయి. అపుడు సభలో ఉన్నాడు రావణుడు. ఆ వార్త విన్నాడు. ఎదురుగా ఉన్నాడు అక్ష కుమారుడు. వాడు రావణుని కొడుకు. యుద్ధోన్మత్తుడు. పరాక్రమవంతుడు. తండ్రిగారి చూపు తనపై పడింది. అది గ్రహించాడు. ప్రజ్వరిల్లే అగ్నిలా లేచాడు. నిలుచున్నాడు.



వెంటనే రథం వచ్చింది. అది బాల సూర్యకాంతులు విరజిమ్ముతోంది. అది అక్షకుమారుని తపః ఫలం. బంగారు తెరలతో శోభిల్లుతోంది. రత్నాలు పొదిగిన ధ్వజం. మనోహరమైన పతాకం. ఎనిమిది గుర్రాలు పూన్చిన రథం. ఆ గుర్రాలు మనోవేగంతో పోగలవు. ఆ రథాన్ని సురాసురులు ఎదిరించలేరు. అడ్డూ ఆపూ లేకుండా పోతుంది. ఆకాశంలోకి ఎగరగలదు. అమ్ముల పొదులు, ఎనిమిది కత్తులు, శక్తి తోమరాలు ఇంకా ఎన్నో ఆయుధాలు సిద్ధంగా ఉన్నాయి.

అక్ష కుమారుడు రథం ఎక్కాడు. వెంట చతురంగ బలాలు నడిచాయి. అటు రథఘోష, ఇటు సేనల మహాధ్వనులు ఆకాశాన్ని అంటాయి. అశోకవనం బహిర్ద్వారం చేరాడు అక్షకుమారుడు. తోరణం మీదున్నాడు హనుమంతుడు. చూశాడు. ఆశ్చర్యపోయాడు. అమిత పరాక్రమవంతుడని గ్రహించాడు. ఒక గౌరవ భావం ఏర్పడింది. వెంటనే కలవరపడ్డాడు. శత్రుబలాన్ని, తన బలాన్ని సరి చూసుకున్నాడు. క్రమంగా రోషం పెరిగింది. ప్రళయకాల సూర్యునిలా ప్రకాశించాడు. మూడు బాణాలు తీసి వేశాడు. మారుతిని యుద్ధానికి రమ్మని కవ్వించాడు.

బంగారు పతకాలతో, భుజకీర్తులతో, కుండలాలతో శోభిల్లుతున్నాడు అక్ష కుమారుడు. చూశాడు హనుమంతుడు. సమరానికి దిగాడు. ఆ ఉభయుల పోరు తీరు చూస్తున్నారు సురాసురలు. సంభ్రమాశ్చర్య పరులైనారు. సూర్యుడు తాపం తగ్గించాడు. గాలి వీచటం లేదు. పర్వతాలు చలించాయి. ఆకాశం శబ్దించింది. సముద్రం క్షోభించింది. భూమి దద్దరిల్లింది.

బాణాలు ఎక్కుపెట్టడంలో గురిపెట్టడంలో ప్రయోగించటంలో నిపుణుడు అక్షకుమారుడు. విషసర్పాల్లాంటి బాణాలు తీశాడు. అవి మూడు వేశాడు. హనుమంతుని తలకు గుచ్చుకున్నాయి. రక్తం ధారలు కట్టింది. ఉదయించే సూర్యునిలా వుందతని ముఖం. చూశాడు అక్షకుమారుణ్ణి. మెచ్చుకున్నాడు మారుతి. వెంటనే రణోత్సాహియైనాడు. శరీరాన్ని పెంచాడు.

అక్షకుమారుడు తన ధనుస్సు ఇంద్రధనుస్సులా చేశాడు. పర్వతం మీద వాన కురిసినట్లు హనుమంతునిపై శరవర్షం కురిపించాడు. వాయుపుత్రుడు సింహనాదం చేశాడు. పర్వతం మీద వడగండ్లు నీరై జారిపోతాయి. అలా వజ్రశరీరుడైన ఆంజనేయుని ఆ బాణాలు తాకాయి. జారిపోయాయి. అక్షకుమారుడు బలగర్వితుడు. మదించిన ఏనుగు గడ్డి కప్పిన గోతిలో దిగినట్లు వాడు హనుమంతునితో తలపడ్డాడు.

చటుక్కున ఆకాశానికి ఎగిరాడు వాయుపుత్రుడు. చూశాడు అక్షకుమారుడు. రథంతో కూడా పైకెగిరాడు వాడు. గరుడవేగం ప్రదర్శించాడు వాయుపుత్రుడు. అక్షకుమారుని బాణాలకి చిక్కడం లేదు. ఆకాశమార్గంలో విహరిస్తున్నాడు. ఆలోచనలో పడ్డాడు. ఈ బాలుడు యుద్ధవిద్య నేర్పరి. వీణ్ణి చంపాలని, కాని మనస్సు అంగీకరించడంలేదు. శత్రువుని ప్రశంసించడం ఉత్తమ వీరుని లక్షణం. అది హనుమలో ఉంది. వాడి రణోత్సాహం అద్భుతం. ఎంత నిర్భయంగా ఉన్నాడు. వీణ్ణి చూసి భయపడతారు దేవతలు. అయినా వీణ్ణి ఉపేక్షించరాదు. చంపలేదనుకో ఉత్తరోత్తరా మనల్ని హింసిస్తాడు. చంపి తీరాలి. ప్రజ్వరిల్లే అగ్నిని ఉపేక్షించరాదు – అది హనుమంతుని నిశ్చయం.

చటుక్కున ఆకాశంలోంచి కిందికి దూకాడు. రథం మీద పడ్డాడు. అరి చేతులతో గుర్రాల్ని చరిచాడు. అవి కూలిపోయాయి. రథం మొత్తం విరిగిపోయింది. విల్లు, కత్తి తీసుకున్నాడు. ఆకాశంలోకి ఎగిరాడు అక్షకుమారుడు. వాయు గమనుడు హనుమంతుడు పైకెగిరాడు. అక్షకుమారుని రెండు కాళ్ళు

పట్టాడు. గిరగిరా వెయ్యిసార్లు తిప్పాడు. మహావేగంతో నేలమీదికి విసిరాడు. అంతే వాడి చేతులు మెడ మోకాళ్ళు నడుం విరిగిపోయాయి. దేహం రక్తపు ముద్ద అయింది. ఎముకలు కీళ్ళు నుగ్గయ్యాయి. నరాలు తెగిపోయాయి. చచ్చాడు అక్షకుమారుడు. జ్యోతిశ్చక్రంలో సంచరించే మహర్షులు, యక్షులు, నాగులు, ఇతర ప్రాణులు, ఇంద్రుడు, దేవతలు చూశారు. విస్మితులైనారు. మళ్ళీ తోరణం మీదికి చేరాడు హనుమంతుడు. అతని కనులు రక్తంలా ఎఱ్ఱబడ్డాయి. రాక్షసుల కోసం నిరీక్షిస్తున్నాడు.

## ఇంద్రజిత్తు



రావణుని చిన్న కొడుకు అక్షకుమారుడు దారుణంగా హతమైనాడు. విన్నాడు రాక్షసరాజు. దుఃఖం అణుచుకున్నాడు. కోపాన్ని దిగమింగాడు. పెద్ద కొడుకు ఇంద్రజిత్తు. చూశాడతణ్ణి. యుద్ధానికి వెళ్ళాలని ఆదేశించాడు రావణుడు. ఇంద్రుణ్ణి జయించాడు కాన అతనికి ఇంద్రజిత్తు అని పేరు వచ్చింది. అంటున్నాడు పెద్ద కొడుకుతో. అతనికి మేఘనాథుడని మరో పేరు ఉంది. కుమారా! నీవు బహు శస్త్రాస్త్ర కోవిదుడవు. తపస్సు చేశావు. బ్రహ్మను మెప్పించావు. బ్రహ్మాస్త్రం సంపాదించావు. దేవతలు, అసురులు నీ అస్త్ర బలానికి తలొగ్గుతారు. నీ ముందు ఎవరూ నిలువజాలరు. ముల్లోకాల్లో నిన్ను గెలిచినవాడు లేడు. నీ భుజ బల పరాక్రమాలు నీకు భద్ర కవచాలు. నీ తపః ప్రభావం నీకు సర్వరక్ష. నీవు నిరుపమాన ప్రజ్ఞాశాలివి. నీకు అసాధ్యం అనేది లేదు.

వేల కింకరులు పోయారు. జంబుమాలి పోయాడు. ఏడుగురు అమాత్య పుత్రులు పోయారు. ఐదుగురు సేనానాయకులు పోయారు. అక్షకుమారుడు పోయాడు. చతురంగ బలాలు కొన్ని నాశనమైనాయి. వానరుడు సామాన్యుడు కాదు. వాడి బలం గమనించు. పరాక్రమం గమనించు. తదనుగుణంగా శక్తి యుక్తులు ప్రదర్శించు. విజృంభించు.

అయితే వానరునికి ఉన్న వేగం వాయుదేవునికి లేదు. వాడు అగ్నిహోత్రం లాంటివాడు. ఆయుధాలు వాడి ముందు పని చేయవు. ఏమరుపాటు పడకు. నిన్ను రణరంగానికి పంపడం ఇష్టం లేదు. అయితే రాజధర్మం తప్పదు అంటోంది. క్షాత్రధర్మం అనుసరించాలి. విజయం సాధించు. వెళ్ళు.

అంతలో రథం వచ్చింది. అది గరుడ గమనం కలదు. నాలుగు సింహాలు పూన్చిన రథం అది. తండ్రికి నమస్కరించాడు. ప్రదక్షిణం చేశాడు. రణోత్సాహం పొంగింది. రథమెక్కాడు. మహావేగంగా వెడుతోంది. రథచక్రాల సవ్వడి ధనుష్టంకార ధ్వని విన్నాడు హనుమంతుడు. క్రూరమృగాలు అనేక విధాల అరుస్తున్నాయి. దుమ్ము రేగింది. అది మిన్నంటింది.

నాగులు, యక్షులు, మహర్షులు ఆకాశంలో నిలిచారు. జ్యోతిశ్చక్రంలో సంచరించే సిద్ధులు వచ్చారు. ఆ యుద్ధం తిలకించాలనుకున్నారు. ఇంద్రజిత్తును చూశాడు హనుమంతుడు. సింహనాదం చేశాడు. తన శరీరం పెంచాడు. బద్ధ శత్రువులైన దేవేంద్ర – రాక్షసేంద్రునిలా – హనుమ ఇంద్రజిత్తులు పరస్పరం తలపడ్డారు.

వందల బాణాలు వేస్తున్నాడు ఇంద్రజిత్తు. తప్పించుకుంటున్నాడు మారుతి. ఆ బాణాలు పొడుగాటివి, వాడియైనవి. గురి పెట్టి వేస్తున్నాడు. వాటి మధ్య తిరుగుతున్నాడు. వాయువులా ఆకాశంలో సంచరిస్తున్నాడు హనుమ.

వాయుపుత్రుణ్ణి కొట్టడం ఎలాగో తెలియలేదు వాడికి. ఇంద్రజిత్తుని ఎలా కొట్టాలో తెలియలేదు హనుమంతునికి. ఉభయులు అమిత వేగవంతులు. రణ విశారదులు. తన బాణాలు వ్యర్థమవుతున్నాయి. అందుకు దుఃఖిస్తున్నాడు ఇంద్రజిత్తు. వానరుణ్ణి పట్టుకోవడం అసాధ్యం. చంపడం అసాధ్యం. కనీసం బంధించాలనుకున్నాడు. బ్రహ్మాస్త్రం సంధించాడు. ప్రయోగించాడు. ఆ దివ్యాస్త్రానికి కట్టుబడ్డాడు ఆంజనేయుడు. కపివరుడు నిశ్చేష్టుడైనాడు. దభీమని కిందపడ్డాడు.

అది బ్రహ్మాస్త్రమని గ్రహించాడు మారుతి. కాని ఆ అస్త్రం అతన్ని బాధించలేదు. అది బ్రహ్మానుగ్రహమే. దాన్ని తప్పించుకునే శక్తి ఉందతనికి. అయితే బ్రహ్మదేవుని ఆజ్ఞ. శిరసా వహించాడు. బ్రహ్మ, ఇంద్రుడు, వాయుదేవుడు తనని రక్షిస్తున్నారని తెలుసుకున్నాడు. “రాక్షసులు నన్ను బంధించడం మంచిది. అది నాకు లాభం. రావణుని దగ్గరకు తీసుకెళ్తారు. ఆ రాక్షస రాజుతో మాట్లాడవచ్చు. నేను శత్రువుకి బంధింపబడడమే కావాలి — అది హనుమంతుని ఆలోచన.

కింద పడ్డ హనుమని చూశారు రాక్షసులు. వచ్చారు. బెదిరించారు. అయినా కిమ్మనలేదు మారుతి. నిశ్చేష్టుడై ఉన్నాడు. ఉత్సాహం ఉరకలు వేసింది రాక్షసుల్లో. జనప నారలు తెచ్చారు. నారచీరలు తెచ్చారు. బాగా పేనినారు. తాళ్ళుగా తయారు చేశారు. వాయుపుత్రుణ్ణి కట్టేశారు. తను రావణుని చూడటం ఖాయమనుకున్నాడు హనుమంతుడు.

**(సశేషం)**

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

## 34వ శ్లోకం

**తత్త్వం ప్రసీద భగవాన్ కురు మ య్యనాథే**
**విష్ణో కృపాం పరమ కారుణికః కిల త్వం ।**
**సంసార సాగర నిమగ్న మనంత దీన**
**ముద్ధర్తు మర్హసి హరే పురుషోత్త మోసి ॥**

స్వామీ! అనంతమైన సంసారసాగరంలో మునిగి బాధపడుతున్న ఈ దీనుని కటాక్షించుము. పరమ కారుణ్యమూర్తివైన నీవు అనంతశయనుడవైన నువ్వు తప్ప నన్ను మరెవ్వరూ రక్షింపలేరని నిన్నే నమ్మి ఉన్నాను. పురుషోత్తముడివైన నీవే నన్ను ఆదుకోవాలి.

ఓ పరమాత్మా! శ్రీమన్నారాయణా! నీకున్న అనంత కళ్యాణ నామములలో "ఓం శరణాయ నమః" అని నామం కలిగి ఉన్నావు కదా! ఏమిటి అర్థం – మానవుడా, రాక్షసుడా, దేవతలా, యక్ష గంధర్వులా, వీడు చెట్టా మరొకటా అనేటువంటి తారతమ్యములు చూడకుండా తనను ఆశ్రయించిన లేకున్నా అందరిని రక్షించే రక్షకుడు అని "శరణు" శబ్దానికి అర్థం. అందరికి క్షేమాన్ని కలుగ చేసేవాడు అని అర్థం.

అనేకమైన ప్రమాణములు మనకు ఉపనిషత్తులే ఇస్తాయి. "తంహ దేవం ఆత్మ బుద్ధి ప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే – సర్వాత్మలకు నిర్మల జ్ఞానమును ప్రసాదించే ఆ పరమాత్మ ముముక్షువైన నేను శరణముగా ఆశ్రయించుచున్నాను అని అర్థం" శ్వేతాశ్వతరోపనిషద్వాక్యం.

"నివాసః శరణం సుహృద్గతిః నారాయణః – అందరికి ఆశ్రయమైనవాడు, రక్షకుడు, ఆప్తమిత్రుడు, ప్రాప్యమైనవాడు శ్రీమన్నారాయణుడే" అని అర్థం. సుబాలోపనిషద్ వివరిస్తోంది.

**"యస్మాత్ క్షర మతీతో హ మాక్షరాదపి చోత్తమః ।**
**అతోస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥"**

అని గీతలో శ్రీకృష్ణపరమాత్మయే వివరించినట్లు బ్రహ్మాదుల కంటే పైవాడవగు నిన్ను ఆశ్రయించుట సమంజసము గాని, క్రిందివారిని కాదు. పరమాత్మా! నిన్ను మేము ఆశ్రయిస్తే అక్కడికి వెళ్ళండి, ఇక్కడికి వెళ్ళండి అనవద్దు. ఈ సంసార సాగరమును దాటించడంలో ఎవరు నీ అంత సమర్థులు కారు. కాబట్టి నిన్నే ప్రార్థిస్తున్నాను. దయానిధివి కనుక నిన్ను నమ్మి విడవకుండా ఉన్నాను అంటూ కులశేఖరాళ్వార్లు పరమాత్మకు ఉన్న విశేషమైన కరుణను వివరిస్తున్నారు. అదేవిధంగా ఆ పరమాత్మ కరుణకు

ధారావాహికం



పాత్రులైన వారు గుణవతిబాయి దంపతులు.

మన జీవితం ఎప్పుడు ఏవిధంగా మలుపు తిరుగుతుందో మనకు తెలియదు. మనం తీసుకున్న సరైన నిర్ణయం మనల్ని ధర్మమార్గంలో నడిపిస్తుంది.

ఒకప్పుడు మాధవ సింగ్ అనే రాజు ఉండేవాడు. అతని భార్య పేరు "గుణవతిబాయి". ఆమె భక్తి, విధేయత, దయగల హృదయం కలిగిన స్త్రీ. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆ చిన్న పిల్లలను చూసుకోవడానికి ఒక సేవకురాలిని నియమించారు. సేవకురాలు నిరంతరం ఏదో జపిస్తున్నట్లు గుణవతిబాయి గమనించింది. సేవకురాలిని గుణవతి "ఏమి చేస్తున్నావని" అడిగినప్పుడు సేవకురాలు, "ఈ భూ సంబంధమైన (లౌకిక) జీవితం నుండి నన్ను విముక్తి చేయడానికి నేను శ్రీహరి నామాన్ని జపిస్తున్నాను" అని సమాధానం ఇచ్చింది. గుణవతి బాయి తాను కూడా మంత్ర దీక్ష తీసుకోవాలనే కోరికను సేవకురాలితో వ్యక్తం చేసింది. ఆమె ఉత్సాహాన్ని చూసి, పనిమనిషి అంగీకరించింది. ఆ సేవకురాలు గుణవతిబాయికి శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని ఇచ్చి, ఆమెకు మంత్రం ఉపదేశించి, ప్రార్థనా మార్గాన్ని నేర్పింది.

గుణవతి బాయి ప్రతిరోజూ పూర్తి విశ్వాసంతో తన పూజను కొనసాగించింది. ఆమె శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రార్థిస్తూ, సాధువులకు, హరిదాసులకు భక్తితో సేవ చేసింది.

భక్తి పెరిగే కొద్దీ, లౌకిక జీవితంపై గుణవతిబాయికి ఆసక్తి తగ్గింది. ఆమె భర్త ఆమెలో ఈ నిర్లిప్తతను గమనించాడు. కానీ,

దాని వెనుక ఉన్న కారణం అతనికి తెలియదు. అతను దానిని పిచ్చిగా భావించి, ఆమె నుండి దానిని తరిమి కొట్టడానికి వివిధ మార్గాలు ప్రయత్నించాడు కానీ ఫలించ లేదు. చివరికి అతను ఆమెను పిలిచి ఆమె వింత ప్రవర్తనకు కారణం అడిగాడు. ఆమె ఇలా అంది, "నేను నిరంతరం దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఆయన దర్శనం నాకు లభించే వరకు నేను అలా చేస్తూనే ఉంటాను". కానీ ఇది రాజును మరింత చికాకు పెట్టింది. అతని కోపపు చూపులకు భయపడి గుణవతి కళ్ళు మూసుకుంది. శ్రీ కృష్ణుడు తన శంఖం మరియు చక్రంతో ఆమె ముందు ప్రత్యక్షమయ్యాడు. గుణవతి ఆనందానికి అవధులు లేవు. ఆమె దేవుని ముందు సాష్టాంగ నమస్కారం చేసింది. కృష్ణుడు ఆమె తలను తాకి, "నేను నిన్ను జాగ్రత్తగా చూసుకుంటాను. చింతించకు" అన్నాడు.

"ఓ దేవా! ప్రపంచం తలక్రిందులుగా మారినా, సూర్యుడు పశ్చిమాన అస్తమించినా, ఏడు సముద్రాలు ఎండిపోయినా, ఏది వచ్చినా, నేను నీ ప్రార్థనను ఆపను" అని గుణవతి ప్రార్థించింది. కృష్ణుడు ఆమెను ఆశీర్వదించి, "నీ కోరిక నెరవేరుతుంది. చింతించకు" అని చెప్పి అదృశ్యమయ్యాడు.

గుణవతి సంతోషంగా కళ్ళు తెరిచింది. ఆమె భర్తకు ఇదంతా తెలియక, ఆమెను మరోసారి బెదిరించి అక్కడి నుండి వెళ్లిపోయాడు. వెళ్ళే ముందు, ఆమె పిచ్చి భక్తిలో పడిపోతున్నందున ఏ సాధువును తన గదిలోకి అనుమతించవద్దని తలుపు వద్ద ఉన్న సేవకులని హెచ్చరించి. అతను వేటకు అడవికి వెళ్ళాడు.

గుణవతి తన పూజను, భజనను కొనసాగించింది. ఆమె సాధువులను గౌరవించడం కొనసాగించింది. ఆమె ప్రవర్తన గురించి మంత్రి రాజుకు ఒక లేఖ పంపాడు. ఇది అగ్నికి ఆజ్యం పోసింది మరియు రాజు తన భార్యను చంపడానికి నలుగురిని పంపాడు. ఆమె ప్రార్థనలో మునిగిపోయి ఉండడం వారు చూశారు మరియు బయట వేచి ఉన్నారు.

శ్రీకృష్ణుడు తన భక్తురాలు ప్రమాదంలో ఉన్నదని తెలుసుకుని, ఒక పులి రూపంలో తన విగ్రహం నుండి బయటకు వచ్చాడు. ఎందుకు అలా వచ్చాడో అని గుణవతి అడిగింది కానీ కృష్ణుడు ఆమెకు సమాధానం ఇవ్వలేదు. అతను నిశ్శబ్దంగా బయటకు వచ్చి, బయట వేచి ఉన్న నలుగురిని చంపాడు.

కావలి ఉన్నవారు పులి గర్జన విని అక్కడికి వేగంగా వెళ్లారు. నలుగురు చనిపోయి ఉండటం చూసి వారు ఆశ్చర్యపోయారు. వారు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి పరిగెత్తారు. తరువాత గుణవతి బయటకు వచ్చి మృతదేహాలను చూసింది. వారిని ఆ విధంగా చూసిన గుణవతికి చాలా బాధ కలిగించింది మరియు దేవుడిని ప్రార్థించింది! "ఓ దేవా! నువ్వు మరియు లక్ష్మీదేవి మా తల్లిదండ్రులు. నువ్వు మమ్మల్ని అందరినీ జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ వ్యక్తులు నాకు హాని కలిగించడానికి వచ్చారు. రాజు పట్ల వారు తమ విధిని నెరవేర్చడానికి మాత్రమే వచ్చారు. నన్ను రక్షించాలనుకుంటే, వేరే మార్గం లేదా? దయచేసి వారిని తిరిగి బ్రతికించండి". కృష్ణుడు ఆమె ముందు ప్రత్యక్షమై, "సరే! నీ కోరికను తీరుస్తాను" అని అన్నాడు. వారు సజీవంగా తిరిగి వచ్చి, నేరాన్ని అంగీకరించి, ఆమెకి శిష్యులయ్యారు.

ఆత్మ శాశ్వతంగా ఉన్నప్పుడు శరీరం ఎలా అశాశ్వతమో ఆమె వారికి వివరించింది. దీన్ని గ్రహించి దేవుడిని ప్రార్థించి, ధర్మబద్ధమైన జీవితాన్ని గడిపే వ్యక్తిని దేవుడు ఆశీర్వదిస్తాడు. ఆమె అద్భుత శక్తుల గురించి తెలుసుకున్న మంత్రి ఆమెను ప్రార్థించి, రాజుకు దీని గురించి సమాచారం పంపాడు. రాజు ఆమె తన పూజను ప్రశాంతంగా కొనసాగించడానికి అనుమతించమని మంత్రికి సందేశం పంపాడు. అతని క్రూరమైన ప్రవర్తనకు రాజు జాలిపడ్డాడు. ఆమె సాధువులకు మరియు పేదలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తన సేవను కొనసాగించింది. మిగిలిన సమయం ఆమె శ్రీ కృష్ణుని ప్రార్థనలో గడిపింది.

కొన్ని రోజుల తరువాత రాజు తన రాజ్యానికి తిరిగి వస్తూ ఉన్నాడు. దారిలో, ఒక చోట, అతను ఒక నదిని దాటవలసి వచ్చింది. రాజు నదిలో సగం దూరం వెళ్లిన తరువాత, హఠాత్తుగా మునిగిపోబోతున్నాడు. ఆ సమయంలో ఏమి చెయ్యాలో పాలుపోక, తన భార్యను ప్రార్థించాడు. "నీ ప్రార్థన నిజాయితీగా ఉంటే మమ్మల్ని మునిగిపోకుండా కాపాడుతుంది" అని. అద్భుతం! పడవ మునిగిపోకుండా నిశ్శబ్దంగా ఒడ్డుకు చేరుకుంది. అందరూ ఆశ్చర్యపోయారు.

రాజు గుణవతిని ప్రశంసించాడు, "నువ్వు ధన్యురాలివి. నీ అద్భుత శక్తి గురించి తెలుసుకోకుండా నేను నీకు హాని చేయడానికి ప్రయత్నించాను. నీ ద్వారా మేము రక్షించబడినప్పుడు, నేను నీ భక్తిని నమ్మాను. దయచేసి నన్ను క్షమించు".

అప్పుడు గుణవతి వివరించింది, "ఎవరూ ఎవరికీ హాని చేయలేరు. ఒక వ్యక్తిలో మంచి మరియు చెడుల సమతుల్యత ఆధారంగా విషయాలు జరుగుతాయి. దేవుడు జాగ్రత్తగా చూసుకోవడానికి ఉన్నాడు. భూమిపై ఈ జీవితం ఏ క్షణంలోనైనా ఆరిపోయే బుడగ. సంపద, కుటుంబం, ఓదార్పు ఇవన్నీ అశాశ్వతమైనవి. దేవుని ప్రేమ మాత్రమే శాశ్వతం. కానీ భూసంబంధమైన సుఖాలు మరియు అనుబంధాలలో మునిగిపోయిన ప్రజలు దేవుని నుండి విడిపోతున్నారు. వారు మోక్షాన్ని పొందడానికి ప్రయత్నించడం లేదు. కాబట్టి నిన్ను క్షమించడానికి నేను ఎవరు?"

ఆమె బోధనలకు రాజు ముగ్ధుడయ్యాడు. అతను పరివర్తన చెందిన పురుషుడిగా మారి, తన భార్యను తన గురువుగా భావించి దేవుడిని ప్రార్థించడం ప్రారంభించాడు.

ఒకరోజు గుణవతి ఇలా అంది, "ఓ ప్రియా? దేవుడు ఇచ్చిన



దీక్ష ద్వారానే నువ్వు జ్ఞానాన్ని పొందగలవు. కాబట్టి మంచి గురువు యొక్క కమల పాదపద్మాలను వెతుక్కో మరియు దీక్ష పొం దండి. నువ్వు కోరికలను వదులుకోవాలి. సంపదలు నిన్ను కోరికల వైపు ఆకర్షిస్తాయి. కోరికలు అపరిమితంగా ఉంటాయి. ఒక మనిషికి ఎన్ని సంపదలు, ఎంత శక్తి, ఎంతమంది అందమైన స్త్రీలు ఉన్నప్పటికీ, అతను సంతృప్తి చెందడు. ఒక జ్ఞాని కోరికలను వదులుకోవాలని నేర్చుకుంటాడు, అయితే ఒక మూర్ఖుడు కోరికలను వెతుక్కుంటూ తద్వారా పతనాన్ని కోరుకుంటాడు.

రాజు, తన మొదటి గురువు గుణవతి కాబట్టి, ఆమెతో "తనకు సద్గురువును తెలుసుకునే మార్గం తెలియచెప్పమని" అడిగాడు. అప్పుడు ఆమె తనకు భక్తిలో నిమగ్నమయ్యేలా చేసిన సేవకురాలిని తీసుకువచ్చి, ఆమెను ప్రార్థించి, తన భర్తకు కూడా దీక్ష ఇవ్వమని కోరింది. సేవకురాలు వెంటనే అంగీకరించి, "గుణవతి, నీకు జ్ఞానం, భక్తి, వైరాగ్యం ఉన్నాయి. నీతో ఉండటం వల్ల నీ భర్త కూడా మంచిగా మారిపోయాడు. నేను అంగీకరించకపోతే, నేను దేవుని చిత్తానికి విరుద్ధంగా వెళ్తున్నానని అర్థం" అని అంది.

వెంటనే రాజు వచ్చి, ఆమె పాదాలపై పడి, తనకు మంచి మార్గం చూపించమని కోరాడు. ఆమె అతనికి ఒక మంత్రం బోధించి, "ఓ రాజా! నీ భార్య జ్ఞాని, ఆమె నీ ఇంట్లో జ్ఞాన జ్యోతిని వెలిగించింది. ఇప్పుడు నీ ప్రోత్సాహంతో జ్ఞాన జ్యోతి బాగా ప్రకాశిస్తోంది. దేవుని దయ వల్ల, నువ్వు కూడా ధన్యుడివి. నువ్వు దేవుడి గురించి ఆలోచిస్తావు, దేవుడిని ప్రార్థిస్తావు మరియు దేవుడి భక్తులకు సేవ చేస్తావు. నువ్వు అలా చేస్తే దేవుడు సంతోషిస్తాడు మరియు నీతో ఉంటాడు. ఇతరులను నీలాగే చూసుకుంటావు. దేవుడు సంతోషిస్తే, ఏదీ అసాధ్యం కాదు".

రాజు ఆ సేవకురాలికి ఒక ప్రత్యేక ఆశ్రమం ఏర్పాటు చేసి, ఆమెను సేవకురాలిగా చూడటం మానేశాడు. అతను బృందావనానికి వెళ్లి దేవుడిని ప్రార్థించాడు. "ఓ దేవా! నేను ఒక అజ్ఞానిని కాబట్టి, నేను భౌతిక సుఖాలలో మునిగిపోయాను. నాకు ఇచ్చిన ఆశీర్వాదాలను – మానవ రూపం యొక్క ఆశీర్వాదాలను – నేను విస్మరించాను. ఇప్పుడు నేను మారిపోయిన మనిషిని, దయచేసి నన్ను క్షమించు." అతని హృదయపూర్వక ప్రార్థనకు ముగ్ధుడైన కృష్ణుడు రాజు ముందు తనను తాను ప్రత్యక్షం చేసుకున్నాడు. "నామదేవ్ మరియు ఇతర భక్తుల మాదిరిగానే, మీరు కూడా నా ప్రత్యేక భక్తులయ్యారు. నేను మిమ్మల్ని విడిచిపెట్టను. నేను ఎప్పటికీ మీ హృదయంలో ఉంటాను." అని కృష్ణుడు అభయం ఇచ్చాడు. రాజు చాలా కాలం అక్కడే ఉండి, ద్వారకకు వెళ్లి, అక్కడ దేవుడిని ప్రార్థించాడు, ఇతర సాధువులతో కలిసి అనేక పవిత్ర స్థలాలను సందర్శించి, తన రాజ్యానికి తిరిగి వచ్చి తన కుటుంబంతో ఆనందకరమైన జీవితాన్ని గడుపుతున్నాడు.

కొన్ని రోజుల తర్వాత, గుణవతి తీర్థయాత్రకు వెళ్లాలనే కోరికను వ్యక్తం చేసింది. రాజు వెంటనే అంగీకరించి తన కుటుంబాన్ని అనేక పవిత్ర స్థలాలకు తీసుకెళ్లాడు మరియు చివరికి వారు ద్వారకకు వచ్చారు. వారు అక్కడ ప్రార్థించారు, నృత్యం చేశారు మరియు పాడారు. వారి జ్ఞానం, భక్తి, వైరాగ్యం ద్వారా దేవుడు తనను తాను వ్యక్తం చేసుకున్నాడు. వారి ఆనందానికి అవధులు లేకుండా ఆయన దర్శనం జరిగింది. దేవుడు వారిని పైకి లేపి, వారిని ఆలింగనం చేసుకుని, వారు కోరుకున్నప్పుడల్లా తనను తాను వ్యక్తం చేసుకుంటాను అని వాగ్దానం చేసి అంతర్ధానమయ్యాడు.

వారు తమ తీర్థయాత్రను కొనసాగించారు, పండరీపూర్‌కు వెళ్లి, అక్కడ ప్రార్థన చేసి, ముందుకు సాగారు. ఆ విధంగా వారు తమ చివరి శ్వాస వరకు భక్తితో జీవితాన్ని గడిపారు.

తోటి మానవుల కంటే దేవుడిని సంతోషపెట్టడం మరియు దేవుని దర్శనం పొందడం సులభం అని ఇది చూపిస్తుంది. కుటుంబం యొక్క హృదయపూర్వక ప్రార్థనకు దేవుడు ఆకర్షితుడయ్యాడు, వారి ముందు ప్రత్యక్షమై, వారు కోరుకున్నప్పుడు ప్రత్యక్షమవుతానని వాగ్దానం చేశాడు. ఇంకేం కావాలి? అటువంటి వారి జన్మ ధన్యం.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

**గత సంచిక తరువాయి**

మహోత్సవం: లోకపితామహుడైన బ్రహ్మదేవుడు వేంకటేశ్వరునికి కన్యామాసంలో ధ్వజారోహణ మహోత్సవం చేయించాడు. ప్రతిసంవత్సరం ఆ మహోత్సవాన్ని దర్శించి, స్వామిని సేవించడానికి అంగ, కోసల, కర్ణాట, కాశీ, గుర్జర దేశీయులు, చోళ, కేరళ, పాండ్య దేశవాసులు, అన్ని దేశాలవారు సకుటుంబంగా తరలి వస్తారు. దేవతలు, సిద్ధులు, మహర్షులు సనకాది యోగులు కూడ విచ్చేస్తారు. భాద్రపదమాసంలో శ్రీవేంకటేశ్వరుని మహోత్సవంలో సేవ చేసేవారు పాపరహితులై, ఉత్తమోత్తములౌతారు. మరల మీకు తీర్థవైభవాన్ని చెబుతాను. అద్భుతమైన ఆ వైభవాన్ని శ్రద్ధగా వినండి. దానిని సావధానంగా వింటే కూడ మహాఫలితం లభిస్తుంది. స్వామిపుష్కరిణికి ఉత్తర దిక్కున పాపవినాశనమనే తీర్థముంది. ఆ మహత్తర తీర్థం పాపాలన్నిటినీ పోగొడుతుంది.

**తస్య శ్రీ వేంకటేశస్య బ్రహ్మ లోకపితామహః ।**
**చకార కన్యామాసే తు ధ్వజారోహమహోత్సవమ్ ॥**
**- మా.పు.అ.3. శ్లో.4,5.**

**యే భాద్రపదమాసే తు వేంకటేశమహోత్సవే ।**
**సేవాం కుర్వంతి తే సర్వే నిష్పాపా ఉత్తమోత్తమాః ॥**
**- మా.పు.అ.3. శ్లో.8.**

కుమారధార మాహాత్మ్యం: పాపనాశనతీర్థాన్ని వాయవ్యదిశలో కుమార తీర్థం ఉన్నది. దానికి 'కుమారధార' అని కూడ లోకంలో ప్రసిద్ధి ఉంది. ఓ బ్రాహ్మణోత్తములారా! అత్యద్భుతమైన ఆ తీర్థమాహాత్మ్యాన్ని చెబుతాను వినండి.

పూర్వమొక వృద్ధ బ్రాహ్మణుడు దారిద్ర్యంతో బాధపడుతూ కుటుంబాన్ని పోషించలేక రాత్రింబవళ్ళు ఇలా దుఃఖించాడు, 'ఇహపరాల్లో ధనమే కదా సుఖసాధనం! నేను పూర్వ జన్మలో చేసిన పాపం ఫలితంగా నాకు ధనం లభించలేదు. పరలోకంలో సుఖపడాలంటే ధర్మాన్ని ఆచరించాలి కదా! ఆ ధర్మాన్ని ఆచరించడానికి కూడా నాకు శక్తి లేదు. నేను వృద్ధుడను, దుర్బలుడను. నా జన్మ వ్యర్థం. ఇక నేనేమి చెయ్యాలి?' అని తనను తాను నిందించుకుంటూ భార్యా బిడ్డలను వదలి పరితపిస్తూ సువర్ణముఖరి సమీపానికి వచ్చాడు.

**ఇహలోకే పరే లోకే సౌఖ్యహేతుర్ధనం కిల ।**
**పరలోకహితం ధర్మాచరణేన హి సాధ్యతే ॥**
**– మా.పు.అ.3. శ్లో.13,14.**

ఆ ముసలి బ్రాహ్మణుడు వేంకటాద్రి నధిరోహించి అక్కడి నుండి క్రిందకు దూకి పడిపోవాలనే తలంపుతో ఆ పర్వతంపై నుండి పెద్దగా, బిగ్గరగా ఇలా ఆక్రోశించాడు, 'ఓ బ్రహ్మవిష్ణుమహేశ్వరులారా! సూర్య చంద్రులారా! అశ్వినీదేవతలారా! దుఃఖిస్తున్న నా మాటను సర్వభూతాలు వినండి. దారిద్ర్యం వల్లను, ముసలితనం వల్లను నా జన్మ వ్యర్థమయింది. కావున నేను ఈ పర్వతం పై నుండి పడుతున్నాను. సందేహం లేదు' అని కేకలు పెడుతున్న ఆ మునిపుంగవుని ఆ

పర్వతప్రాంతంలో వేటకై సంచరిస్తున్న వేంకటేశ్వరుడు చూచి, ఒక రాజకు మారుని రూపం ధరించి, చేయెత్తి అతనితో ఇలా అన్నాడు–

ఆత్మహత్య మహాపాపం: 'ఓ బ్రాహ్మణా! నీవు కొండ దిగి రా! అక్కడ నుండి క్రిందికి దూకే సాహసం చేయవద్దు. ఆత్మహత్య మహాపాపం. అది శాస్త్ర విరుద్ధం. నీవు చేసే పని నీకు దుఃఖాన్ని కలిగిస్తుంది. కాబట్టి సాహసం చేయవద్దు, నేను నీకు హితం చెబుతున్నాను. నీవు కొండ దిగి వచ్చి నేను చెప్పే మాట విను', అనగా వృద్ధ బ్రాహ్మణుడు ఆ రాజపుత్రుని చూచి ఆ పవిత్రమైన పర్వతాన్నుండి దిగి 'నాకు ఐశ్వర్యాన్ని ఇచ్చి నా భార్యాబిడ్డలను కాపాడు' అని ప్రార్థించాడు. అప్పుడు రాజకుమారుని వేషంలో ఉన్న శ్రీనివాసుడు ఆ బ్రాహ్మణునితో నీకన్నీ ఇస్తాను. నా చేయి పట్టుకొని నా తో రా' అని ఆ బ్రాహ్మణుని చేయి పట్టుకొని అతనిని నడిపించుకుంటూ వెళ్ళి పాపవినాశన తీర్థానికి ఉత్తరంగా ఉన్న కుమారధార తీర్థానికి తీసుకువెళ్ళాడు.

విప్రస్య తు భృగోః పాతః శాస్త్రేషు న హి నిశ్చితః ।
తస్మాత్ ప్రేత్య చ దుఃఖాయ మా సాహసమిదం కురు॥

**- మా.పు.అ.3. శ్లో.23.**

ఆ తరువాత అతనితో 'ఓ విప్రోత్తమా! నీ బాధనివారణ కొరకు ఈ తీర్థంలో స్నానం చేయి. నీ బాధ ఉపశమిస్తుంది'. అని చెప్పగా ఆ బ్రాహ్మణుడు ఆ తీర్థంలో స్నానం చేసి బయటకు రాగానే యువకుడుగా మారాడు. అతని మనస్సు ప్రసన్నమయింది. అతడాశ్చర్యపడుతూ చుట్టు ప్రక్కల చూశాడు. ఆ తీరమంతా వెతకినా ఎక్కడా ఆ రాజకుమారుడు కనపడలేదు. అప్పుడతను 'నా ఇష్టదైవం నన్ను వదలి ఎక్కడికి వెళ్ళాడో కదా!' అని దుఃఖిస్తూ ఉండగా శ్రీనివాసుడు కంటికి కనపడకుండా అంతర్హితుడై ఆకాశంలో నిలబడి ఇలా అన్నాడు`

నిన్నిక్కడకు తీసుకువచ్చినది నీ ప్రభువైన సాక్షాత్తు వేంకటాధీశుడే. ఇందులో సందేహం లేదు. ఓ బ్రాహ్మణుడా! నీవు ఈ తీర్థంలో స్నానం చేయుట వలన యువకుడుగా మారావు. నీకు నేను ఐశ్వర్యాన్ని ప్రసాదించాను. నీవు వెంటనే మీ ఊరికి వెళ్ళి నీ భార్యా బిడ్డలను కలుసుకో. నీ శరీరానికి బలం కూడ వచ్చింది. కాబట్టి నీ విప్పుడు ఈ శరీరంతో ధర్మాన్నాచరించు. బ్రాహ్మణులకు దానాలు చెయ్యి. బంధువులకు ధనమివ్వు. పేదలకు అన్నదానం చెయ్యి. నువ్వు సుఖంగా భోగాలనుభవించు.

నిషిద్ధసుఖభోగి పశువే : శాస్త్రవిహితాలైన సుఖాలను వదలిపెట్టేవాడు పశువుతో సమానుడు. అలాగే నిషిద్ధ సుఖాలను అనుభవించేవాడు పశువే. సందేహం లేదు. శ్రీవేంకటేశ్వరుని ప్రీతి కొఱకే సర్వ కర్మలు ఆచరించు. భార్యను వదలడం, శాస్త్రవిహితాలైన భోగాలను అనుభవించకుండ ఉండడం, శాస్త్రసమ్మతం కాదని పెద్దలు చెబుతారు21.

అనిషిద్ధసుఖత్యాగీ పశురేవ న సంశయః ।
నిషిద్ధసుఖభోక్తా చ పశురేవ న సంశయః ॥
శ్రీవేంకటేశః ప్రీయతామిత్యేవ సకలం కురు ।
స్త్రీత్యాగభోగాకరణే నింద్యమేవ విదుర్బుధాః ॥

**- మా.పు.అ.3. శ్లో.35- 37.**

కుమారధార: శ్రీనివాసుడు ఇలా పలుకగా దేవతలందరు అతని వద్దకు వచ్చి 'ఈ కుమారధార తీర్థమహిమ వర్ణింప సాధ్యం కానిది. ఈ ముసలి బ్రాహ్మణుడు దీనిలో స్నానం చేయుట వలన యువకుడిగా, ధనవంతుడుగా మారాడు. వృద్ధబ్రాహ్మణుడు ఈ తీర్థంలో స్నానం చేసి కుమారుడుగా మారుట వలన ఈ తీర్థం 'కుమారధార' అని ప్రసిద్ధి పొందుతుంది. ఈ తీర్థంలో స్నానం చేసేవారు పాపరహితులై సుఖంగా ఉంటారు22, అని పలికి స్వర్గానికి వెళ్ళారు.

యతః కుమారతాం యాతః సద్యో వృద్ధమహీసురః ।
తస్మాత్ 'కుమారధారే' తి లోకే ఖ్యాతిం గమిష్యతి ॥
కుమారతీర్థే యః స్నాతో నిష్పాపః స సుఖీభవేత్ ।

**- మా.పు.అ.3. శ్లో.39.40**

ఆ తరువాత ఆ బ్రాహ్మణుడు మూడురోజులు అక్కడ ఉండి, తన ఊరికి వెళ్ళి, గొప్ప ఐశ్వర్యాన్ని పొంది, భార్యాబిడ్డలతో కలసి అనేక ధర్మకార్యాలు ఆచరించాడు. 'శ్రీ వేంకటేశ్వరుడు తృప్తి చెందుగాక' అనే సంకల్పంతో సర్వ కార్యాలు నిర్వర్తిస్తూ, ఇహలోక సుఖాలన్నీ అనుభవించి విష్ణులోకానికి వెళ్ళాడు. ఈ తీర్థాన్ని 'కుమారధారిక' అని శ్రీమహావిష్ణువు ఒకప్పుడు పేర్కొన్నాడని సూతమహర్షి చెప్పగా శౌనకాది మహర్షులు 'భగవంతుడు దీనికీ పేరు ఎప్పుడు పెట్టాడు? దానిని వివరించండి? అని అడిగారు.

అగస్త్య మహర్షి తన ఆశ్రమవాసులైన మహర్షులతో ఓ బ్రాహ్మణోత్తములారా! వాజపేయ యాగం కంటె కూడ ఎక్కువ ఫలితాన్నిచ్చే శ్రీవేంకటేశ్వరుని కథతో కూడిన కుమారధారికా వృత్తాంతాన్ని చెబుతాను వినండి. ఒకానొకప్పుడు శంకరుని కుమారుడైన కుమారస్వామి తారకాసురుడనే రాక్షసుని సంహరించి దాని ఫలితంగా బ్రహ్మహత్యాపాతకాన్ని పొందాడు. అతడు తండ్రివద్దకు వెళ్ళి దుఃఖిస్తూ 'తండ్రీ! నేనొక పాపకార్యం చేశాను. దేవతలకు ఉపకారం చేయడానికై నేను తారకాసురుని సంహరించాను. అతణ్ణి వధించడం వలన బ్రహ్మహత్య నన్ను చాల బాధిస్తున్నది. దానికి తగిన ప్రాయశ్చిత్తాన్ని నాకు తెలియజేయండి' అని అడుగగా సర్వజ్ఞుడైన శంకరుడు దేవతలకు హితం చేసిన తన పుత్రునితో ఇలా అన్నాడు.

విశ్వవిఖ్యాత పర్వతం: 'పుత్రా! ఒక్కసారి 'నారాయణ' అని ఉచ్చరిస్తే మానవుడు మూడు కల్పాలు గంగాది సర్వ తీర్థాలలో స్నానం చేసిన ఫలితాలను పొందుతాడు. ఇది చాల రహస్యమైనది. దీనిని నీవు ఎల్లప్పుడు మనసులో ఉంచుకో. మరొక

గొప్ప ప్రాయశ్చిత్తాన్ని చెబుతా విను. సువర్ణముఖరి తీరంలో లక్ష్మీపతికి నివాసస్థానమైన 'వేంకటాద్రి' అని విశ్వవిఖ్యాతమైన పర్వతమున్నది.

**సువర్ణముఖరీతీరే లక్ష్మీపతినివాసభూః ।**
**వేంకటాద్రిరితి ఖ్యాతః సర్వలోకేషు వర్తతే ॥**

**- మా.పు.అ.4. శ్లో.8.**

శ్రీనివాసుని నిత్యనివాసం : ఆ పర్వతంపైన అనేక తీర్థాలున్నాయి. వాటిలో కొన్నిటిని చెబుతాను. చక్రతీర్థం, స్వామితీర్థం, మత్స్యతీర్థం, పాండవతీర్థం. నాగతీర్థం (శేషతీర్థం), బిల్వతీర్థం, జాబాలి తీర్థం, ఆకాశగంగ, పాపవినాశనం, తుంబురు తీర్థం, వామనతీర్థం, కుమారతీర్థం ప్రధానమైనవి. శ్రీ వేంకటాచలంలోని తీర్థాలను, స్మరిస్తే అనేక జన్మలలో చేసిన పాపాలు నశిస్తాయి. ఇందుకు ఏ మాత్రం సందేహం లేదు. స్వామిపుష్కరిణి తీరంలో పరాత్పరుడైన శ్రీనివాసుడు సర్వలోకాలకు హితం చేయుటకై నిత్యం నివసిస్తున్నాడు. ఆ వేంకటాచలపతిని 'వేంకటేశ' అని ఎల్లప్పుడు స్మరించేవారికి విష్ణువు ప్రసన్నుడౌతాడు24.

**స్వామితీర్థస్య తీరే తు శ్రీనివాసః పరాత్పరః ।**
**నిత్యం వసతి సర్వేషాం లోకానాం హితకామ్యయా ।**
**తత్ర వేంకటశైలేశం 'వేంకటేశే'తి సర్వదా ॥**
**యో వై స్మరతి తం నిత్యం తస్య విష్ణుః ప్రసీదతి ॥**

**- మా.పు.అ.4. శ్లో.12-14.**

కుమారస్వామి తపస్సు : కావున, నీవు ఆ వేంకటాచలానికి వెళ్ళి, వేంకటేశ్వరునికి నమస్కరించి' కుమారధారతీర్థానికి వెళ్ళు. ఆ తీర్థంలో మూడు పూటలా స్నానం చేసి జితేంద్రియుడవై 'ఓం శ్రీ వేంకటేశాయ నమః' అనే మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేయి' అని శంకరుడు చెప్పగా విని దేవసేనాధిపతియైన కుమారస్వామి తండ్రిమాట ప్రకారం చక్రతీర్థం (కపిలతీర్థం) లో స్నానం చేసి, వేంకటాద్రి నధిరోహించి, స్వామిపుష్కరిణిని చేరాడు. వేంకటాద్రికి క్రోశదూరంలోనే బ్రహ్మహత్య గట్టిగా అరుస్తూ నిలబడి పోయింది.

ఆ వేంకటాచల మాహాత్మ్యాన్ని ఏమని వర్ణిస్తాం! కుమారస్వామి స్వామిపుష్కరిణిలో స్నానం చేసి వేంకటేశునికి నమస్కరించి, ఆయనకు ప్రదక్షిణం చేసి' బ్రహ్మరుద్రాదులకు కూడా పూజ్యుడవైన ఓ వేంకటనాయకా! నిన్ను సేవిస్తున్నాను. మాధవా! నా అరిష్టాలను నివారించి నాకు అభీష్టాలను ప్రసాదించు' అని శ్రీనివాసుని ప్రార్థించి, పాపనాశనతీర్థానికి వెళ్ళాడు. ఆ తీర్థంలో స్నానం చేయగా అతని పాపాలన్నీ నశించినాయి.

దానికి వాయవ్యదిక్కున పర్వతగుహలలో పడుతున్న ఒక జలధారను చూశాడు. మామిడి, మందార, పనస, కుందమల్లె, మద్దివృక్షాలతో నయనానందకరంగా బహుశాఖలతో విస్తరించిన వృక్ష విశేషాలతోను, సింహాలు, శార్దూలాలు, ఖడ్గమృగాలు, లేళ్ళు మొదలైన మృగాలతో కూడినది, ఆహార నియమంతో నిష్ఠతో తపస్సు చేస్తున్నటువంటి మునీశ్వరులతో కూడిన ఆ తీర్థంలో స్నానం చేసి, దేవతలకు తర్పణలిచ్చి, శుద్ధవస్త్రాలు ధరించి, మనస్సును, వాక్కును, శరీరమును నియమించి, తూర్పు దిక్కుగా తిరిగి సుఖాసనంలో కూర్చొని శ్రీదేవి భూదేవులతో కూడినవాడు, ఉత్తమ భూషణాలతో అలంకరించబడినవాడు, మందస్మిత వదనారవిందుడు, పీతాంబరధారి, అధోక్షజుడైన వేంకటేశ్వరుని స్మరిస్తూ మహాదేవుడు ఉపదేశించిన మంత్రాన్ని రాత్రింబవళ్ళు జపిస్తూ, పండ్లను, నీటిని మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ, ఇతర ఆహారమేదీ స్వీకరించకుండా తపస్సు చేశాడు.

భగవంతుని ఆవిర్భావం: ఆ పవిత్రమైన శేషాద్రిలో కుమారస్వామి ఈ విధంగా తపస్సు చేస్తుండగా కుంభమాసంలో పౌర్ణమి తిథినాడు మఖనక్షత్రంలో బుధవారం మధ్యాహ్న సమయంలో ఆ శివుని పుత్రుడు మనసులో ఏ విధంగా ధ్యానిస్తున్నాడో ఆ విధంగా భగవంతుడు ఆవిర్భవించాడు.

ఆ పరాత్పరుడు మేఘగంభీరధ్వనితో "కుమారా! కుమారా!" అని పిలిచాడు. అప్పుడు కుమారస్వామి కన్నులు తెరచి చూశాడు. తన ఎదురుగుండా ఒక చేతిలో శంఖాన్ని, మరొక చేతిలో చక్రాన్ని ధరించి, ఎడమ చేతిని నడుముపై పెట్టుకొని, తనను సేవించినవారికి సంసారసాగరం మొలలోతు మాత్రమేనని తెలియజేస్తూ, కుడి చేతితో తన పాదపద్మాలను ఆశ్రయించమని చూపిస్తూ, పరమ సౌందర్యవతులు అశేష ఆభరణాలతో అలంకరించబడినవారు, మిక్కిలి ప్రసన్నమైన ముఖపద్మాలతో విరాజిల్లుతున్న శ్రీదేవి భూదేవులతో సేవించబడుతూ పరమానందంతో ఉన్న వేంకటేశ్వరుని దర్శించి వెంటనే ఆ దేవశ్రేష్ఠుడైన కుమారస్వామి ఆ దేవదేవునికి మూడుసార్లు ప్రదక్షిణం చేసి, సాష్టాంగ నమస్కారం చేసి, అనన్యచిత్తంతో అంజలిబద్ధుడై ప్రభూ! దేవదేవా! జగన్నాథా! లక్ష్మీపతీ! శ్రీహరీ! నీకు జయమగు గాక! లోకేశ్వరా! సర్వదోషహరా! నీకు నమస్కారం' అని స్తుతించాడు.

బ్రహ్మరుద్రాదులరాక: అప్పుడు దేవదుందుభులు మ్రోగినాయి. మహాశంఖధ్వని మారుమ్రోగింది. తుంబురు నారదులు వీణను చేతబట్టి వచ్చారు. భగవంతుడు కుమారస్వామికి సాక్షాత్కరించాడని తెలుసుకొని బ్రహ్మదేవుడు సర్వదేవతాసమూహంతో అక్కడకు వచ్చాడు. పరమేశ్వరుడు పార్వతీసహితుడై పుత్రప్రేమతో వృషభాన్నధిరోహించి విఘ్నేశ్వరుడు, ప్రమథగణాలతో కూడి వచ్చాడు. ఇంద్రాది లోకపాలకులు, అశేష దేవతలు, వైఖానసులు, వాలఖిల్యులు, ఋషులు, తపోధనులు, గంధర్వులు, అప్సరససంఘాలు,

నాగులు, విద్యా ధరులు మొదలైన దేవతాసమూహాలన్నీ అక్కడకు వేంచేసినాయి. వారంతా 'ఓ వేంకటశైలనాథా! విష్ణూ! మునిజన సంసేవితా! శేషశైలవాసా! నీకు జయమగుగాక! సకలజ నహితం కోసం అవతరించిన ఓ దేవదేవా! భక్త జనాభిరామా! నీకు జయమగుగాక! స్వామీ! మమ్ము రక్షించు' అని స్తోత్రం చేసి వేంకటేశ్వరునికి నమస్కరించారు.

శ్రీదేవి భూదేవులతో కూడిన విష్ణుమూర్తి, నాలుగు భుజాలు కలవాడు, కిరీటాన్ని, శంఖచక్రాలను ధరించినవాడు, దేవదేవుడు, వనమాలచే అలంకరించబడినవాడు శేషుడు, గరుడుడు, విష్వక్సేనుడు మొదలగు పరివారంతో నిత్యం సేవించబడేవాడు, ప్రహ్లాదుడు, శుకుడు మొదలగు వారిచే ఛత్రచామరాదులు ధరింపజేయబడినవాడు, ప్రసన్నుడైన ఆ వేంకటాచలపతికి నమస్కరించి, మరల లేచి నిలబడ్డారు. వ్యాసాది మహర్షులు కూడ ఆయనకు నమస్కరించారు. వారంతా మౌనంగా నిలబడ్డారు. అప్పుడు అందరూ వింటుండగా శివసుతుడైన కుమారస్వామి శ్రీనివాసుని ఈ విధంగా స్తుతించాడు.

శ్రీనివాసస్తుతి: ఓ వేంకటనాథా! విష్ణుమూర్తీ! నారాయణా! సకల జన హృదయ నివాసా! భక్తార్తిహరా! మురారీ! సూర్యచంద్రులు నేత్రాలుగా గలవాడా! సర్వలోకపూజ్యా! నీకు నమస్కరిస్తున్నాను. బ్రహ్మరుద్రాదులకు కూడా నమస్కరింపదగిన వాడా! పరబ్రహ్మస్వరూపా! అనంతశక్తిశాలీ! నారాయణగిరీశా! నారాయణా! నీకు నమస్కారం. ఓ దేవదేవా! నారాయణా! నీకు నమస్కారం. ఓ దేవదేవా! నీకు సదా నమస్కారం. నిన్ను సేవించేవారి యెడల మిక్కిలి కరుణను చూపే దేవాధినాథా! నీకు నమస్కారం. నీ రాక్షసులనే అడవికి గొప్పకార్చిచ్చు వంటి వాడవు. వక్షః స్థలంలో లక్ష్మీదేవి కలవాడవు. కౌస్తుభమణిని ధరించిన నీకు నమస్కారం. లోకంలో అదృష్టవంతులకే నీ దర్శనం లభిస్తుంది. జగద్రక్షణకొరకు ఉద్యుక్తుడైనవాడవు, శ్రీదేవి భూదేవులు ఇరుప్రక్కల కలవాడవు, వారిరువురిచే నిత్యం సేవించబడేవాడవు, నిత్య బంధువు వైన నిన్ను పుణ్యాత్ములే దర్శించగలరు. ఆహా! నేనిప్పుడు దయాసముద్రుడైన వేంకటేశ్వరుని దర్శించ గలిగాను. ఆహా! ఏమి నా భాగ్యం! ఇది ఎంత మహత్తరమైన భాగ్యం!.

ఇలా స్తుతించి కుమారస్వామి ప్రేమాతిశయంతో తన ఆరు ముఖాలతో మేఘ గంభీరధ్వానంతో మరల 'ఓ వేంకటేశా! నీ దర్శనం వలన నా నేత్రాలు సార్థకమైనాయి. నీ మృదు మధురామృతభాషణతో నా చెవులను కూడా సార్థకం చేయి' అని పార్వతీపుత్రుడైన కుమారస్వామి ప్రార్థించగా శ్రీహరి మందస్మిత వదనారవిందుడై దేవతలందరు వింటుండగా మహాదేవుడైన పరమ శివునితో ఇలా అన్నాడు.

"శంకరా! ఈ సత్పుత్రుడి వలన నీవు మిక్కిలి ధన్యుడవయ్యావు. ఆహా! అనేక జన్మల తపస్సు ఫలంగా ఇటువంటి సత్పుత్రులు కలుగుతారు కదా! అలాగే అనేక జన్మల పాపం వలన దుర్మార్గులైన పుత్రులు పుడతారు25."

**అనేకజన్మతపసాం ఫలం సత్పుత్రతా ఖలు ।**
**అనేకజన్మపాపానాం ఫలం దుష్పుత్రతా భువి ॥**

**- మా.పు.అ.4. శ్లో.51-52.**

అని చెప్పి మరల ఆ ఈశ్వరపుత్రునితో శ్రీనివాసుడు 'నాయనా! నీవు ధన్యుడవు, కృతకృత్యుడవయ్యావు. కావున ఇప్పుడు వరం కోరుకో. నీవు చేసిన తపస్సు వలన, స్తోత్రం వలన నేను తృప్తి చెందాను. నీ తండ్రి మాటను ప్రమాణంగా స్వీకరించి పన్నెండు సంవత్సరాలు తీవ్రతపస్సు చేసి చాల అలసిపోయావు. పితృాజ్ఞాపరిపాలకా! ఇకపైన నీవు సుఖంగా ఉండు' అని పలుకగా స్కందుడు 'స్వామీ! మీపాద సేవకంటె నాకు కావలసిందేముంది. లోకాలన్నీ మీ పాదసేవాభాగ్యాన్ని కోరుకుంటాయి. వేంకటేశా! అటువంటి తమ దివ్యపాదసేవాభాగ్యం నాకీరోజు లభించింది. ఆహా! ఇదంతా జగత్ప్రభువైన ఆ శ్రీహరి కృపావిశేషం కదా! తారకాసురవధ వలన కలిగిన బ్రహ్మహత్యాదోషం నన్ను వదలి దూరంగా పోయింది. శ్రీనివాసా! దయాసముద్రా! దురితక్షయకారకా! ఇదంతా నీ దయావిశేషమే!" అని స్తుతించాడు.

కుమారధారిక: అంతట భగవానుడు స్కందునితో ఇలా అన్నాడు' ఓ మహామతీ! నీవు నా మంత్రాన్ని ఉచ్చరిస్తూ సుఖంగా ఉండు. ఎంత అవివేకి అయినా ఈ పర్వతాన్ని అధిరోహించాలని కోరిక కలిగిన వెంటనే అతని పాపాలు దూరంగా పోతాయి. అటువంటిది భక్తుడవైన నీ పాపాలు పోవడంలో ఆశ్చర్యమేముంది? ముఖ్యంగా స్వామిపుష్కరిణిలో స్నానం చేస్తే కోట్ల పాపాలు కూడ నశిస్తాయి. ఓ దేవతలారా! కుమారా! మీరంతా నా మాట వినండి. ఈ తీర్థం 'కుమారధారిక' అని నీ పేరుతో ప్రసిద్ధి చెందుతుంది. దీనిలో స్నానం చేసే పురుషుడు కాని, స్త్రీ కాని, మానవులెవరైనా వారి పాపాలన్నీ నశిస్తాయి. ఇది ముమ్మాటికీ సత్యం26.'

**శృణ్వంతు దేవతాః! సర్వాః శృణు స్కంద! వచో మమ ।**
**'కుమారధారికే' త్యేవ త్వన్నామ్నేదం భవిష్యతి ॥**
**తత్ర స్నాతి పుమాన్ స్త్రీ వా–వశ్యం కో–పి తు మానవః ।**
**తస్య పాపాని నశ్యంతి సత్యం సత్యం వదామ్యహమ్ ॥**

**- మా.పు.అ.4. శ్లో.59-60.**

కుమారధార తీర్థపర్వదినం: భగవానుడు స్కందునితో ఇలా అన్నాడు 'మఖానక్షత్రంతో కూడిన మాఘపౌర్ణమినాడు ఈ కుమారధార తీర్థంలో భక్తితో స్నానం చేసేవారు బ్రహ్మ రుద్ర ఇంద్రాదులకు కూడ పూజ్యులవుతారు. నేనావిర్భవించిన రోజున స్నానం చేసేవారి పుణ్యఫలాన్ని వర్ణించటానికి ఆదిశేషునకు కూడ అలవికాదు. ప్రతి సంవత్సరం ఆ పవిత్ర దినమున మానవులంతా

ఈ పుణ్యతీర్థంలో స్నానం చేస్తే వారి పాపాలన్నీ పోతాయి.'

'ఈ తీర్థంలో అణుమాత్రమైనా స్వర్ణదానం చేస్తే అది మేరుపర్వతంతో సమానమౌతుంది. నా ప్రీతి కొరకు ఎవరు వస్త్రదానం, గోదానం, భూదానం, చేస్తారో వారిఇంట్లో లక్ష్మి నివసిస్తుంది. ఈ తీర్థ పర్వదినంలో ఒక్కరికి అన్నం పెట్టినా వేయి మందికి అన్నదానం చేసిన ఫలితాన్ని పొందుతారు. ఈ తీర్థానికి వెళ్ళేదారిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసే వారి సంతతిని నేను దయతో కాపాడతాను. బ్రాహ్మణులకు తాంబూలం, చందనం ఇచ్చేవారి పదితరాలు వెనుక, పదితరాలు ముందర వారంతా పాపరహితులవుతారు. శ్రీహరి సాక్షాత్కరించిన మాఘ పూర్ణిమినాడు కుమారధారలో స్నానం చేస్తే కోటి వంశాలవారు ఉద్ధరించబడతారు. అనే మంత్రాన్ని ఉచ్చరిస్తూ స్నానం చేస్తే అనంతఫలం లభిస్తుంది. ప్రతి సంవత్సరం మాఘపౌర్ణమినాడు మఖానక్షత్రంలో దేవతలు మానవులు స్నానం చేయడానికి ఇక్కడికి వత్తురు గాక!'

**కుంభమాసే పౌర్ణమాస్యాం ప్రాదుర్భావదినే హరేః।**
**కుమారధారికాస్నానం కులకోటిం సముద్ధరేత్ ॥**

**- మా.పు.అ.4. శ్లో.59-60.**

'పుణ్యక్షేత్రాలన్నిటిలో వేంకటాచలం విశిష్టమైనది. దానిలోని తీర్థాలన్నింటిలో స్వామిపుష్కరిణి శ్రేష్ఠమైనది. దానికంటె కూడా నేనావిర్భవించిన రోజున ఈ తీర్థం విశేషమైనది. శివకుమారా! నీవు కల్పాంతం వరకు నన్నారాధిస్తూ ఇక్కడే ఉండు. ఈ తీర్థమాహాత్మ్యాన్ని తెలుసుకొని ప్రతి సంవత్సరం, నేనావిర్భవించిన రోజున ఈ తీర్థంలో స్నానం చేయడానికి, నన్ను దర్శించటానికి సకల దేవతలు, తపోధనులు ఎంతో శ్రద్ధతో ఇక్కడకు వస్తారు. కాబట్టి ఓ శివపుత్రా! నీవు ఎల్లప్పుడు ఈ పర్వంతంపైనే నివసించు' అని పలికి అచ్యుతుడు స్కందుని తన దివ్యహస్తంతో స్పృశించి ఆశీర్వదించాడు.

ఆ తరువాత దేవతలు, ఋషులు, గంధర్వులు, విద్యాధరులు, యక్షులు, సిద్ధులు అందరూ ఆశ్చర్యమాశ్చర్యమని అంటూ దివ్యమైన హరినామ సంకీర్తనం చేస్తూ, కుమారధార తీర్థాన్ని సదా స్తుతిస్తూ, తమ తమ నెలవులకు వెళ్లారు. సంతోషంతో శివకుమారుడు మాత్రం చాల కాలం శ్రీవేంకటేశ్వరుని సేవిస్తూ కుమారధార తీర్థతీరంలోనే ఉన్నాడు..

ప్రతి సంవత్సరం సిద్ధులు, గంధర్వులు, దానవులు, ఋషులు భూలోకంలో ఉండేవారంతా ఆ మహాతీర్థంలో స్నానం చేయడానికి వస్తారు. ఆహా! ఆ వేంకటాద్రి వైభవం ఏమని చెప్పాలి? సువర్ణముఖరి తీరంలో లోపాముద్రపతియైన అగస్త్య మహర్షి మునిశ్రేష్ఠులకు స్వయంగా ఇలా కుమారధార తీర్థవైభవాన్ని వివరించి మరల ఇలా అన్నాడు`

మహర్షుల పయనం: 'నేటి నుండి ఐదారు రోజులలో ఆ శుభప్రదమైన మాఘపౌర్ణమి వస్తుంది. ఓ మార్కండేయ మహామునీ! మహర్షులారా! పవిత్రమైన కంచిప్రాంతీయులైన మీరంతా వేంకటాద్రికి వెళ్ళండి. అక్కడ స్వామిపుష్కరిణి తీరంలో ఉన్న వేంకటేశ్వరుని దర్శించి, దానికి ఉత్తరంగా ఉన్న పాపనాశన తీర్థంలో స్నానాదికాలు చేసుకొని, కుమారధార తీర్థానికి వెళ్ళి, దానిలో స్నానం చేయండి. మీ పాపాలన్నీ పోయి, ఐశ్వర్యం లభిస్తుంది. మహాత్మా! మార్కండేయా! నీకు తీర్థయాత్రతో ఏమి పని? అన్ని తీర్థాలలో స్నానం చేసిన ఫలితాన్ని ఈ తీర్థస్నానంతోనే పొందగలవు' అని చెప్పగా వారంతా వేంకటాచలాన్ని అధిరోహించారు.

వారు స్వామిపుష్కరిణిలో స్నానం చేసి, కేశవుని దర్శించి, మాఘపౌర్ణమినాడు పాపనాశనంలో స్నానం చేసి, కుమారధార తీర్థంలో స్నానం చేయటానికి వెళ్ళారు. సకల దేశవాసులైన మానవులు, దేవతలు, ఋషులు, సనకాదియోగులు, సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు, సువర్ణముఖరి తీరంలోని మహర్షులు, అగస్త్యశిష్యుడైన శుద్ధుడు, మార్కండేయుడు మొదలైన వారందరిని చూచి అగ్నిసంభవుడైన కుమారస్వామి మిక్కిలి సంతోషించాడు. వారంతా సంకల్ప పూర్వకంగా ఆ కుమారధార తీర్థంలో స్నానమాచరించారు.

కొందరు వేంకటేశార్పణంగా దానాలు చేశారు. గంధర్వులు, యక్షులు, నాగులు, సిద్ధులు, సాధ్యులు మొదలైన దేవబృందాలన్నీ ఆ తీర్థంలో స్నానం చేస్తుండగా శంకరపుత్రుడు కూడ సంతోషంతో వారితో పాటు ఆ తీర్థంలో స్నానం చేశాడు. పార్వతీ పుత్రుడు విష్ణుసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తాలను సదా పఠిస్తూ, తీరానికి వచ్చి, ప్రసన్నమనస్కుడై 'భూసురు లందరికీ నమస్కారం' అంటూ మహర్షులందరికీ అభివాదం చేశాడు.

భగవంతుని సాక్షాత్కారం: అంతట భగవంతుడు శంఖచక్రధారియై వరాలు ప్రసాదించుటకై సాక్షాత్కరించాడు. సముద్ర తనయయైన లక్ష్మీదేవితోను, కశ్యప్రజాపతి కుమార్తెయైన భూదేవితోను కూడివున్న ఆ దేవదేవుని చూచి ఋషులు, మానవులు, మార్కండేయుడు, సువర్ణముఖరి తీరంలోని విప్రులు, విశుద్ధ మనస్కులై ఆయనకు నమస్కరించారు.

'శ్రీదేవి భూదేవులచే సేవించబడే ఓ వేంకటేశా! దయానిధీ! కృష్ణా! త్రిలోకాధిపతీ! అనాథనాథా! దీనబంధూ! దిక్కు లేని నన్ను రక్షించు. నీ పాదపద్మాలకు నమస్కారం' అని వారంతా నమస్కారాలు చేయగా ఆ దేవాధిదేవుడు ప్రసన్న హృదయంతో మేఘగంభీరధ్వానంతో ఇలా అన్నాడు`

'ఈ తీర్థంలో యథావిధిగా నా ప్రీతి కొరకై చేసే స్నానం, దానం పాపాలన్నిటినీ పోగొట్టి, సర్వసౌఖ్యాలను ప్రసాదిస్తాయి. ఓ మార్కండేయా! మహాప్రాజ్ఞా! నీకీ తీర్థస్నానం వలన సర్వతీర్థఫలం లభించింది. నీవు నీ తల్లిదండ్రులను సేవించు. అగస్త్యశిష్యా!

శుద్ధా! నీ పాపాలన్నీ ఈ తీర్థ స్నానంతో నశించినాయి. నేను నీకు అనేక శుభాలను ప్రసాదిస్తున్నాను. నీవు నీ భార్యాబిడ్డలతో కలసి సదాచార సంపన్నుడవై బహుదానాలు చేస్తూ సుఖంగా జీవించు' అని వరాలు ప్రసాదించి వేంకటేశ్వరుడు అంతర్ధానం చెందాడు.

శ్రీమన్నారాయణుడు ఈవిధంగా చెప్పగా దేవతలందరు తమ తమ నెలవులకు వెళ్ళిన తరువాత శుద్ధుడు తన దేశానికి వచ్చి, భార్యాబిడ్డలతో కూడి వేంకటేశ్వరుని స్మరిస్తూ స్నానం, దానం, జపాదులు చేస్తూ ఇహలోకంలోను, పరలోకంలో కూడ పరమ సౌఖ్యాన్ని పొందాడు.


మార్కండేయుడు మృకండుమహర్షి ఆశ్రమానికి వెళ్ళి ప్రశాంతచిత్తుడై తల్లిదండ్రులకు నమస్కరించి జరిగిన వృత్తాంతమంతా చెప్పాడు. మొదట గరుత్మంతుడి మాటలను, తరువాత వేంకటాచల వైభవాన్ని, అగస్త్యశిష్యుని వృత్తాంతాన్ని, సువర్ణముఖరితీరాన్ని, స్వామిపుష్కరిణి తీరంలో శ్రీ వేంకటేశ్వరుని సేవించిన విధానాన్ని, కుమారధార తీర్థవైభవాన్ని, కుమారస్వామి చరిత్రను, ఆయనకు శ్రీహరి సాక్షాత్కరించటం, ఆయన అమృతమయమైన వాక్కులు మొదలైన విషయాలన్నిటిని తల్లిదండ్రులకు చెప్పి వారికి శుశ్రూష చేశాడు.

వేంకటాద్రి మాహాత్మ్యం: శ్రీ వేంకటేశుని మాహాత్మ్యాన్ని ఒక్కసారైనా వినేవారు పాపాలన్నిటి నుండి విముక్తులై సకల శ్రేయస్సులను పొందుతారు. వేంకటాచల మాహాత్మ్యాన్ని, కుమారధార తీర్థమాహాత్మ్యాన్ని వినేవారికి, చదివేవారికి అనంతమైన పుణ్యం లభిస్తుంది. కుమారధార తీర్థతీరంలో దీన్ని ఎవరైతే పఠిస్తారో, వింటారో వారందరికీ శ్రీహరి సర్వాభీష్టాలను ప్రసాదిస్తాడు.

**వేంకటేశస్య మాహాత్మ్యం యః శృణోత్యపి వా సకృత్ ।**
**సర్వపాపవినిర్ముక్తః సర్వశ్రేయో భవిష్యతి ॥**
**వేంకటాద్రేస్తు మాహాత్మ్యం కుమారసరసస్తథా ।**
**శృణోతి వా పఠతి వా తస్య పుణ్యమనంతకమ్ ॥**
**కుమారధారికాతీర్థతీరే పఠతి యస్త్విదమ్ ।**
**శృణోతి వా తస్య తస్య సర్వాభీష్టప్రదో హరిః ॥**

**- మా.పు.అ.5. శ్లో.30- 32.**

**శ్రీవేంకటాచల మాహాత్మ్యంలోని**
**శ్రీమార్కండేయ పురాణ భాగం సంపూర్ణం**



## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు



## భజ గోవిందం మరియు 82వ కళ్యాణం

ఇది శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధిపతి గారి ప్రత్యక్ష పర్యవేక్షణ, మంగళాశాసనములతో తేది 06-07-2025 తొలి ఏకాదశి, ఆదివారం, సాయంత్రం 6 గంటల నుండి జరిగింది. ముందు భజగోవిందం జరిగిన పిదప 82వ శ్రీనివాస కళ్యాణం జరిగింది. ఇది శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, వివేక్ నగర్, చిక్కడపల్లిలో జరిగింది. దీనిని శ్రీమాన్ శ్రీరాం పండరి, విజయలక్ష్మి దంపతులు నిర్వహించారు.

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్త్వం

- రాళ్ళబండి శ్రీనివాసన్



**గత సంచిక తరువాయి**

అల్లంత దూరంలో కుచేలుని చూడగానే కృష్ణుడు పాన్పు నుంచి దిగాడు. గబగబా నడుస్తూ ఎదురువెళ్ళాడు. అతణ్ణి గట్టిగా కౌగిలించుకున్నాడు. తరువాత తనదైన పర్యాటకం మీద కూర్చోబెట్టాడు.

పూజా ద్రవ్యాలను కృష్ణ భగవానుడే స్వయంగా తీసుకుని వచ్చాడు. ఇక మిత్రుడు సుదాముని పాదాలను కడిగాడు. పద్నాలుగు లోకాలన్నింటినీ పవిత్రం చేస్తున్న ఆ పురుషోత్తముడు కుచేలుని పాదోదకాలను శిరస్సుమీద చల్లుకున్నాడు.

శ్రీచందన అగరు కుంకుమ ఇత్యాదిగా కూడుకున్న దివ్యగంధాలను శ్రద్ధతో అద్దినాడు. తరువాత వీవనతో విసిరాడు. సువాసనలు గుబాళిస్తున్న ధూపంతోనూ – హారతులతోనూ చక్కగా పూజించాడు. షడ్రసోపేతమైన భోజన పదార్థాలను సమర్పించాడు.

"కుచేలం మలినం క్షామం ద్విజం ధమనిసంతతమ్"– కుచేలుని శరీరము మలినపూరితమై– బక్కచిక్కిపోయింది. దేహములోని నాడులు అన్నీ బాగా బయటికి కనిపిస్తున్నాయి. రుక్మిణీదేవి స్వయంగా వింజామర పట్టుకుని వీస్తూ సేవించింది. అంతఃపురంలో వుంటున్న నారీజనం ఆశ్చర్యంతో ఈ విధంగా అనుకున్నారు–

**ఏమి తపంబు చేసెనొకో! ఈ ధరణీదివిజోత్తముండు తొల్**
**బాముని యోగివిస్ఫుర దుపాస్యకుడై తనరారు ఈ జగత్**
**స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించి ఉన్న వా**
**డీ మహనీయమూర్తికి ఎనయే మునిపుంగవులు ఎంతవాలున్?**

ఈ భూసురోత్తముడు (బ్రాహ్మణుడు) మునుపటి జన్మలో ఏవిధమైన ఎంత తపస్సు చేసాడో–యోగిజనులచేత నమస్కరింపబడే కృష్ణ భగవానుని పాన్పు మీద కూర్చున్నాడు. ఎటువంటి మునిశ్రేష్ఠులు ఎందరైననూ ఈ మహానుభావునికి సాటిరారుకదా!

కృష్ణ భగవానుడు కుచేలుడును గురుకులంలో గడిపిన విశేషాలను ముచ్చటించుకున్నారు. తరువాత నీవు ఇక్కడకు వస్తూ నాకేమి బహుమానం తెచ్చావు? అది లేశమైనా కొండంతగా భావిస్తాను. నా మీద భక్తి లేని వారు మేరుపర్వతమంత పదార్థం ఇచ్చినా సంతృప్తిచెందను అన్నాడు కృష్ణుడు.

మిత్రుడు కొన్ని అటుకులు తెచ్చాడని, ఇవ్వడానికి సంకోచిస్తున్నాడని కృష్ణుడు గ్రహించాడు. అంతే కాదు అతడు వచ్చిన కారణం కూడా తెలుసు స్వామికి. సిగ్గుతో తలవంచుకున్న కుచేలుని ఉత్తరీయపుకొంగులో కట్టబడివున్న అటుకులను చూసాడు. మిత్రమా! నీవు ప్రేమతో తీసుకుని వచ్చిన ఈ కానుక నాకు మిక్కిలి ప్రీతికరమైంది. నీవు సమర్పించిన అటుకులతో నేనే కాదు ఈ విశాలమైన విశ్వంలోని సకలప్రాణులునూ తృప్తిచెందుతాయి– అని ఒక పిడికెడు అటుకులను ఆరగించాడు.

మళ్ళీ ఇంకొక పిడికెడు తినబోతుండగా రుక్మిణీదేవి భగవానుని చేతిని వెంటనే పట్టుకుంది. జగన్నాథా! ఇక చాలు. నీకు ఇష్టుడైన భక్తునికి ఇటు ఐహికసుఖాలనూ అటు ఆముష్మిక లాభములనూ కలిగించడానికి నీవు ఆరగించిన ఆ పిడికెడు అటుకులు సరిపోతాయి. ప్రసన్నుడవైపో–అందామె.

బాగా ఆలోచిస్తే కుచేలుడు సమర్పించిన ముక్కిపోయిన అటుకులు పావలా విలువ చేయవు. అయితే అందులో భక్తి పండిన ప్రేమ ఇమిడి వుంది.

తర్వాత కుచేలుడు తన వూరికి తిరుగు ప్రయాణం సాగించాడు. దారి పొడవునా కృష్ణభగవానుని ఆదరాభిమానాలను స్మరించుకున్నాడు. నిర్ధనుడైన నాకు అమితమైన అష్టైశ్వర్యాలను ప్రేమతోడ అనుగ్రహించినట్లయితే – అహంకారంతో ధనోన్మత్తుడనై పోతాననీ ఆ స్వామి తలచాడు కాబోలు. ఏది ఏమైనప్పటికీ కృష్ణభగవానుని అనుగ్రహం తప్పక తనకు వుంటే చాలునని అనుకున్నాడు.

ఊరు చేరుకున్నాడు. అది తన ఇల్లేనా? చూడగా ఇంటి రూపురేఖలు సంపూర్తిగా మారిపోయాయి. ఎంతో పెద్ద భవనము. పరిచారికలు దాసదాసీజనం మధ్యంలో భార్యని కష్టపడి గుర్తుపట్టాడు. అంతటి సిరిసంపదలు లభించినప్పటికీకూడా–

**తత్ ధ్యానవేగోద్గ్రథితాత్మ బంధనః ।**
**తద్ధామ లేభే అచిరతః సతాం గతిమ్ ॥**

సదా భగవత్ ధ్యాన యోగ ప్రభావంతో సాంసారిక బంధనాలనుంచి విముక్తుడై పరమపదాన్ని అచిరకాలం లోనే కుచేలుడు చేరుకున్నాడు.

కృష్ణ భగవానుని సంకల్పానుసారంగా యదువంశ వీరులు తదితరులందరు ప్రభాస తీర్థానికి చేరినారు. అక్కడ అనేకానేక

మంగళకరమైన కార్యాలను నిర్వహించారు.

తర్వాత విధి ప్రేరణతో వారిలో బుద్ధి భ్రష్ఠు పట్టిపోగా మైరేయం అనేది (చెరకురసంతో తయారైన) మద్యాన్ని మితిమీరి తాగినారు. వారిలో దాశార్హ వృష్ణి భోజ సాత్వతాదులు వున్నారు.

వృష్ణివంశపు సాత్యకి– భోజవంశపు కృతవర్మను ఆక్షేపించాడు.నిద్రస్తున్న ఉపపాండవులను చంపిన నీచుడు వీడు అన్నాడు. సమాధిలో వున్న భూరిశ్రవుని తలను నరికిన నీవు నాకు నీతులు చెబుతావా అన్నాడు కృతవర్మ. దానితో వారందరిలో గొడవ పెద్దదిగా అయ్యింది. రెండు వర్గాలుగా విడిపోయారు. పౌరుషంతో పరస్పరం ఆయుధాలతో కొట్టుకున్నారు. కాలవశ ప్రభావంతో ఆయుధాలన్నీ ముక్కలయ్యాయి.

మహర్షుల శాపంతో పుట్టిన ముసలాన్ని చూర్ణం చేసి సముద్రంలో కలిపారు.అది సాగర తీరంలోనే ఎక్కువగా రెల్లుగడ్డిగా మొలిచింది. ఆ గడ్డిపోచలతో కొట్టుకుని చచ్చారు అందరునూ. ఋషుల, గాంధారి ఇద్దరి శాపాలతో యాదవాదులు అందరూ చనిపోయారు. ఇకపోతే బలరాముడు సముద్రతీరంలో ధ్యాననిమగ్నుడైపోయి తన శరీరంలోని ఆత్మను శ్రీమన్నారాయణునిలో నిలిపాడు.

**రామనిర్వాణమాలోక్య భగవాన్ దేవకీసుతః ।**
**నిషసాద ధరోపస్థే తూష్ణీమ్ ఆసాద్య పిప్పలమ్ ॥**

దేవకీ సుతుడైన కృష్ణభగవానుడు బలరాముడు పరమపదం చేరడాన్ని చూసాడు. తర్వాత ఒక రావి చెట్టు కిందకు చేరుకుని నేల మీద మౌనంగా కూర్చున్నాడు.

కృష్ణ భగవానుని చిరునవ్వులతో విలసిల్లుతుండే ముఖ సౌందర్యం నిరుపమానం. ఫాలభాగాన ముంగురులు అలరారుతున్నాయి.మకరకుండలాల కాంతులు చెక్కిళ్లపై ప్రసరిస్తున్నాయి. కటిసూత్రం యజ్ఞోపవీతం కంకణాలు కిరీటం భుజకీర్తులు తేజోవంతంగా వున్నాయి. తన కుడి తొడ మీద ఎడమ పాదాన్ని చేర్చి ఆసీనుడైవున్నాడు స్వామి.

"జర"అనే పేరు కలిగిన ఒక బోయవాడు ముసలం పొడిలో నుంచి వచ్చిన ఒక ఇనుప ముక్కను తీసుకుని తన బాణపు మొనకు పెట్టుకున్నాడు. అక్కడ కృష్ణభగవానుని పాదపు బొటనవేలు లేడి ముఖంలాగా కనపడింది. వెంటనే బాణాన్ని తీసి వేగంగా వేసాడు. వెళ్ళాడు. చూసాడు. చతుర్భుజుడైన సర్వాలంకార భూషితుడైన కృష్ణ భగవానుని దర్శించాడు. గడగడ వణికిపోయాడు. స్వామి పాదాలమీద పడ్డాడు. నేను చేయరాని పాపపు పని చేసాను. నన్ను క్షమించవా అని బోరున ఏడ్చాడు.

వ్యాధుడా! నాయనా! ఏడవకు.నీవు ఈ నా పాదాన్ని కొట్టడం అనేది నా సంకల్పమే. అనుగ్రహిస్తున్నాను. స్వర్గానికి పోతావు అంటున్నాడో లేదో ఒక దివ్య విమానం వచ్చింది. వాడిని తీసుకుని వెళ్ళిపోయింది.

అడవిలో ఒక చెట్టు కిందకు చేరినాడు బలరాముడు. కృష్ణస్వామి తనవైపు రావడాన్ని చూసినాడు. బలరాముడు తన కనుల్ని నెమ్మదిగా మూసుకున్నాడు. యోగసమాధిలోకి వెళ్లాడు. కాసేపటికి మహాసర్పరూపాన్ని దాల్చి– ఆదిశేషుడై శ్రీమహావిష్ణువుని చేరాడు.

పూర్వం దుర్వాస మహర్షికి వంటినిండా పాయసం పూసి– పాదానికి పూయలేదు కృష్ణపరమాత్మ. పాదంలో ప్రమాదము సంభవిస్తుందని చెప్పాడు మహర్షి. అది ఇపుడు కృష్ణ భగవానునికి గుర్తుకు వచ్చింది. తరువాత అడవిలో ఒక చెట్టు కిందకు చేరుకున్నాడు కృష్ణదేవుడు. కాలు మీద కాలు వేసుకుని పవళించాడు. అక్కడికి దగ్గరిలోని బోయవాడు చూసాడు. కృష్ణ భగవానుని దివ్య పాదాన్ని – నిక్కి నిక్కి చూస్తున్న లేడియని అనుకున్నాడు. వెంటనే బోయవానిలో– "జర" అనే రాక్షసి చేరింది. ఒక బాణాన్ని వేసాడు. కృష్ణభగవానుని అరికాలుని ఛేదించింది. వచ్చి చూస్తే కృష్ణపరమాత్మ.

రథ సారథి దారకుడు కృష్ణ భగవానుని వెదుక్కుంటూనే చివరికి ఎలాగోలాగ స్వామిని చేరుకున్నాడు. శంఖ చక్రాది దివ్యాయుధాలు ఆ పురుషోత్తముని సేవిస్తున్నాయి. దారకుని రథం గరుడ చిహ్న పతాకం ఇక గుర్రాలు ఆకాశానికి ఎగిరిపోయాయి. శంఖచక్రాదులు కూడా వాటిని అనుసరించాయి. అది చూసిన దారకుడు ఆశ్చర్యపోయాడు.

దారకా! నేను లేని ఆ ద్వారకానగరం ఇంక ఏడు రోజుల్లో సముద్రంలో వేగంగా మునిగిపోతుంది. సమస్త బంధు జనం అర్జునుని రక్షణలో ఇంద్రప్రస్థపురానికి వెళ్ళండని దారకుణ్ణి పంపించేసాడు కృష్ణ దేవుడు.

తదనంతరం అక్కడికి వరుసగా బ్రహ్మదేవుడు పార్వతీపరమేశ్వరులు ఇంద్రాది దిక్పాలురును ప్రజాపతులూ మహర్షి బృందం ఇంకా పితృదేవతలు సిద్ధసాధ్య విద్యాధర గంధర్వాదులునూ మరి కృష్ణ భగవానుని దర్శించడానికి విచ్చేసారు. తరువాత స్వామి కనులు మూసుకున్నాడు. అవతార స్వరూపాన్ని మహావిష్ణుతత్వంలో నిలిపాడు. వెంటనే వైకుంఠ ధామానికి చేరాడు. భూలోకంలోని సత్యధర్మాలు, ధైర్యం, కీర్తి ఆ పరమాత్మను అనుసరించాయి.

కృష్ణ భగవానుని అవతార విశేషాలను– లీలావైభవాలను– కృష్ణ తత్వాన్ని శ్రద్ధాభక్తులతో కీర్తించినవారు సమస్తమైన పాపాలనుంచి విముక్తులవుతారు.

త్వదీయం వస్తు గోవింద– తుభ్యమేవ సమర్పయే– నీ వస్తువు నీకే అంకితం గోవిందా! స్వామీ! నీ పాదపద్మములపై అనన్యమైన భక్తిని కలిగివుండేలా అనుగ్రహించు.

**ఇంతటితో కృష్ణ తత్వం సమాప్తం**

**సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు**

# కృష్ణం వందే జగద్గురుమ్

**– డా॥ దేవులపల్లి పద్మజ**



**అష్టమి నాడు అవతరించె అష్టమ గర్భుడు అదిగో నల్లదిగో**
**దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేయవచ్చె నదిగో నల్లదిగో**
**చేష్టలుడిగి ఉపవిష్టులైరి అందరు నదిగో నల్లదిగో**
**సాష్టాంగ పడిన వెతలెల్ల తీర్చు కృష్ణస్వామి నదిగో నల్లదిగో !!**

గోవింద నామముతో ఖ్యాతికెక్కిన కృష్ణుడే పరమేశ్వరుడు. అతను సచ్చిదానంద విగ్రహుడు. అతడు జగత్తుకే మూలాధారమైనవాడు. ఆయనకు ఆదియును, అంతమనునదియే లేదు. సమస్త కారణములకు మూలకారణమైనవాడు అతడే.

**హరేరామ హరేరామ రామ రామ హరేహరే**
**హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే**

ఇది దివ్యనాద ప్రకంపనము. ఇది మన మనస్సనే అద్దము మీద పడిన కల్మషమును తుడిచివేయును. దీని ద్వారా మన వాస్తవ రూపమును స్పష్టముగా చూసే అవకాశము కలుగుతుంది. ఈ హరేకృష్ణ సంకీర్తనముచే మన బుద్ధి శుద్ధము కాగా, మన భౌతిక అశాంతులు మాయమై పోవును. తనయందు భక్తిగల వాని యెడ కృష్ణుడు వాత్సల్యము గలిగి రక్షకుడుగా వుంటాడు. కృష్ణ పాదపద్మములను ఆశ్రయించిన తరువాత కర్మ పంజరములు పటాపంచలగును.

భగవంతుని సర్వ అవతారములలో శ్రీకృష్ణ అవతారమే సంపూర్ణావతారము. సర్వ కళా సమన్వితము, సకల జన ఆలంబనము, సకల శాస్త్ర పారంగతము, సకల విద్యా కౌశలము, సకల ప్రేమ సుధాభరితము. నిత్యము చింతలతో, భరింపలేని ఒంటరితనముతో నిస్తేజమై ఉండే మధుర కారాగారము దేవకీ వసుదేవుల అష్టమ గర్భాన దేవదేవుడు జనియించటంతో నిలువెల్లా, తనువెల్లా పులకించి పోయింది. బ్రహ్మాండము వింత కాంతుల విరాజిల్లింది. కష్ట నష్టాలకు కాలం చెల్లిందని, శిష్ట జనులు సంతోష పరిపుష్టమై ఇష్ట కామ్య సిద్ధి పొందు తరుణము ఆసన్నమైనదన్న శుభ సంకేతాలు లోకమంతటా ప్రసరించిన దివ్య, భవ్య, శుభ తిథి శ్రావణ మాసములోని కృష్ణ పక్షములో రోహిణీ నక్షత్రయుక్త అష్టమి తిథి. జననంతోనే మహిమా సమన్విత సంపన్నమై జీవితాలకు క్రొత్త అర్థాలు అందించినది శ్రీకృష్ణావతారము. పరివేష్టిత జనులు, పశుపక్ష్యాదులు, ప్రకృతి మాయలో మునిగి ఏదో తెలియని లోకాలలో విహరించేలా చేసినది శ్రీకృష్ణ జన్మాష్టమి. శరణుఘోష నిడు శరణాగతులకు పాపహరణ కర్పూరమై, వేదన వేడికోలు విధివంచితులకు తాపహరణ నీహారమై, మందమతులకు శోకహరణ దయాసారమై, నిఖిల జీవకోటులకు భయహరమై నిలిచింది లీలామానుష వేషధారి శ్రీకృష్ణ పాదకమలము. శ్రీకృష్ణుని సమ్మోహనా తత్త్వము మృదుత్వమై, శుచిత్వమై పురాకృత దుష్కృతముల నుంచి నిష్కృతి కలిగించి, సుకృత ప్రకృతులు జాగృతము చేయును.

**శరణు ఘోష శరణాగతుల పాపహరణ కర్పూరమా**
**వేదన వేడికోలు విధివంచితులు తాపహరణ నీహారమా**
**కొల్వనేరని మందమతుల శోకహరణ దయాసారమా**
**నిఖిల లోకాల జీవకోటుల భయహరణ శ్రీకృష్ణ చరణమా !!**

పరుల సొమ్ములను అపహరించే దొంగగా ముద్రవేయించుకున్న ముకుందుడు, తామరాకుపై నీటి బిందువు తెలిసిగాని, తెలియక గాని అగ్నిని తాకిన కాల్చక మానదు. అదేవిధంగా తెలిసిగాని, తెలియకగాని, ద్వేషంతోగాని, ప్రేమతోగాని చేసే శ్రీకృష్ణ స్మరణ నిస్వార్థమైన ప్రేమామృతాన్ని పంచి ఇస్తుంది. ఎదుటివారు శత్రువువైనా, మిత్రులైనా సమ భావనమే. ఇంకా చెప్పాలంటే తనను ద్వేషించినవారిపైనే అనురాగం ఎక్కువ. అంధుడైన ధృతరాష్ట్రునికి అపురూపమైన

విశ్వరూప సందర్శన భాగ్యాన్ని ఇచ్చాడు. యుగయుగాలుగా, నియమ నిష్ఠలతో తపస్సు చేసినవారికి కూడా అది లభ్యం కాలేదు. కాళీయుని శిరస్సుపై తన పాద ముద్రలు అలంకరించి, శాశ్వతంగా సర్ప భయంకరుడైన గరుత్మంతుని భయం లేకుండా చేశాడు. నూరు దూషణలు చేసిన శిశుపాలుని తనలో ఐక్యం చేసుకున్నాడు. ఇనుమును బంగారంగా మార్చే పరుసవేదికి స్వార్థ భావనలుండవు.వోలె భవబంధాలకు, రాగద్వేషాలకు అతీతమై లోక కళ్యాణానికై తమ సంపదలను వినియోగించాలన్న సందేశాన్ని మనకు అందించాడు. ధనధాన్యాలు, మణి మాణిక్యాలు, రత్నపు రాశులు కొరగానివని, చిన్న తులసి దళంతోనే శ్రీకృష్ణుని సొంతం చేసుకోవచ్చునని మనకు భాగవతం తెలియచేస్తోంది. నిష్కామ కర్మాచరణం, నిష్కల్మష ఆత్మనివేదనం శ్రీకృష్ణ సంతృప్తి కారకాలు. అణు రేణు పరమాణు వ్యాపకమైన లీలామానుష వేషధారి శ్రీకృష్ణ లీలావైభవం అనన్య సామాన్యం. కుచేలుని వృత్తాంతము, కుబ్జ చందన పూతల పులకరింత, పేద పూలవాని మాలాధారణము, విదురుని ఆతిథ్య స్వీకరణ మొదలైన ఘట్టాలు మన అంతరంగాలలో కలకాలం గూడు కట్టుకుని వుంటాయి. నిస్వార్థ జీవనాన్ని, ప్రేమ తత్వాన్ని ప్రేరేపిస్తూంటాయి. గోపాలురతో సహజీవనం సమ సమానత్వానికి చిహ్నం.

శ్రీకృష్ణుడు ప్రకృతి ప్రేమికుడు. పరమాత్మ ప్రకృతిలోనే అంతర్లీనంగా ఉంటాడన్న సందేశము మనకు ఆయన జీవిత వైభవం తెలియచేస్తుంది. ఆయన అలంకార ప్రియుడు. రకరకాల పూవులతో, సుగంధ చందనాలతో అలరారుతూ ఉంటాడు. ఇవన్నీ మనకు ప్రకృతి నుండే లభిస్తాయి. అంటే శ్రీకృష్ణుని అర్చన మిషతో మనం ప్రకృతిని ప్రేమించవలసినదే. మనం జీవించాలంటే పశు పక్ష్యాదులు ఉండి తీరవలసినదే. వాటి ఫల సంపద మన జీవన హేతుకాలు. పశు పక్ష్యాదులు జీవించాలంటే ప్రకృతి నుండి లభించే ఆకులు, అలములు, గడ్డి, స్వచ్ఛమైన జలము, కాలుష్య రహిత వాతావరణము అవసరము. ఇదే సందేశాన్ని మనకు గోవర్ధనోద్ధరణము, ఉట్ల సంబరాలు, యుద్ధ సమయంలో అర్జునునికి అస్త్ర ప్రయోగ జాగ్రత్తలు తెలిపే వైనం మొదలైనవి తెలియచేస్తాయి.

అల్లరి చేష్టలతో, దుందుడుకు స్వభావముతో ఉండే శ్రీకృష్ణుడు అరువది నాలుగు కళల పరిపూర్ణుడు. అనతి కాల విద్యాభ్యాసము, సృష్టిని శాసించే అపూర్వ గురు దక్షిణ, శత్రు దుర్భేద్యమైన ద్వారక నిర్మాణము, కాలయవన సంహారము, అగోచరంగా ద్రౌపదీ మాన రక్షణము, రాయబార రాజనీతి కౌశలము, వేద శాస్త్ర జ్ఞాన భరిత గీతా బోధనము, అర్జునుని రథసారథిగా యుద్ధ నైపుణ్యము మొదలైన ఘట్టాలు శ్రీకృష్ణుని పరిపూర్ణ తత్త్వాన్ని మనకు తెలియచేస్తాయి.



సాగరంలో కలిసే ఉప్పు కణానికి ఎట్లా ఉనికి ఉండదో, అట్లాగే మనం కూడా శ్రీకృష్ణ ప్రేమ సాగరంలో కలసి కలకాలం ఆయన హృదయంలో నిలచిపోవాలి. శ్రీకృష్ణుడు లోకానికి అందించిన సమతత్వము, పరోపకార తత్త్వము, సహజీవనము మొదలైనవి మనం అలవరచుకుంటే మన జీవనం నందన వనం అవుతుంది. ఈ శ్రీకృష్ణ జన్మాష్టమి అందరం భక్తి శ్రద్ధలతో ఆచరించి ఆ పరమాత్మ కరుణకు పాత్రులవుదాం. ఆయన కరుణ ఉన్నంత వరకు మనలను ఏవిధమైన చింతలు దరిజేరవు.

శ్రీకృష్ణ పరమాత్ముడు సజీవ చైతన్యమూర్తి, నవచేతన విలసిత దివ్యమూర్తి.శ్రీకృష్ణుని లీలలు అగణితములై, భావసంజనితములై, శాశ్వత ముక్తి సోపానములై, జీవుని శివునితో కలిపే అనుష్ఠానములై, నిర్గుణ నిరాపేక్ష పరంధాముని ఆత్మ దర్శన విభూతులై విలసిల్లును. వేదాలకు వేదమైనవాడు, విధికి కూడా విధియైనవాడు, పరబ్రహ్మ స్వరూపుడు ఆ శ్రీకృష్ణ పరమాత్ముడు. కృష్ణ నామ స్మరణ చేస్తే సకల కష్టాలు తొలగిపోతాయి.

**గలగల నవ్వుల చిన్మయ రూపం గజి బిజి చేష్టల చాతుర్యం**
**సరిసరి నటనల నైపుణ్యం తికమక పలుకుల పాండిత్యం**
**గజిబిజి చింతల తరణోపాయం తహతహ మనసుల కైవల్యధామం**
**శ్రీకృష్ణ కరుణా కిరణం !! నిఖిల లోక మణిహారం !!**
**మురళి ఆటపాటలుండ భోగయోగ చింతలేల**
**కృష్ణ నామ మంత్రముండ యజ్ఞయాగ క్రతువులేల**
**అభయముద్ర అండనుండ గీతసార సాధనేల**
**కృష్ణ పాద ముద్రలుండ భీతినొందనేల!!**
**సర్వం శ్రీకృష్ణార్పణమస్తు !!**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ

ధారావాహికం



గత సంచిక తరువాయి

## తిరుమల నంబి

తిరుమల క్షేత్రంలో జన్మించి, సాక్షాత్తు శ్రీమద్రామానుజులంతటి వారిని శిష్యునిగా పొంది, తన జీవితకాలమంతా శ్రీవారి సేవకే అర్పించారు తిరుమలనంబి. ఆ ధన్యజీవి జీవిత విశేషాలను ఇప్పుడు పరికిద్దాం.

## తిరుమలకు ఆగమనం

పదవ శతాబ్దంలో, మూడు వైష్ణవ దివ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీరంగంలో యామునాచార్యులు అనే వైష్ణవ భక్తుడు శ్రీరంగనాథస్వామికి కైంకర్యసేవలు కొనసాగిస్తూ, తన శిష్యులకు శ్రీవైష్ణవ మతబోధ కావించేవాడు. ఒకనాడాయన శిష్యులతో సంభాషిస్తూ, శ్రీవేంకటాచల క్షేత్రంలో శ్రీనివాసునికి అభిషేక, తీర్థ, పుష్ప కైంకర్యాది సపర్యలు చేయటం భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్యంగా నమ్మాళ్వార్ (పన్నెండుమంది వైష్ణవ ఆళ్వార్లలో ఐదవ మరియు అత్యంత ప్రతిభాశాలి యైన ఆళ్వార్) పేర్కొన్నట్లు చెబుతాడు. అయితే వ్యక్తిగత కారణాల వల్ల అతి కొద్ది కాలం మాత్రమే తానా కైంకర్యాలు చేయగలిగాననీ, తన శిష్యుల్లో ఎవరైనా వేంకటాచలం మీదే ఉండి, ఎముకలు కొరికే చలి, క్రిములు, క్రూరజంతువుల బాధలు తట్టుకుంటూ, శాశ్వతంగా అక్కడే ఉండి శ్రీవారికి సేవా కైంకర్యాదులు నిర్వహిస్తే, వారి కృపకు పాత్రులవుతారని మరియు గురుతుల్యుడైన నమ్మాళ్వారు ఆదేశం శిరసా వహించినట్లవుతుందని సెలవిస్తాడు. ఆ రోజుల్లో తిరుమల నిర్జనారణ్యంగా, ప్రమాదభరితంగా ఉండటం వల్ల మిగిలిన శిష్యులెవరూ అక్కడ నివాసమేర్పరచుకోవడానికి సాహసించలేదు.

యామునాచార్యుని ప్రియ శిష్యుడు, మనుమడు అయిన శ్రీశైలపూర్ణుడు మాత్రం గురువుగారి ఆదేశానుసారం తిరుమలలో స్థిరనివాసమేర్పరచుకుని, శ్రీవారికి నిత్యసేవలందించే లక్ష్యంతో, గురువుగారి ఆశీర్వాదంతో వేంకటాచల క్షేత్రానికి చేరుకుంటాడు. తిరుమలలో నివాసం ఏర్పరచుకోవటం వల్ల ఆయన తిరుమలనంబిగా ప్రసిద్ధికెక్కాడు.

## పాపనాశన తీర్థం

ఆయన అనునిత్యం స్వామివారి మూలవిరాట్టుకు, ఉత్సవ మూర్తులకు సేవా కైంకర్యం చేసేవాడు. అంతేకాక, ప్రతిరోజూ శ్రీవారి ఆలయానికి ఆరు మైళ్ళ దూరంలో ఉన్న పాపవినాశనానికి



వెళ్ళి, పవిత్ర తీర్థ జలాన్ని శిరస్సు పైనున్న ఒక మట్టికుండలో నింపుకు ని, భగవన్నామ సంకీర్తన చేస్తూ, ఆ జలాన్ని తెచ్చి అర్చకులకు పూజాదికాల నిమిత్తం సకాలంలో అందించేవాడు.


## బోయవాని రూపంలో శ్రీవారు

పెక్కు సంవత్సరాల పాటు, అత్యంత నిష్ఠతో, భక్తి శ్రద్ధలతో అందిస్తున్న ఈ సేవకు శ్రీవారు తిరుమలనంబి యెడ సంతుష్టులవుతారు. ఒకరోజు యథాప్రకారం అభిషేకజలం నెత్తిన పెట్టుకుని, వేళ మించకుండా ఆలయానికి చేరుకోవాలనే ఆత్రుతతో నడుస్తున్న శ్రీశైలపూర్ణుని, విల్లంబులు ధరించి, యువకుడైన బోయవాని రూపంలో స్వామివారు వెంబడిస్తారు. తనను తాతా, తాతా అని పిలుస్తూ వెంట వస్తున్న ఆ అందమైన బోయ యువకుణ్ణి అరణ్యమధ్యంలో చూసిన శ్రీశైలపూర్ణుడు ఆశ్చర్యచకితుడవుతాడు.

తాను చాలా దప్పికతో ఉన్నాననీ, ఆ కుండలోని నీళ్ళతో తన దాహం తీర్చమని ఆ బోయవాడు తిరుమలనంబిని వేడుకొంటాడు. అయితే శ్రీవారి సేవకు వినియోగ మవ్వాల్సిన పవిత్ర జలాన్ని ససేమిరా ఇవ్వనంటాడు తిరుమలనంబి. ఇప్పటికే ఆలస్యమైనందున, తన దారికి అడ్డు రాక దూరంగా వెళ్ళమని, ఆ బోయవాణ్ణి కసురుకుంటాడు.

తనను కాదని వేగంగా నడక సాగించిన తిరుమల నంబిని అనుసరిస్తున్న ఆ బోయవాడు తన బాణ ప్రయోగంతో కుండకు రంధ్రం చేసి, ధారగా వస్తున్న నీటితో దాహం తీర్చుకుంటాడు. కొంతసేపటికి కుండ తేలిక పడడంతో వెనుదిరిగిన తిరుమలనంబి కోపోద్రిక్తుడై బోయవానితో పరుషంగా మాటలాడి, సమయానికి అభిషేకజలం సమకూర్చలేని తన అశక్తతను మన్నించమంటూ శ్రీవారిని క్షమాభిక్ష అర్థిస్తాడు.

## ఆకాశగంగ ఆవిర్భావం



అంత ఆ బోయవాడు “తాతా! నువ్వెంతమాత్రం విచారించకు. నా వెంట వస్తే దగ్గరలోనే ఉన్న మరో పవిత్ర తీర్థాన్ని చూపిస్తాను” అంటూ తిరుమలనంబిని పక్కనే ఉన్న ఓ లోయలోనికి తీసుకువెళతాడు. ఆ బోయవాడు తన పదునైన బాణంతో ఒక కొండరాతిని ఛేదించగా, స్వచ్ఛమైన పేయజలం పెల్లుబికింది. ఇకనుండి ఈ జలాన్నే నా అభిషేకానికి ఉపయోగించమని సెలవిచ్చి బోయవాని రూపంలో ఉన్న స్వామి అంతర్థానమవుతారు. అదే తరువాతి కాలంలో తిరుమలలోని సుప్రసిద్ధ తీర్థాలలో ఒకటైన ఆకాశగంగగా వినుతికెక్కింది.

కొంతసేపటికి సంభ్రమాశ్చర్యానందాల నుండి తేరుకున్న తిరుమలనంబి అసలు విషయం గ్రహించి, వడివడిగా ఆలయాన్ని చేరుకుంటాడు. అదే సమయంలో శ్రీవారు తన అర్చకుల నుద్దేశించి ఇకనుండి శాశ్వతంగా తిరుమలనంబి తెచ్చే ఆకాశగంగ తీర్థాన్నే తన అభిషేక జలంగా ఉపయోగించాలని ఆదేశిస్తాడు.

ముదిమి మీరుతున్న తిరుమల నంబి అత్యంత ప్రయాసతో ప్రతిరోజూ ఆరు మైళ్ళ దూరం నుంచి పాపనాశన తీర్థం నుండి జలాన్ని తేవడం గమనించి దయార్ద్రుడైన శ్రీనివాసుడు, అతని నిత్యకృత్యాన్ని సులభతరం చేయడమే కాకుండా, అతని అనన్యభక్తిని లోకానికీ రీతిగా చాటిచెప్పాడు.

## శ్రీపాదములు

తిరుమల నంబి శ్రీవారి మహాభక్తుడే కాకుండా, విద్వాంసుడు, వేద వేదాంగ పారంగతుడు కూడా. భగవద్రామానుజులు తిరుపతిలో ఉన్న సంవత్సర కాలంలో తిరుమలనంబి వద్ద శ్రీమద్రామాయణం లోని రహస్యాలను ఆకళింపు చేసుకున్నారు. తిరుమలనంబి ప్రతిరోజూ ప్రాతః కాలంలో స్వామివారిని సేవించుకుని, కొండదిగి అలిపిరి వద్ద నున్న తలయేరుగుండు సమీపానికి చేరుకునేవారు.

అదే సమయంలో రామానుజుల వారు కూడా తిరుపతిలో ఉన్న గోవిందరాజస్వామిని సేవించుకుని, ఆ ప్రదేశానికి వేంచేసేవారు. తిరుమలనంబి రామాయణ రహస్యాలను, పదహారు సార్లు, పదహారు రకాల భాష్యంతో పునరావృతం కాకుండా, రామానుజుల వారికి అవగతం చేశారు. ప్రతిరోజూ వ్యాఖ్యానం పూర్తయిన తరువాత, తిరుమలనంబి తిరిగి కొండపైకి చేరుకుని, శ్రీవారికి సాయంకాల కైంకర్యం చేసుకునేవారు. అయితే అలిపిరిలో ఉండిపోయిన కారణంగా మధ్యాహ్న సమయంలో శ్రీవారిని దర్శించుకోలేకపోతున్నానని తిరుమలనంబి చింతించేవాడు. వారి మనోగతాన్ని గుర్తెరిగిన శ్రీనివాసుడు తన పాదాలను తలయేరుగుండు వద్ద ప్రతిష్ఠింపచేసి, మధ్యాహ్న సమయంలో కూడా తిరుమలనంబి శ్రీవారి పాదపద్మాలను సేవించుకునే అవకాశాలను కల్పించాడు. ఆ పాదాలను అలిపిరి నడకమార్గంలో, తలయేరుగుండు సమీపాన నేడు కూడా దర్శించుకోవచ్చు.

కొండపై మనం దర్శించుకునే “శ్రీవారి పాదాలు” వేరు.

అయితే, ఈ రామాయణ వ్యాఖ్యానం అలిపిరి నడక దారిలోని మోకాళ్ళ పర్వతం నందున్న, “త్రోవభాష్యకార్ల సన్నిధి”లో జరిగిందని కొందరు అభిప్రాయపడతారు.

శ్రీ రామానుజాచార్యులవారు శ్రీ గోవింద భట్టారకులు సోదరులు. భట్టారకులవారు కొంతకాలం శ్రీకాళహస్తిలో

నివసించి శైవమతాన్ని అవలంబించారు. శ్రీ రామానుజుల వారు తన సోదరుడిని వైష్ణవ మతంలోకి మార్చడానికి విశ్వప్రయత్నం కావించి విఫలమయ్యాడు. తిరుమలనంబి సహాయంతో 40 రోజులు వాదించి, తన సోదరుడిని వైష్ణవ మతంలోకి మార్చగలిగాడు.

## తోళప్పాచార్యుల కైంకర్యం

ఇప్పటికీ తిరుమలనంబి వంశీయులు ప్రతి శుక్రవారం ఉదయం ఒంటిగంటకు (అంటే తెల్లవారితే శుక్రవారం) రక్షసిబ్బంది వెంటరాగా, దివిటీల వెలుగులో, కాలినడకన అడవి బాటలో మూడు మైళ్ళు ప్రయాణించి మూడు బిందెలతో ఆకాశగంగ తీర్థం నుంచి అభిషేక జలాలను తెచ్చి, మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేస్తారు. దారిమధ్యలో ఉన్న బాటగంగమ్మకు మ్రొక్కి ఆ దేవత ఆశీర్వచనం తీసుకుంటారు. ఆకాశగంగ తీర్థాన్ని, ఆ తీర్థానికి వెళ్ళే అరణ్యమార్గంలో బాటగంగమ్మ ఆలయాన్ని ఈనాడు కూడా చూసి తరించుకోవచ్చు.

## తిరుమలనంబి ఆలయం

శ్రీవారి ఆలయానికి దక్షిణ మాడ వీధిలోని మహాప్రదక్షిణ మార్గంలో, సంపంగి వృక్షాల నీడలో, తిరుమలనంబి ఆలయాన్ని మనం చూడవచ్చు. అందులో తిరుమలనంబి మూలమూర్తి ఉత్సవమూర్తులతో బాటుగా, రామానుజాచార్యుల వారిని కూడా దర్శించుకోవచ్చు. మలయప్పస్వామి మాడవీధుల్లో ఊరేగుతున్నప్పుడు ఈ ఆలయం ఎదురుగా నీరాజనం అందుకుంటారు. ఈ ఆలయంలో తిరుమలనంబి వంశీయులే ఇప్పటికీ అర్చకత్వం వహిస్తుంటారు.

వేంకటేశుడు తిరుమలనంబిని తాతా అని పిలవడం వల్ల ఆ వంశస్థులందరూ ''తాతాచార్యులు''గా పిలువబడుతున్నారు. అంతేకాకుండా శ్రీవారు తిరుమలనంబిని ''తోళన్''గా సంబోధించడం వల్ల ఈ వంశం వారిని ''తోళప్పాచార్యులు''గా కూడా పేర్కొంటారు. తమిళంలో ''తోళన్'' అంటే స్నేహితుడని అర్థం. ప్రస్తుతం తిరుమలలో కైంకర్యం నిర్వహిస్తున్న తిరుమలనంబి వంశీయులను ''తోళప్పాచార్యులు'' గానూ, కాంచీపురంలోని తిరుమలనంబి వారసులను ''తాతాచార్యులు''గానూ వ్యవహరిస్తారు.

వైకుంఠ ఏకాదశికి పదకొండు రోజుల ముందుగా ప్రారంభమై, ఇరవైయ్యైదు రోజుల పాటు సాగే అధ్యయనోత్సవాల్లో చివరి రోజున తిరుమలనంబిని బోయవాడు తాతా అంటూ ఆప్యాయంగా పిలిచి, నీళ్ళు త్రాగిన రోజుకు గుర్తుగా తన్నీరుముదు అనే ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

అన్నమయ్య ఈ భక్తుణ్ణి కూడా,

**...మచ్చిక దొలుత తిరుమలనంబి తోడుత నిచ్చనిచ్చ మాటలాడి నచ్చినవాడు ॥**

అంటూ తన పదబంధనంతో అమరుణ్ణి చేశాడు.

తరాలు మారినా, యుగాలు మారినా వేంకటేశుడు తన భక్తుల కష్టనష్టాలను అనుక్షణం గమనిస్తూ, అడగకనే కడగండ్లు తీరుస్తూ ఆపద్బాంధవుడిగా అలరారుతున్నాడనడానికి తిరుమలనంబి వృత్తాంతమే నిలువెత్తు నిదర్శనం.

## శ్రీవారి వారోత్సవాలు

**“ఎన్ని జన్మల పుణ్యమో – నీకిన్ని సేవలు చేయగా!**
**ఏడుకొండల దేవరా – ఈ భాగ్యమంతా మాదిరా”**

తిరుమలలోని శ్రీవారి ఆలయం, లెక్కకు మిక్కిలి ఉత్సవాలు, సేవలతో వైకుంఠాన్ని తలపిస్తుంది. ఈ సేవలను ఆచరించేవారు యజ్ఞఫలాన్ని పొందుతారని భక్తుల విశ్వాసం. ఉత్సవ ప్రియుడైన స్వామి సేవలలో ఉన్న పరమార్థాన్ని వేయి నోర్లు, రెండు వేల నాలుకలు కల ఆదిశేషుడు, ఆయన నాభి కమలంలో ఉద్భవించిన బ్రహ్మ, వక్షోవిహారిణి అయిన అమ్మవారు కూడా చెప్పలేక సతమతమయ్యారట. అంతటి మహత్తరమైన సేవలను వర్ణించటానికి మనమెంతటి వారం? అయినా, ఆ స్వామివారి మీద భారం ఆ సేవల సారాంశాన్ని లేశామాత్రంగా తెలుసుకుందాం.

సుప్రభాత సేవ నుంచి ఏకాంతసేవ వరకు ప్రతిరోజూ జరిగే ''నిత్య సేవలను'' మనం ముందే చెప్పుకున్నాం. ఇక వారంలో ఒకరోజు మాత్రం జరిగే ''వారోత్సవాల'' గురించి తెలుసుకుందాం.

శ్రీవారి పాదపద్మాలకు జరిగే అష్టదళ పాదపద్మారాధనతో ''వారోత్సవాలు'' వాటి విశేషాలను తెలుసుకుందాం.

## అష్టదళ పాద పద్మారాధన

ప్రతి మంగళవారం ఉదయం ఆరు గంటలకు, రెండవ అర్చనగా నూట ఎనిమిది బంగారు కమలాలతో మూలవిరాట్టు పాదపద్మాలకు, సుమారు 20 నిముషాల పాటు జరిగే సేవాకార్యక్రమమే ఈ అష్టదళ పాద పద్మారాధన. ప్రతిరోజూ స్వామివారి పాదాలకు తులసి దళాలతో ఏకాంతంగా అర్చన జరుగుతుంది. కైంకర్యపరులకు తప్ప వేరెవరికీ అది చూసి తరించే భాగ్యం లేదు. కానీ మంగళవారం మాత్రం ''అష్టదళ పాద పద్మారాధన'' ఆర్జితసేవలో పాలు పంచుకొనే భక్తులందరూ ఈ అర్చనను చూసి తరించవచ్చు.

## ముస్లిం భక్తుడు

1984 సంవత్సరంలో తితిదే స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ

సేవ ప్రారంభించబడింది. హైదరాబాద్ / గుంటూరు వాస్తవ్యుడైన ఓ మహమ్మదీయ భక్తుడు ఇందుకు అవసరమైన 108 బంగారు పద్మాలను శ్రీవారికి కానుకగా సమర్పించాడు. స్వామివారు ఒక మతానికో, ప్రాంతానికో పరిమితం కాని అఖిలాండ, బ్రహ్మాండ నాయకుడనటానికి ఇంతకంటే చక్కని నిదర్శనం ఏం ఉంటుంది?

కొంతకాలం ఇది ఆర్జితసేవగా రూపు దిద్దుకుంది. అయితే, అన్ని ఇతర సేవా కైంకర్యాల లాగా ఈ అర్చన యొక్క మూలాలు కూడా ప్రాచీన కాలం నాటి ఆగమ శాస్త్రంలోనే ఉన్నాయి.

ఈ సేవ, ఎప్పుడు – ఎలా ప్రారంభమైంది?

దీని విషయమై ఒక ఆసక్తికరమైన, అద్భుతమైన, ఈమధ్యకాలంలోనే జరిగిన యథార్థ సంఘటన ఉంది. 1982వ సంవత్సరంలో తితిదే బోర్డు సమావేశం జరుగుతున్నప్పుడు, షేక్ మస్తాన్ అనే ముస్లిం భక్తుడు అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారిని కలుసుకునే నిమిత్తం తితిదే కార్యాలయానికి వచ్చారు. సమావేశంలో వ్యస్తుడై ఉండటం వల్ల శ్రీ ప్రసాద్ గారు అయిష్టం గానే ఆ భక్తుణ్ణి కలుసుకున్నారు. ఆ భక్తుని కథనం ఇలా ఉంది –

"అయ్యా! గుంటూరు జిల్లాకు చెందిన మా అన్నదమ్ముల మందరం ఉమ్మడి కుటుంబంలో కలిసి మెలిసి ఉంటూ ఓ చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్నాం. మాది ఓ మధ్యతరగతి కుటుంబం. తరతరాలు మేము శ్రీవారి భక్తులం. మా గృహంలో శ్రీవేంకటేశ్వర సుప్రభాతం, మంగళాశాసనం, శ్రీవేంకటేశ్వరగద్యం – వీటి పఠనం నిత్యం జరుగుతుంది. ప్రతి మంగళవారం నాడు అష్టోత్తర శతనామార్చన కూడా భక్తితో జరుపబడుతుంది. మా తాతగారు తన స్వార్జితంతో 108 స్వర్ణపుష్పాలు చేయించి శ్రీవారికి సమర్పిస్తానని మొక్కుకున్నారు. కానీ కొన్ని పద్మాలు చేయించగానే అస్వస్థతతో కాలం చేశారు. దాంతో ఆ మొక్కు తీర్చుకునే బాధ్యత మా తండ్రిగారు భుజానికెత్తుకుని మరికొన్ని పుష్పాలు చేయించి, వారు కూడా స్వర్గస్తులయ్యారు. ఇప్పుడా బాధ్యత మా మూడోతరం వారిపై పడింది. ఆ బాధ్యతను ఆనందంగా స్వీకరించి, ఆర్థికంగా అంతంత మాత్రమే స్తోమత కల మేమందరం ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి, ప్రతి పైసా కూడబెట్టి, ఎన్నో ఏళ్ళుగా స్వర్ణ కమలాలు తయారు చేయిస్తున్నాము. ఒక్కొక్కటి 23 గ్రాములు గల 108 కమలాలు ఈమధ్యనే పూర్తయ్యాయి. తమరు దయతో వీటిని స్వీకరించి స్వామివారి కైంకర్యంలో ఏదో విధంగా వినియోగిస్తే, మా తండ్రి, తాతగార్ల ఆత్మలు శాంతిస్తాయి. మా కుటుంబ సభ్యులందరికీ ఎనలేని ఆనందం చేకూర్చిన వారవుతారు. ఈ విషయం తమతో ప్రత్యక్షంగా విన్నవించుకోవడానికి, 54 మంది సభ్యులు గల మా పరివారమంతా, కాలినడకన బయలుదేరి కొండకు చేరుకున్నాం".

ఆ మహమ్మదీయ భక్తుడి ఆవేదనను, ఆర్తిని ఆసాంతం విన్న బోర్డు సభ్యులకు నోట మాట రాలేదు. మరో రెండేళ్ళ తరువాత జరగబోయే తితిదే స్వర్ణోత్సవాలు చిరకాలం గుర్తుండిపోయే విధంగా ఏ సేవను ప్రవేశపెట్టాలా అని తర్జన భర్జన పడుతున్న బోర్డు సభ్యులకు ముస్లిం భక్తుని విన్నపం, వెదకబోయిన తీగ శ్రీవారి కృపతో కాలికి తగిలినట్లనిపించింది. అంతే! బోర్డు సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించి, 1984 సంవత్సరంలో జరిగిన స్వర్ణోత్సవాల సందర్భంగా "అష్టదళ పాద పద్మారాధన" అనబడే, ప్రతి మంగళవారం జరిగే, నయనానందకరమైన ఆర్జితసేవను ప్రవేశపెట్టారు. అప్పటినుండి ఈ సేవ నిరాటంకంగా జరుపబడుతోంది.

## పద్మారాధన మహత్యం

పురాణేతిహాసాల్లో ఉటంకించిన దాని ప్రకారం, గర్భాలయంలో మూలవిరాట్టుకు జరిగే ఈ సేవ అత్యంత మహత్తరమైనది. మన మనస్సనే పద్మాన్ని స్వామివారి పాదపద్మాలకు సమర్పిస్తున్నామనే భావం భక్తులను పరవశింపచేస్తుంది. స్వామివారి పాదాలు, హస్తద్వయం, ముఖము, నేత్రాలు, పద్మంలో ఉన్నటువంటి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారు సమస్తం పద్మమయమే. వేంకటేశుని ఆ పద్మతత్వం మనలను ధర్మమార్గం వైపు నడిపిస్తుంది. కాబట్టే ఈ పద్మారాధనకు అంతటి ప్రాముఖ్యం ఉంది.

## ఆరాధనా విధానం

ఉదయం ఆరు గంటలకు వైఖానస అర్చకులు గర్భాలయ మూర్తికి అర్ఘ్య, పాద్య, ఆచమనాదులు నిర్వహించడంతో ఈ సేవ మొదలవుతుంది. తరువాత "శ్రీవేంకటేశాయ నమః" అనే ఉచ్చారణతో ప్రారంభమైన అష్టోత్తర శతనామావళి పఠనంతో పాటుగా, శ్రీవారి పాదాలకు, ఒక్కో నామానికి, ఒక్కో స్వర్ణపద్మ సమర్పణతో అర్చన కొనసాగుతుంది. శ్రీవారి పాదాల ముందుంచిన ఓ ఐదంచెల వర్తులాకార పీఠంపై ఈ పద్మాలను ఒకటొకటిగా ఉంచుతారు. ఈ 108 నామాలలో శ్రీవారి ఘనతనూ, దివ్యచరితనూ, లీలలనూ, పరాక్రమాన్నీ, అవతార విశేషాలను కొనియాడతారు.

## ఐతిహ్యం

పూర్వయుగాల్లో బ్రహ్మదేవుడు సమస్త దేవగణ సమేతుడై, స్వర్గంలో ప్రవహించే మందాకిని అనబడే గంగానదిలో వికసించే బంగారు పద్మాలతో, స్వామివారి పాదాలకు అర్చన చేసినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. బ్రహ్మ స్వయంగా విష్ణువు కుమారుడు. అంటే ఇది కొడుకు తండ్రికి

చేసేటటువంటి పాదపూజ. నాడు బ్రహ్మదేవుడు శ్రీకారం చుట్టిన ఈ సేవ నేటికీ తిరుమలలో అంగరంగ వైభవంగా జరుగుతోంది. ప్రాతః సంధ్యలో, తల్లితండ్రుల పాదసేవనంతో దినచర్య ప్రారంభించాలని సాక్షాత్తూ బ్రహ్మదేవుడే స్వయంగా ఆచరణలో చూపించి, యుగ యుగాలలో తన సంతతి కంతటికీ మార్గదర్శకుడయ్యాడు.

ఈ సేవలో పాల్గొన్న భక్తులందరికీ, శ్రీవారి కటాక్షంతో, అష్టైశ్వర్యాలు చేకూరడంతో పాటు వంశాభివృద్ధి కలుగుతుంది.

## సహస్ర కలశాభిషేకం

సప్తగిరి సార్వభౌముని సహస్ర కలశాభిషేకం!
బుధవార మహోత్సవం – భువన – భూమి వైభవం!

ప్రతి బుధవారం ఉదయం 6 గంటలకు బంగారు వాకిలి ముందు ఘంటా మండపంలో జరిగే ప్రధానసేవే కలశాభిషేకం. 1511వ సంవత్సరానికి పూర్వం నుంచే ఈ సేవ జరుగుతూ ఉన్నట్లు చారిత్రకాధారాలున్నాయి.

సాధారణంగా భోగశ్రీనివాసుని అర్చారూపం మూలవిరాట్టు పాదాల వద్ద, కొద్దిగా ఈశాన్యం వైపు తిరిగి ఉంటుంది. ఆ స్థానాన్ని 'జీవస్థానం' అంటారు (తాత ముత్తాతల నుండి ఉంటున్న స్థానమే జీవస్థానం). ఆ స్థానంలోని భోగశ్రీనివాసుణ్ణి గర్భాలయం నుంచి బయటకు తెచ్చి ఓ చూడచక్కనైన వేదికపై తూర్పు ముఖంగా వేంచేపు చేస్తారు. మరోప్రక్క ఉత్తరదిక్కుగా, శ్రీదేవీ భూదేవి సహిత మలయప్పస్వామిని వేరొక వేదిక మీద వేంచేపు చేస్తారు. దక్షిణదిశగా, అంటే మలయప్ప స్వామివారికి అభిముఖంగా ఉండేట్లు విష్వక్సేనుల వారిని వెలయింప చేస్తారు. ఇలా మూడు మూర్తులూ అర్థవృత్తాకారంలో, కన్నుల పండువగా సమావేశం అయ్యేటటువంటి అద్భుతఘట్టం మనకు సహస్ర కలశాభిషేక సందర్భంగా గోచరిస్తుంది.

మరోప్రక్క ధాన్యపు గింజలతో, ఒత్తుగా పరచబడిన పాన్పుపై 1008 వెండి చెంబులను పేర్చి, వాటిని సుగంధ ద్రవ్యాలను కలిపిన పవిత్ర జలాలతో నింపి, నాలుగు మూలలా వస్త్రంతో కప్పి, వాటిని మంత్రపూర్వకంగా ఆవాహన చేస్తారు. మంగళకరంగా ఉండేందుకు గాను, వీటిపై మామిడాకులు కూడా ఉంచుతారు.

ఇక్కడో రహస్యం ఉంది.

భోగశ్రీనివాసుడికి స్నానం చేయిస్తుంటే, ఆ కైంకర్యాలన్నీ గర్భగుడిలో ఉండే వేంకటేశ్వరస్వామి కెలా చేరతాయి? మూలవిరాట్టు కంత శక్తి ఎలా వస్తుంది? గర్భగుడిలోని మూలమూర్తికి ఏరోజూ 1008 కలశాలతో అభిషేకం జరగట్లేదు కదా? వందల, వేల సంవత్సరాల తరబడి అనేకానేక భక్తులు శాస్త్రానుసారం, చిత్తశుద్ధితో చేసే సేవల వల్లే దేవతా మూర్తులకు వర్చస్సు, తేజస్సు, శక్తి సమకూరుతాయని వైదిక గ్రంథాల్లో చెప్పబడింది.

సహస్ర కలశాభిషేకం వల్ల ఉత్సవమూర్తులకు చేకూరే శక్తిని మూలమూర్తికి చేకూర్చడం కోసం, భోగశ్రీనివాసుణ్ణి మరియు గర్భగుళ్ళోని మూలవిరాట్టుని కలుపుతూ ఓ పట్టుదారం కడతారు. దీన్ని అనుసంధాన తోరణం అంటారు. అభిషేకం జరుగుతున్నప్పుడు, ఈ 1008 కలశాల్లో ఉన్నటువంటి అభిషేక జలం యొక్క పవిత్రశక్తి ఈ పట్టుదారం ద్వారా గర్భగుడిలో ఉన్న స్వామివారిలో మమేకమౌతుంది. అప్పుడు శ్రీవారు మరింత శక్తివంతులై, భక్తులను సంరక్షిస్తూ ఉంటారు.

మనం కూడా ఏదైనా పూజా కార్యక్రమాలు చేసేటప్పుడు ముంజేతికి కంకణం కట్టుకుంటాం. దీనివల్ల కంకణధారులకు అంతులేని అదృశ్యశక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం.

దీనికి ముందుగానే, అర్చామూర్తులనే ఉంచే ప్రదేశానికి స్థలశుద్ధి చేసి, మలయప్పస్వామి మరియు ఇద్దరమ్మవార్లకు కంకణధారణ గావిస్తారు. తరువాత విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరుగుతుంది. విష్వక్సేనుడు శ్రీవారి సేనాపతి కావున, ముందుగా ఆయన్ను పూజించే సంప్రదాయం ఉంది. అగ్నిప్రతిష్ఠ చేసి, హోమ కార్యక్రమానంతరం, 1008 రజత కలశాల జలంతో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తారు. పురుషసూక్తంతో ప్రారంభమై, స్వామివారికి – పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు – ఈ అయిదు ద్రవ్యాలతో, విడి విడిగా అభిషేకం చేస్తారు. ప్రతి ద్రవ్యంతో అభిషేకం చేసిన తరువాత, మూర్తులు శుభ్రపడడం కోసం వాటిని మంచినీటితో స్నానమాచరింప చేస్తారు. లేత కొబ్బరినీళ్ళతో కూడా అభిషేకం చేస్తారు.

చివరగా సహస్రధార పాత్ర, అంటే వెయ్యి రంధ్రాలు గల వెండి పాత్ర (వెండి జల్లెడగా చెప్పుకోవచ్చు) మీదుగా శంఖధార, చక్రధారలుగా చెప్పబడే ప్రత్యేక పాత్రల ద్వారా జలాభిషేకం జరిపించడంతో, సహస్ర కలశాభిషేకం పూర్తవుతుంది. అభిషేకజలం వెయ్యి ధారలతో, స్వామివారి మీద జడివానలా కురుస్తుంటే, చూపరులకు బహు చక్కనైన దృశ్యకావ్యం ఆవిష్కారమవుతుంది. సేవ చివరిగా, పాల్గొన్న భక్తులందరి మీదా అభిషేక జలాన్ని ప్రోక్షిస్తారు. ఈ ఆర్జితసేవ సమాప్తమవగానే, భక్తులందరినీ శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు.

ఈ అభిషేకం ద్వారా తేజస్సు, ఓజస్సు, జ్ఞానము, వైరాగ్యం, మేధస్సు లభిస్తాయి. ఇంకా సకల తీర్థ జలాలతో, స్వామివారికి జరిగే అభిషేకం కనులారా దర్శించటం ద్వారా, భక్తులకు పుణ్యనదులు కలిసేటటువంటి సాగరంలో పవిత్ర స్నానమాచరించిన పుణ్యం కూడా కలుగుతుందని ప్రతీతి.

**సర్వేజనాః సుఖినోభవంతు**



# మట్టి గణపతి నిమజ్జనం

## ఏకవింశతి పత్ర పూజా ప్రాశస్త్యం

: పరాంకుశం శ్రీనివాసమూర్తి

**శ్లో ॥ హస్తా నక్షత్ర సంజాతం । విఘ్నేశ్వరం గజాననం ।**
**పార్వతీ హృదయాంబోధి సోమం । సదా స్మరామ్యహమ్ ।**

సృష్టి కాద్యుడు, మూలపురుషుడు, మహాగణపతి భాద్రపద శుద్ధచవితి, 'హస్త' నక్షత్రంలో జన్మించి, విఘ్నాధిపతిగా, గజాననుడుగా, పార్వతీ హృదయ ప్రియుడు, పార్వతీ తనయునిగా లోక ప్రసిద్ధి పొందిన గజాననుని ఎల్లప్పుడూ నేను స్మరిస్తాను. ఆ స్వామికి హృదయ పూర్వక అంజలి ఘటిస్తూ ఎల్లలోకాలు వినాయక చవితినాడు మనసా, వాచా, కర్మణా బుద్ధి పూర్వకంగా భక్తాళి మట్టి గణపతిని – ఏకవింశతి పత్రితో పూజించి తరిస్తారు.

శిలారూపంలో ఉన్న గణపతిని ఆరాధిస్తే జ్ఞానసిద్ధి, రాగి విగ్రహ రూపంగా ఉన్న వినాయకుని పూజిస్తే ఐశ్వర్యం, వెండి ప్రతిమ వినాయకుని ఆరాధిస్తే ఆయుష్షు, బంగారు ప్రతిమ గణపతిని ఆరాధిస్తే సంకల్పసిద్ధి కలుగుతాయి. వీటన్నింటిలోకెల్లా మృత్తికా గణపతిని పూజిస్తే సర్వమూ లభిస్తాయి. అందుచేతనే వినాయక చవితినాడు ఆయన క్షేత్రరూపమైన (భూమినుండి లభించిన) మృత్తికా వినాయకుని అర్చించి సర్వులూ ఆయన అనుగ్రహాన్ని విశేషంగా పొందుతారు. అందుకనే సకల లోకాలలో ఆయన ఆరాధ్యుడైనాడు. ఇతర శుభకార్యాలలో పసుపు వినాయకుని అర్చించి, మంగళకరమైన శుభాలను సర్వులూ పొంది గణపతికి ప్రీతిపాత్రులవుతున్నారు.

ముల్లోకములన్నింటిలోను, పధ్నాలుగు భువనాలలోను పావనమైనది భూలోకము. అందులో పుణ్యతమము, పవిత్రము, వేదభూమి, యజ్ఞ యాగాదులతో, వేదవేద్యులు, మునులు, మహర్షులు, యోగులు, ఆచార్యులు, మహాపురుషుల జన్మలతో, ఆధ్యాత్మిక చింతనతో, సత్యధర్మాలతో నిత్యనూతనంగా ప్రకాశించే పరమ పవిత్రభూమి భారతభూమి. మహర్షుల పాదస్పర్శచే పునీతమైనదీ భరతఖండము. యుగానుసారంగా దుష్టశిక్షణ–శిష్టరక్షణతో భగవంతుని ఆవిర్భావములు, అవతార క్రమములు భక్తుల భక్తి మార్గానికి, భగవదన్వేషణకు మార్గాన్నేర్పరచిన ఆ పరమాత్ముడు, సృష్టికర్తయైన భగవంతుని లీలావిశేషములు అమోఘములు. కలియుగంలో మానవజన్మలు తరించడానికి మూలమంత్రం 'కలౌ నామ సంకీర్తనః' – భగవంతుని నామ సంకీర్తనమే ముక్తిదాయకం, మోక్షప్రదము.

సృష్టి యావత్తు యుగానంతరం, కల్పాంతములలో ప్రళయం సంభవించి యావత్ప్రపంచం నశించడం, అనగా పంచభూతాత్మకమైన జగత్తులో పంచభూత సమ్మిళితమైన జీవులు పుట్టి పెరిగి, పంచభూతాలలో కలిసిపోవడమే లయాత్మకము. ఇది నిరంతర చక్రభ్రమణం.

సృష్టికాద్యుడు, పరబ్రహ్మ స్వరూపుడు, త్రిమూర్త్యాదులచే పూజించబడినవాడు, గణాధ్యక్షుడు, ప్రథమ పూజితుడు మహాగణపతి. సర్వలోకైక నాథుడు, విఘ్నాధిపతి, కలియుగంలో ప్రత్యక్షానుభూతిని కల్పించే దేవదేవుడు అయిన గణపతి వ్రతాన్నాచరించిన భక్తులందరూ బాధల నుండి విముక్తి నొందగలరని, ఈ వరాన్ని జగన్మాత స్వయంగా గణపతికి అనుగ్రహించడం మానవుల పూర్వజన్మ విశేషం. "ఓం గం గణపతయే నమః" అన్న ఏకాక్షర మంత్రాన్ని జపిస్తే సర్వకార్యాలలో విజయాన్ని పొందగలరని గణపతి పురాణం తెలుపుతున్నది.

మట్టితో చేసిన వినాయకుని ప్రతిమని ఆరాధించడంలో ప్రాధాన్యత, నిమజ్జనం చేయడానికి గల కారణాలను శౌనకాది మహర్షులడగగ సూత మహర్షి మట్టి వినాయకుని నిమజ్జనాన్ని గూర్చి ఈ క్రింది విధంగా చెప్పారట.

పరమేశ్వరుడు విశ్వవ్యాప్త తత్త్వము కలవాడు. విశ్వవ్యాప్త తత్త్వము ఈ భూమికి యున్నది. మట్టితో నిండినది, ప్రకృతి స్వరూపమైన మృత్తిక ఒకటే. అందువలనే తొలుత మృత్తికతోనే విఘ్నేశ్వరుని చేసి పూజించి, విశ్వవ్యాప్తమొనర్చాడు పరమేశ్వరుడు. సర్వజీవులు ఈ భూమి నుండి జనియించి,

జీవించి చివరకు ఈ మట్టిలోనే (భూమి) లయమౌతున్నారు. సర్వజీవరాశులకు ఇదే ప్రమాణము. ఇదే సృష్టి రహస్యం. ఇదే పరబ్రహ్మ తత్వం. ఈ మృత్తికయే పృథ్వికి మూలము కావున మట్టి వినాయకునికి ప్రాణం పోసి పరబ్రహ్మ స్వరూపంగా పూజించడం సదాచారంగా వస్తున్నది. ఈ భూమి సర్వులకు ఏకత్వాన్ని చాటుతున్నది. మట్టి ఎక్కడైనా, ఎవరికైనా లభిస్తుంది. సర్వ సమానత్వ ధర్మాన్ని కలిగి యుంటుంది. బంగారు విగ్రహాన్ని కొందరే చేయగలరు. కాని మట్టి విగ్రహాన్ని అందరూ చేసుకొని పూజించగలరు. విఘ్నాధిపతి – మహాగణపతి అందరివాడు, వరవినుతుడు, భక్తాళికి కొంగుబంగారం అని భావించి యావత్ప్రపంచం ఈ భాద్రపద శుద్ధ చవితి నాడు వినాయక చవితిగా, హస్తా నక్షత్రంలో జన్మించి, సర్వజీవ సమానత్వాన్ని ప్రబోధించిన గజాననుని, పార్వతీ హృదయ మానసపుత్రునిగా మట్టి వినాయకుడే ఖ్యాతి నొంది పూజకు ప్రాధాన్యత ఏర్పడిందని – సూతమహర్షి శౌనకాదులకు విశదీకరించాడు.

మరి పూజానంతరం గణపతిని జలంలో కలపడం లేదా నిమజ్జనం చేయడమెందుకన్న ప్రశ్నకీ విధంగా సమాధానం చెప్పారు మహర్షి.

మట్టి వినాయకునికీ రోజున మంత్రపూర్వకంగా ప్రాణ ప్రతిష్ఠ చేసి, పూజామందిరంలో ఏకవింశతి పత్రాలతో (21) పూజించి, ఇరువది రకాల పదార్థాలను నివేదనను గావించి స్వామి వ్రత కథను విని, అక్షింతలు వేసుకొని భక్తితో ఆరాధించి సంతోషిస్తాము. భక్తి పరవశులుగా నిలుస్తాము.

ఇది మట్టిబొమ్మ అయినప్పటికీ, ఆధ్యాత్మిక దృష్టితో చూసిన పరబ్రహ్మ స్వరూపమైన ప్రతిమ భగవంతుని స్వరూపము. పూజించిన విగ్రహాన్ని అలా వదిలివేయడం దోషం. దానిని మరలా లయం చేయాలి. లయం చేయడం అంటే ఆత్మను విశ్వాత్మతో ఐక్యం చేయడం. అణువును, మృత్తికా రూపాన్ని బ్రహ్మాండంలో విలీనం చేయడమని అర్థం. ఎక్కడినుంచి వచ్చిందో అక్కడికే మరలా చేర్చడం. ఇదే సృష్టి, స్థితి, లయల చక్రభ్రమణం. ఇదే పరబ్రహ్మ రూపం. అట్టి బ్రహ్మ స్వరూపుని జల నిమజ్జనం చేయడం అనగా, సముద్రము, చెరువులు, బావులు, ప్రవాహ నదులందు కలపడం వల్ల జలంలో కరిగి విశ్వవ్యాపితంగా ప్రయాణిస్తూ, భూమిలో, మట్టిలో కలిసిపోతుంది. సర్వజీవులకు పుణ్యప్రద ప్రసాదాన్ని పంచుతుంది. పూజించిన ప్రతి పత్రి అనగా ఇరువది ఒక్క పత్రులు (ఆకులు) 'దివ్యౌషధి' గుణాలను కల్గి యుండడం వల్ల ప్రకృతి లోని ప్రతి జీవికి ఆరోగ్యాన్ని, సంపదలను, ఆనందాన్ని అందిస్తుంది. భూమాత ప్రసాదించిన ఈ మృత్తికా ప్రసాదాన్ని నిమజ్జనం ద్వారా ఆ మాతకే సమర్పిస్తూ, పరబ్రహ్మ స్వరూపునికి అంజలి ఘటిస్తూ, ఈశ్వర ప్రసాదం ఈ మట్టి వినాయకునికి చివరిగా నమస్కరించి సర్వం 'ఈశ్వరార్పణమస్తు' అంటూ జలనిక్షిప్తం చేయడం, వినాయక నిమజ్జనంలోని పరమార్థమని మహర్షి తెలియజేశాడు. ఆ ఆచారమే ఈనాడు ప్రపంచ వ్యాపితంగా, వినాయక నిమజ్జనాల నతి వైభవంగా జరుపుకుంటూ గణపతి వరాలకనుగ్రహమై భక్తాళి పునీతమౌతుందనడంలో ఎట్టి సందేహం లేదు.

ఈ భాద్రపదం మాసంలో మాత్రమే మట్టి వినాయకుని పూజిస్తాము. మిగిలిన శుభకార్యాలలో పసుపుముద్దనే విఘ్నాధిపతిగా కొలుస్తున్నాము.

ఓం గణానాం త్వా గణపతిం । హవామహే । కవిం కవీనాముపశ్రవస్తమమ్ । జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణాస్పత ఆనఃశృణ్వాన్నూతిభిస్సీద సాదనమ్ మహాగణపతియే నమః ఓం ॥ – యజుర్వేద సూక్తంలోని పై మంత్రాన్ని ఉచ్చరిస్తూ మొదటిగా మహాగణపతి గణాధిపతి, దేవతలలో జ్యేష్ఠుడు, బ్రహ్మవు, బ్రాహ్మణులలో శ్రేష్ఠుడవు, వేదముల కధిపతివై, ఆద్యంతముల వ్యాప్తి చెందినవాడు అయిన మహాగణపతిని ప్రార్థించి, నమస్కరించి పూజారంభం చేస్తాము.

'అహం బ్రహ్మాస్మి' – ఆ బ్రహ్మమును నేనే, అనే గర్వాన్ని ప్రక్కకు నెట్టి భక్తి ప్రపత్తులతో విశ్వవ్యాపితుడయిన గణపతి నారాధించిన సకలైశ్వర్య ప్రాప్తి, ముక్తి సోపానము కల్గుతుందని పురాణోక్తము. వ్యాసాది మహర్షులు "ఓం! గం గణపతయే నమః" అని మంత్రోక్తంగా స్తుతించి 'పాహిమాం గణపతీ' అని ప్రార్థించి మహాభారత రచనకు గణపతియే లేఖకునిగా నిల్పి స్వామి అనుగ్రహ పాత్రుడైన మహర్షి వ్యాసుడు. అందువలనే గణపతి సర్వుల కారాధ్యుడైనాడు.

పత్రి పూజలో పరమార్థము – పత్రి అనగానే పనికిరాని ఆకులు అనడం సంప్రదాయంగా ఉంది. పత్రులతో (ఆకులతో) గణపతిని పూజించడం వినాయక చవితిలోని ముఖ్యమైన పూజ. ఇరువది యొక్క పత్రులతో (21 ఏకవింశతి పత్రులు) పూజించడం ప్రశస్తం. పుణ్యప్రదము. దీనిలో గణపతికి "దూర్వార యుగ్మం" (జంటగా వున్న గరిక)తో పూజ ప్రశస్తం. గణపతి ప్రీతికి, కరుణా దృష్టికి మూలమైనది. దీనివల్ల గణపతి ప్రీతిచెంది భక్తులను అనుగ్రహిస్తాడు. ప్రతి పత్రి పూజలోనూ ఓషధీ గుణాలున్నాయి. పై గుణాలున్న ఆకులను, గరికను ఆహారంగా గ్రహిస్తుంది కనుకనే గజరాజు మహాబలంగా, బుద్ధికుశలతగా, ఆరోగ్యంగా ఉంటుంది. గణపతి ప్రీతికి 21 పత్రుల పూజ ఆయురారోగ్యములను కల్గిస్తుందని మనం గ్రహించాలి. ఆ పత్రులు ఓషధీ గుణాలు కల్గినవి కావున ఆ వాసనను మనం పీల్చినా, జల నిమజ్జనం చేసినా ఆ జలాలకు పవిత్రత నిస్తుంది. అందుకనే గణపతికి క్షిప్రప్రసాది – త్వరగా అనుగ్రహించే దైవం, ఆరోగ్య ప్రదాత యని మనం గ్రహించాలి. ఏకవింశతి పత్రాలతో పాటు మహాగణపతి కూడా 21 గణపతులుగా ప్రసిద్ధి చెంది

యున్నాడు.

## ఏకవింశతి పత్రాలు – గుణాలు :

1. మాచీపత్రం – ఇది నేత్రౌషధిగా పని చేస్తుంది. నేత్ర రోగాలకు, చర్మవ్యాధులకు సైతం పని చేస్తుంది.

2. మారేడు (బిల్వపత్రం) – దీనినే 'మారేడు' పత్రం అనే పేరుతో పిలుస్తారు. మధుమేహ వ్యాధికి (చక్కెర) మహౌషధిగా పని చేస్తుంది. దీని పొడిని మజ్జిగ అనుపానంతో తీసుకుంటే వ్యాధి ఉపశమనం కల్గుతుంది.

3. దూర్వారయుగ్మం – రెండు కొనలు కల్గిన గరిక కొసలున్న జంట గరిక (గడ్డి) గణపతికి ప్రీతికరమైనది. ఇది మూత్ర సంబంధ వ్యాధులను నివారిస్తుంది.

4. దత్తూర పత్రం – ఉమ్మెత్త పత్రం మానసిక వ్యాధులకు నివారణ కల్గిస్తుంది. దీని రసాన్ని రెండు నెలలు మర్దనా చేసిన శిరోవ్యాధి తగ్గి నివారణ కల్గుతుంది.

5. బదరీపత్రం – రేగు అని పిలుస్తారు. అన్నిరకాల వ్యాధులకు, సాధారణ జబ్బులకు వినియోగిస్తారు. చిన్నపిల్లల ఆరోగ్యదాయిని అంటారు.

6. అపామార్గ పత్రం – దీనిని ఉత్తరేణి అంటారు. దీని వేర్లపొడి దంత వ్యాధులను, చర్మవ్యాధులను తగ్గిస్తుంది. యజ్ఞాదులలో ఈ ఉత్తరేణి పుల్లలను వేయడం వల్ల దాని పొగ పీలిస్తే శ్వాసకోశ వ్యాధులు నయమవుతాయి.

7. తులసీ పత్రం – పరమ పవిత్రమైనది. ప్రతి గృహంలో పూజించేది. వినాయక చవితి రోజున మాత్రమే ఈ తులసి పత్రం పూజకర్హమని స్వయంగా గణపతి సూచించినాడు. తులసి, మిరియాలు కలిపి తింటే దగ్గు, కఫము, నులిపురుగుల వ్యాధులు నశిస్తాయి.

8. చూతపత్రం – దీనిని మామిడాకులు అంటారు. సకల శుభకార్యాలందు ఈ మామిడాకులు లేనిదే పూజలు జరుగవు. కాలి పగుళ్ళు దీని పసరు, ఉప్పుతో వేడిచేసి పూస్తే నయమౌతాయని తెలుస్తున్నది.

9. కరవీరపత్రం – గన్నేరు అంటారు. పచ్చ – ఎర్ర – తెల్ల – ముద్ద గన్నేరులుగా దొరుకుతుంది గన్నేరు పుష్పం. ఆకులతో పూజిస్తారు. జ్వర తీవ్రత నుండి కాపాడుతుందని ప్రమాణం.

10. విష్ణుక్రాంతపత్రం – అవిసె ఆకు పత్రంగా పూజిస్తారు. తామర వ్యాధులకు దీని ఆకులను నిమ్మరసంతో కలిపి నూరి తామరున్న చోట పూస్తే వ్యాధి నిర్మూలనమవుతుంది.

11. దాడిమీపత్రం – దానిమ్మ ఆకులు. ఆకులు దంచి కషాయం చేసి దానిలో తగినంత చక్కెర కలిపి సేవిస్తే ఉబ్బసం, అజీర్తి వ్యాధులు తగ్గుతాయి.

12. దేవదారు పత్రం – ఇది వనాలలో పెంచబడే వృక్షం. దేవదారు ఆకులను నూనెలో వేసి కాచి, కాగిన చల్లారిన నూనె తలకు రాసుకుంటే మెదడు, కంటి సంబంధ వ్యాధులు చేరవు.

13. మరువక పత్రం – పూలమాలలో సువాసనకు మూలమైనది మరువం అంటారు. దీని ఆకులను వేడి నీళ్ళలో వేసి స్నానం చేస్తే శరీరపు దుర్వాసన నశిస్తుంది.

14. సింధువార పత్రం – వావిలాకు అంటారు. తెలుపు – నలుపని రెండు రకాలు. నీళ్ళలో ఆకులు వేసి మరిగించి బాలింతలకు స్నానం చేయిస్తే వాతరోగం, ఒంటినొప్పులు తగ్గుతాయి.

15. జాజి పత్రం – మల్లె ఆకులు, పూలు పూజకుపయోగిస్తారు. సువాసనా భరిత పుష్పాలు. స్త్రీలకు ఇష్టంగా ఉంటాయి.

16. గండకీ పత్రం – ఇది అరణ్యాలలో మాత్రమే ఉంటుంది. అరుదుగా లభించే గండకీ వృక్షం ఆకులు దీర్ఘవ్యాధులకు దివ్యౌషధంగా పని చేస్తాయి.

17. శమీ పత్రం – జమ్మి పత్రం. పాండవులు తమ ఆయుధాలను ఈ శమీ వృక్షం మీదుంచారని అంటారు. దీని ఆకుల పసరు దీర్ఘ వ్రణాలకు, కుష్టువ్యాధి పుండ్లకు ఉపకరిస్తుందని శాస్త్ర ప్రమాణము.

18. అశ్వత్థ పత్రం – రావి పత్రం. రావి చెట్టు లేని ఊరుండదు. యజ్ఞాదులలో ప్రతీతి. రావి మండలు, పుల్లల భస్మాన్ని తేనెతో కలిపి సేవిస్తే శ్వాసకోశ వ్యాధులు నశిస్తాయి.

19. అర్జునపత్రం – మద్ది ఆకులు. తెలుపు, ఎరుపు రంగులో ఉంటాయి. ఈ రెండింటి బెరడులలో ఏదైన ఒకదానిని పొడిచేసి కురుపులున్న చోట కడితే తగ్గుతాయని ప్రతీతి.

20. అర్కపత్రం – జిల్లేడు ఆకు. ఎరుపు – తెలుపు – రాజ అనే మూడు రకాలుగా లభిస్తాయి. దీనిలో వైద్య రహస్యాలున్నాయి. దీని పాలు కంటిచూపుకు ప్రమాదం.

21. కపిత్థ – దర్భ – దర్భ మరియు వెలగ ఫల పత్రములతో పూజించిన విశేష ఫలము లభిస్తుంది. పవిత్ర కార్యాలయాలలో ఈ దర్భ పత్రాన్ని ఉపయోగిస్తారు. పవిత్రతకు మూలం దర్భ.

పై ఏకవింశతి పత్రాలలో పరమార్థం ఎంత గొప్పదో తెలుసుకున్నాం. ఇవన్నీ ఆయుర్వేద శాస్త్రంలో చెప్పబడ్డాయి. వేదములలో ఒక భాగం ఆయుర్వేదం. ఆ వేదాలకు జన్మస్థానం ప్రణవం. ఆ ప్రణవ స్వరూపమే విఘ్నేశ్వరుడు, గజాననుడు కావున పై పత్రులను పూజతో స్వీకరించి, మనకు సకల ఆయురారోగ్య భోగాలను ప్రసాదించే వరప్రసాది గణపతి. అందుకనే ఆ స్వామిని 'ఓం గం గణపతయే నమః' అని స్మరించి, జపించినా మనకు ముక్తి కలుగుతుంది. ఆ గణపతి అనుగ్రహం సర్వులకూ కల్గుతుంది. అందుకే ఈరోజు వినాయకచవితిగా దేశమంతటా ప్రసిద్ధి గాంచినది. సర్వులమూ గణపతిని పూజిద్దాం. తరిద్దాం.

**జై గణేష్ మహరాజ్ కీ జై.**

# గజముఖుడు

– మందరపు వి.జి.శంకరాచారి



విఘ్నాలను తొలగించేవాడు... దేవతలందరిలో తొలిపూజకు
అర్హుడైనవాడు, మాతాపితరుల చుట్టూ చేసిన ప్రదక్షిణమే...
అన్ని పవిత్ర నదులలో చేసిన ఫలమని... ఏడేడు లోకాలు
చుట్టిన ఫలమని తెలియజేసినవాడు.
కేవలం గరికపూజకే సంతోషపడినవాడు...
ఉండ్రాళ్ళను ఆర్తిగా ఆరగించినవాడు...
ఏ మంత్రోచ్చారణ అవసరం లేకుండా పూజిస్తే చాలు
బహు సంబరపడిపోయి విఘ్నాలను తొలగించి
కోర్కెలను నెరవేర్చే పరమ దయామయుడు...
కరుణా స్వరూపుడు... అయిన వినాయకుడి గురించి
పురాణాలలో ఉటంకించినది సంక్షిప్తంగా.

పూర్వకాలంలో గజాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. పేరుకి రాక్షసుడైనా అపారమైన శివభక్తుడు. ప్రతిరోజూ నియమ నిష్ఠలతో శివుణ్ణి పూజించేవాడు. అటువంటి గజాసురుడికి ఒక ఆలోచన వచ్చింది. ఆ కైలాసనాథుడే తన ఉదరంలో స్థిర నివాసియై ఉన్నయెడల తనకు మరణం సంభవించదని... ఎవరూ తనను చంపలేరని, కాబట్టి మృత్యువు తన దరికి రాకుండా ఉండాలంటే అది మార్గమని ఆలోచన చేసి తపస్సు చేయడానికి రాజ్యాన్ని వదలి కానలకేగి పరమనిష్ఠతో పరమ పవిత్రంగా ఎన్నో సంవత్సరాలు కఠోరంగా శివుడి గురించి తపస్సు చేయడం ప్రారంభిస్తాడు.

పరమభక్తుడైన గజాసురుడి తపస్సుకి మెచ్చి శివుడు ప్రత్యక్షమై ''ఏం వరం కావాలో కోరుకో గజాసురా'' అని అడుగుతాడు. అప్పుడు గజాసురుడు ''దేవాధి దేవా.. ఈ సృష్టిలో పుట్టిన ప్రతి జీవి మరణించక తప్పదు. అయితే నేను నీ యొక్క పరమ భక్తుడినైన కారణం చేత మృత్యువు నన్ను కబళించకూడదు. కాబట్టి నాకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించమ''ని కోరుతాడు.

అది విన్న మహాశివుడు ''గజాసురా! నీవు కోరిన కోర్కె సృష్టికి విరుద్ధం. మీ రాక్షస జాతంతా మరణం రాకూడదని తలపోసి దేవతల కొరకు కఠోర తపస్సు చేసి వరాన్ని పొంది ఏదో ఒక కారణంతో మరణించడం జరిగింది. కావున నీవు కోరిన కోర్కె సబబు కాదు. మరి యొక వరం కోరుకో'' అనుగ్రహిస్తాను అంటాడు.

అప్పుడు గజాసురుడు క్షణమాలోచన చేసి ''పరమశివా! నీవు చెప్పినట్లుగానే మా రాక్షస జాతంతా మరణం రాకూడదని తెలివి తక్కువగా ఆలోచన చేసి మరణం తెచ్చుకున్నారు. నేను వారిలా కాదు. ఎందుకంటే లయకారుడివి నీవని గుర్తించక మా వాళ్ళని కోరిన కోర్కె ఫలించలేదు. నేను వారిలా తెలివితక్కువగా ఆలోచన చేసి కోరను. నీవనుగ్రహిస్తావని మాట ఇస్తే నా కోరిక ఏమిటో తెలియచేస్తాను'' అంటాడు.

అందుకు శివుడు ''గజాసురా! నీ కోర్కెను తప్పకుండా నెరవేరుస్తాను కోరుకో'' అని అనడంతో గజాసురుడు సంకోచించకుండా...

''తండ్రీ... లయ కారుడవైన నీవే నా ఉదరంలో నివసించిన పక్షాన ఏ మృత్యువు నన్ను కబళించలేదు. నాకు మరణం ఎట్టి పరిస్థితులలోను సంభవించదు. కావున నీవు నా ఉదరంలో స్థిరనివాసివై ఉండి నాకు మరణం రాకుండా రక్షించు తండ్రీ!'' అని కోరతాడు.

భోళాశంకరుడైన శివుడు గజాసురుడి కోర్కె విని మరియొక ఆలోచన లేకుండా గజాసురుని కోర్కె మన్నించి అతడి ఉదరంలో స్థిరనివాసియై ఉండడం ప్రారంభిస్తాడు.

ఈవిధంగా గజాసురుడి కోర్కెను తీర్చడానికి కైలాసం విడిచి వచ్చిన శివుడు తిరిగి కైలాసానికి రాకపోయేసరికి పార్వతీదేవి

తన జ్ఞాన దృష్టితో జరిగిన విషయం తెలుసుకుని అన్నగారైన విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళి విషయం చెబుతుంది. ఏవిధంగానైనా గజాసురుడి ఉదరంలో నివాసియై ఉన్న శివుడిని కైలాసానికి వచ్చేవిధంగా చేయాలని, అందుకుగాను సరియైన ఉపాయాన్ని ఆలోచించి గజాసురుడి బారినుండి శివుణ్ణి కాపాడమని కోరుతుంది.

పార్వతీదేవి ద్వారా విషయం తెలుసుకున్న నారాయణుడు క్షణమాలోచించి ''సోదరీ! గజురుడు మహాశివభక్తుడు. తనకు మరణం సంభవించకూడదని అతి తెలివిగా ఆలోచించి లయకారుడైన మహాశివుణ్ణి తన ఉదరంలో దాచుకున్నాడు. అలాగైతే తనకు మరణం సంభవించదన్న ఆలోచన. అయితే గజాసురుడు రాక్షసుడైనా ధార్మికుడు. ఇచ్చిన మాటను తప్పక పాటించేవాడు. అయితే ఇతడికి గంగిరెద్దుల ఆట అంటే పరమపిచ్చి. ఎవరైనా వచ్చి గంగిరెద్దు చేత ఆటలాడించి అతడికి వినోదాన్ని ఇచ్చినట్లయితే కోరిన వారి కోర్కె ఎటువంటిదైనా నెరవేరుస్తాడు. ఈ బలహీనతను మనం ఉపయోగించుకోవాలి. కాబట్టి నేను గంగిరెద్దును ఆడించేవాడిగా, నంది గంగిరెద్దుగా, మిగిలిన బ్రహ్మాది దేవతలు నా సహచర గణంగా వెళ్ళి మా కోర్కెను తెలియజేసి నీ భర్తను తిరిగి కైలాసానికి వచ్చేటట్లుగాచేస్తాను. ఇక నీవు చింతింపవలదు'' అని చెప్పడంతో పార్వతీదేవి శివ ప్రార్థన చేస్తూ కైలాసానికి వెళ్ళిపోయింది.

శ్రీమన్నారాయణుడి ఆజ్ఞతో నంది గంగిరెద్దుగా మారతాడు. బ్రహ్మాది దేవతలు సహచరులుగా మారగా, నారాయణుడు గంగిరెద్దును ఆడించే మేళకర్తగా మారి గజాసురుడి దగ్గరకు వెళతారు.

గజాసురుడు తన రాజ్యంలోకి గంగిరెద్దుల మేళం వారు వచ్చి గంగిరెద్దు చేత వివిధ రకములుగా ఆటలాడిస్తూ వినోద కార్యక్రమములు చేయుచున్నారని తెలుసుకుని గంగిరెద్దు మేళాన్ని తన వద్దకు వచ్చి వినోద కార్యక్రమములు నిర్వహించమంటూ వర్తమానం పంపిస్తాడు.

గంగిరెద్దు మేళంగా యున్న శ్రీమన్నారాయణుడు తన సహచర గణంతో గజాసురుడి దగ్గరకు చేరుకుంటారు.

గజాసురుడి ఆజ్ఞతో విష్ణుమూర్తి గంగిరెద్దుగా మారిన నంది చేత పలు విధములుగా నృత్యగానములను జరిపిస్తాడు. వారి ప్రదర్శనకు ముగ్ధుడైన గజాసురుడు ''ఏ వరం కావాలో కోరుకోమ''ని మారు రూపధారియైన విష్ణుమూర్తిని అడుగుతాడు.

అప్పుడు విష్ణుమూర్తి ''గజాసురా! నేను ఏ కోర్కెను కోరినా తీరుస్తావు కదా'' అంటాడు.

దానికి గజాసురుడు ''ఓయీ! గంగిరెద్దుల నాయకుడా... మేము రాక్షసులమైనా, ఆడిన మాట తప్పనివారము. మహాశివ భక్తులం. కావున సందేహం విడిచి కోరుకొనుము'' అని అభయమిస్తాడు.

మారు రూపంలో ఉన్న విష్ణుమూర్తి ''గజాసురా! నీ ఉదరంలో యున్న ఈశ్వరుణ్ణి బయటకు పంపు. అదే మా అందరి కోరిక'' అంటాడు.

విష్ణుమూర్తి కోరికను విన్న గజాసురునికి విషయం అర్థమవుతుంది. తన దగ్గరకు వచ్చినది సాక్షాత్తూ నారాయణుడే. తన పరివారంతో వచ్చాడని అర్థమవుతుంది. అయితే ఇచ్చిన మాటను వెనక్కి తీసుకోవడం ఎరుగని గజాసురుడు తనకు మృత్యువు సమీపించిందని, అందుకే ఒక పథకం ప్రకారం వైకుంఠ వాసుడు వచ్చాడని అర్థం చేసుకుంటాడు.

అప్పుడు తన ఉదరంలో గల శివుణ్ణి ఈవిధంగా ప్రార్థిస్తాడు.

''పరమేశ్వరా! నీవన్నట్లుగా సృష్టికి విరుద్ధంగా ఏదీ జరగదు. మరణాన్ని జయించాలని అనుకోవడం అవివేకం అని నాకిప్పుడు అర్థమైంది. మరణాన్ని స్వాగతించగలను కానీ నీవు నా నుండి దూరమై పోతావన్న బాధకు జీర్ణించుకోలేక పోతున్నాను. అందుకే మహాశివా! నా మరణానంతరం నా చర్మాన్ని నీవు ధరించవలెను. అంతేకాదు నా శిరస్సుని ముల్లోకాలూ పూజించేలా అనుగ్రహించు'' అని కోరుకుంటాడు.

గజాసురుడి ఉదరంలో దాగుకొని యున్న శివుడు ''తథాస్తు'' అంటూ అతడి ఉదరాన్ని చీల్చుకుని బయటకు వస్తాడు. పరమశివుడు బయటకు రావడంతో గజాసురుడు మరణిస్తాడు.

విష్ణుమూర్తితో సహా మిగిలిన దేవతలందరూ వారి వారి లోకాలకు బయలుదేరుతారు.

మహాశివుడు కూడా కైలాసానికి బయలుదేరుతాడు.

గజాసురుడు మరణించాడని అతడి కుక్షి లో నుండి పరమశివుడు బయటకు వచ్చి సరాసరి కైలాసం వస్తున్నాడని గ్రహించిన పార్వతీదేవి, పతిదేవుడు వస్తున్నాడని సంతసించి అలంకరణకు సిద్ధమవుతుంది. ఆమె తన మందిరంలోని స్నానవాటికకు వెళితే నలుగు పిండితో ఒక చిన్న బాలుణ్ణి తయారు చేసి వాడికి ప్రాణం పోసి తను స్నానానికి వెళుతున్నానని – ఎవరినీ లోపలికి రాకుండా చూడమని చెబుతుంది. తల్లి ఆనతిని పాటిస్తూ ఆ బాలుడు ఎవరినీ లోపలికి అడుగుపెట్టనీయకుండా పార్వతీదేవి మందిరం బయట నిలబడి పహరా కాస్తాడు.

అంతలో గజాసురుని ఉదరం నుండి బయటపడ్డ శివుడు కైలాసానికి వస్తూ సరాసరి పార్వతీదేవి మందిరాన్ని చేరుకుని లోపలికి ప్రవేశించబోతాడు. అప్పుడు అక్కడ పహరా కాస్తున్న బాలుడు వచ్చినది ఎవరో తెలియక మహాశివుణ్ణి అడ్డగిస్తాడు.

అప్పుడు మహాశివుడు కోపంతో ఆ బాలుడి తలను తన త్రిశూలంతో తెగ నరుకుతాడు.

స్నాన వాటిక నుండి బయటకు వచ్చిన పార్వతీదేవి తన పతిదేవుడు వచ్చాడని ఒకవైపు సంతోషిస్తూ మరియొకవైపు

తన కుమారుడు మృతజీవుడై పడియుండుటను చూసి తీవ్రమైన దుఃఖంతో రోదిస్తుంది.

ఆమె విచారానికి కారకుడు తనేనని పరమశివుడు చింతాకాంత్రుడై ప్రమథ గణములను పిలిచి ఉత్తర ముఖంగా పయనించి అక్కడ పడుకొనియున్న ఏ జీవి ముఖమునైనా సరే తీసుకుని రమ్మని ఆజ్ఞాపిస్తాడు.

శివుడి ఆజ్ఞతో బయలుదేరి వెళ్ళిన ప్రమథ గణములకు మృతజీవులెవరూ కనబడరు. అయితే ఉత్తర దిక్కున నిర్జీవియై పడియున్న ఏనుగు కళేబరాన్ని చూసి ఆ ఏనుగు ముఖాన్ని త్రెంచి కైలాసానికి తీసుకుని వస్తారు.

శివుడి ఆగ్రహానికి గురియైన పార్వతీసుతుడి యొక్క మొండానికి గజముఖాన్ని అతికించి ప్రాణప్రతిష్ఠ చేస్తాడు శివుడు. అప్పుడు పార్వతీ తనయుడు ప్రాణాలతో తిరిగి లేస్తాడు.

పరమశివుడు పార్వతీదేవితో ''పార్వతీ! నీవు ప్రాణప్రతిష్ఠ చేసి నిలబెట్టిన బాలుడు అని తెలియక వధించితిని. అందుకు నన్ను క్షమించు. నా శూలంతో వేరుపడిన మన పుత్రుడి తల నా మూడోకంటి క్రోధాగ్నితో భస్మమైపోయినందున నేను నా పుత్రుడికి గజముఖాన్ని అమర్చవలసి వచ్చింది. అంతేకాదు నన్ను ఉదరంలో దాచుకున్న గజాసురుడు మరణిస్తూ తన పేరుని ముల్లోక ప్రజలు కీర్తితో కొలవాలని కోరుకున్నాడు. మరియు తన యొక్క చర్మాన్ని నన్ను ధరించమని కోరుకున్నాడు.

ఈ కారణం వలన మన బాలుడికి ఏనుగు ముఖాన్ని అతికించి ప్రాణం పోయవలసి వచ్చింది. ఇకనుండి మన కుమారుడైన గజముఖుడు భవిష్యత్తులో అన్ని లోకాల ప్రజలచే పూజింపబడతాడు. ఇక నువ్వు చింతింపవలదు'' అని పార్వతిని అనునయిస్తూ విషయం తెలియచేస్తాడు.

పరమశివుడి అనునయంతో పార్వతీదేవి కోపం చల్లారి గజముఖుడైన పిల్లవాణ్ణి దగ్గరకు తీసుకుంటుంది.

తదనంతర కాలంలో... కైలాసంలోని దేవతలందరూ పార్వతీ పరమేశ్వరుల వారి దగ్గరకు వెళ్ళి తాము చేయబోవు కార్యాలలో ఎటువంటి విఘ్నాలు లేకుండా ఉండేందుకు ఒకరిని పూజించేందుకు యోగ్యుడైన వ్యక్తిని ఇవ్వమని కోరుతారు. వారు పార్వతీ పరమేశ్వరుల కుమారులైన విఘ్నేశ్వరుడు మరియు కుమారస్వామి, ఇద్దరిలో ఒకరిని పూజకి అర్హులుగా చేయమని కోరుతారు. ఈ విషయం తెలుసుకున్న ఇద్దరు కుమారులలో గణపతి మౌనంగా ఊరుకున్నా కుమారస్వామి మాత్రం తనకే ఆ పూజార్హతని కల్పించమని కోరుతాడు.

అప్పుడు శివుడు ''కుమారులారా! మీ ఇద్దరిలో ఒకరికి మాత్రమే విఘ్ననాయకుడు కావలసి ఉంటుంది అన్న. గణపతిని కాదని నీకు ఇవ్వడం సరికాదు. అయితే మీ ఇద్దరిలో తెలివైన వారికి మాత్రమే ఆ పదవి ఇవ్వబడుతుంది. మేము పెట్టే పరీక్షలో నెగ్గినవారు విఘ్నరాజు పదవిని చేపడతారు. నెగ్గని వారు దేవతల సేనానిగా నియమింపబడతాడు. అయితే మేము పెట్టబోయే పరీక్షకు మీ ఇద్దరూ సమ్మతిని తెలియజేస్తే ఆ పరీక్ష ఏమిటో చెబుతాను'' అంటూ కుమారులతో పరమశివుడు సంభాషిస్తాడు.

కుమారులిద్దరూ ఆ పోటీలో పాల్గొనుటకు తమ యొక్క సమ్మతిని తెలియజేస్తారు.

అప్పుడు పరమశివుడు ''కుమారులారా! ముల్లోకాలలో గల పుణ్య నదులన్నింటిలో స్నానం చేసి ఎవరు ముందుగా వచ్చి కైలాసానికి చేరుకుంటారో వారే విఘ్నాధిపతి పదవిని చేపడతారు'' అనగానే వెంటనే కుమారస్వామి తన యొక్క వాహనమైన మయూరాన్ని (నెమలి) తీసుకుని పుణ్యనదులలో స్నానం చేయడానికని బయలుదేరుతాడు.

అయితే గజముఖుడు తల్లితండ్రులైన పార్వతీ పరమేశ్వరులను ప్రార్థన చేస్తూ ''తల్లితండ్రులారా! మీరు పెట్టిన ఈ పరీక్షలో నెగ్గడానికి నాకు అవకాశం లేదు. ఎందుకంటే స్థూలకాయుడనైన నన్ను మోసే వాహనం లేదు. వాహనం లేకుండా మూడు లోకాలు సంచరించి స్నానమెలా ఆచరించగలను. కాబట్టి మీరు పెట్టే ఈ పరీక్షలో నెగ్గడానికి తగిన తరణోపాయమును నా మీద దయతో చూపించమ''ని ప్రార్థన చేస్తాడు.

అప్పుడు శివుడు వినాయకుడికి ఒక మంత్రాన్ని ఉపదేశిస్తాడు. ఆ మంత్రాన్ని వివరించి తల్లితండ్రుల చుట్టూ మూడు ప్రదక్షిణలు చేస్తూ దాన్ని పఠించమని చెబుతాడు (మాతృదేవోభవ, పితృదేవోభవ). అలా మంత్ర పఠనం చేస్తూ గణపతి తల్లితండ్రుల చుట్టూ 3 సార్లు ప్రదక్షిణ నమస్కారాలు చేస్తాడు.

ఈ మంత్ర ప్రభావం వల్ల కుమారస్వామికి తను వెళ్ళిన ప్రతిచోటా తనకంటే అన్నగారైన గజముఖుడు ముందుగా పుణ్యనదులలో స్నానం చేసి వెళుతున్నట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది. కైలాసానికి తిరిగి వచ్చిన కుమారస్వామి... అన్నగారు తనకన్నా తెలివైన వారని ఒప్పుకుంటాడు. తల్లితండ్రుల చుట్టూ చేసిన ప్రదక్షిణమే. అన్ని లోకాలను, పుణ్యనదులలో స్నానం చేసిన ఫలాన్ని ఇస్తుందని తెలుసుకున్నాను. తల్లితండ్రులైన మీ చుట్టూ ప్రదక్షిణ చేసి నాలో గల అవివేకాన్ని అన్నయ్య తొలగించాడు. కాబట్టి విఘ్నాలకు రాజుగా అన్నయ్యనే చేయమని అంగీకరిస్తాడు. తనని క్షమించి అన్నయ్యకే ఆ పదవిని ఇవ్వమని తల్లితండ్రులను కోరుతాడు.

ఆ విధంగా గజముఖుడు భాద్రపద శుద్ధ చవితి రోజున విఘ్నాలను తొలగించే నాయకుడిగా దేవతలందరిలో మొదటి పూజకు అర్హుడైనవాడిగా నియమింపబడతాడు.

తమ్ముడు కుమారస్వామి దేవ సేనానిగా నియమింపబడతాడు.

**"వక్రతుండ మహాకాయ... కోటిసూర్య సమప్రభ**
**నిర్విఘ్నం కురుమేదేవ... సర్వకార్యేషు సర్వదా"**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి
**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. సంగీత సాహిత్యము లందు ఇష్టం కలిగి ఉంటారు. అన్నివేళలా చాకచక్యముగా వ్యవహరించండి. పొగిడేవారితో చాలా కష్టనష్టములు కలుగును. చిత్రగుప్తుని దేవాలయంలో 7 బుధవారములు పూజలు చేయండి.

## వృషభరాశి
**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు విందు వినోదములు పంతాలు పట్టింపులకు అవకాశం ఇవ్వరాదు. ప్రతి విషయంలో అనుకూలత. వివాహ ప్రయత్నములు ఫలించును. చాలా జాగ్రత్తలు తీసుకొంటూ ముందుకు సాగండి. అన్ని విధములుగా చాలా బాగుంటుంది. ఏ పని చేసినా మనస్ఫూర్తిగా చేయండి. సత్యనారాయణ స్వామివారి వ్రతం చేసి కట్నకానుకలు తీసుకొనరాదు.

## మిథునరాశి
**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు నూతన వ్యక్తుల పరిచయం. సంఘటనల నుండి బయటపడగలరు. కొన్ని ఆలోచనలతో మార్పు జరుగుతుంది. ఆదాయ వనరులపైన దృష్టి పెట్టగలరు. గురుబలం వలన వృత్తి మార్పు జరిగి అదనపు వనరులు, ఆదాయం. ఈశ్వర ఆరాధన చేయండి.

## కర్కాటకరాశి
**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు. ప్రతి విషయంలో ఉత్సాహంగా నెరవేర్చుకొనగలరు. మాటలు పొదుపు చేయండి. వ్యాపారంలో అప్ అండ్ డౌన్. తీర్థయాత్రలు, ఆకస్మిక ప్రమాదములు. జాగ్రత్తగా ఉండాల్సి న రోజులు. వినాయక, లక్ష్మీ, సరస్వతి పూజలతో శాంతి ఉంటుంది.

## సింహరాశి
**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు శ్రమకు తగిన ఫలితం ఉంటుంది. మీరు తలపెట్టిన కార్యములు నెరవేరుటకు ప్రతిరోజు మంచి ముహూర్త బలంతో కార్యము అనుకూలించును. ఉద్రేకమునకు సమయం కాదు. కార్యనిర్వహణకర్తగా పనిచేయండి. సత్యదేవుని వ్రతం ఆచరించి కట్న కానుకలు తీసుకొనరాదు.

## కన్యారాశి
**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అధికమైన శ్రమ, శ్రమకు తగిన ఫలితం ఉంటుంది. కొంతమంది మిత్రుల వలన ఇబ్బందులు. వారిని పక్కనపెట్టండి. ఎవరిని నమ్మరాదు. నూతన విధానములు ఆచరించి ముందుకు సాగుటకు ప్రయత్నం చేయుటలో రాజీపడరు. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## తులారాశి
**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనుకూలం. ఆకస్మిక ధనాదాయం. ఆడంబరాలకు అధికముగా ధనం ఖర్చు చేయగలరు. శత్రువులు విజృంభించగలరు. ఆందోళన లేకుండా ధైర్యంగా నిబ్బరంగా పట్టు జారకుండా చూసుకొనగలరు. గజలక్ష్మిదేవి పూజలు చేయుట వలన గృహశాంతి కలిగి ఉంటారు.

## వృశ్చికరాశి
**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ప్రతి విషయంలో తొందరపాటు పనికిరాదు. కార్యసాధన ఉంది. తొందరపాటు నిర్ణయముల వలన మనశ్శాంతి కోల్పోతారు కనుక కార్యసాధనతో సాధించగలరు. అనారోగ్యములు ఉన్నవి. శ్రీ లక్ష్మీదేవి పూజలు అనుకూలించును.

## ధనూరాశి
**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు విందులు వినోదములు మనో నిగ్రహం కలిగి ఉండండి. ప్రతి విషయంలో అనుకూలతగా ఉంటుంది. ఇతరుల సహాయం పొందగలరు. నిదానముగా మీరు ఇతరులకు ఉపయోగ పడండి. ధనలక్ష్మి పూజలు చేయండి.

## మకరరాశి
**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలత. ఖర్చులు అధికంగా ఉండగలవు. శత్రువులు మిత్రులుగా కనిపిస్తారు. అనారోగ్య సూచనలు కలిగి ఉన్నారు. చాలా సందర్భాలలో ఏదో ఒకరి వెంట వెళ్లుట జరుగును. ఏదైన ఒక రాయితి పొందుటకు అవకాశమున్నది. లక్ష్మీదేవి పూజలు చేయండి.

## కుంభరాశి
**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆకస్మిక సమస్యలు, అధికారుల భయం, దాడులు చాలా జాగ్రత్తలు తీసుకొనవలసిన రోజులు. ఈ దాడులు ఉద్యోగులపైన జరగవచ్చును. వ్యాపారస్తులపైన దాడులు ఏకకాలంలో ఉండగలవు. గజలక్ష్మి నారాయణులకు ప్రత్యేక పూజలు లేక సుదర్శన హోమం చేయండి.

## మీనరాశి
**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రయాణములలో జాగ్రత్తలు అవసరం. విందు వినోదములు ఉన్నవి. ధనము ఖర్చు చేస్తారు. కొన్ని జాగ్రత్తలు ఖర్చు విషయంలో ఆలోచన చేయండి. లక్ష్మీఅమ్మవారికి ప్రత్యేక పూజలు చేయండి. ఫలితం ఉంటుంది. అఖండ దీపారాధన చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. అష్టాక్షరిలో ఓం కారం ఏ వర్ణం?
2. వ్యాధుడి ప్రార్థనను మన్నించి దరి చేరిన నది ఏది?
3. సాయిరెడ్డి గారి భార్య సురేఖ గారి తల్లిగారి పేరేమిటి?
4. గోపికలు ఎంతమంది?
5. గంగ, యమున, సరస్వతులు ఎవరిని సేవించారు?
6. ఆషాఢ శుద్ధ ఏకాదశిని ఏమంటారు?
7. కౌత్సుని గురువు ఎవరు?
8. ఆదిశంకరుల వారు స్థాపించిన పీఠాలెన్ని? అవి ఏవి?
9. మంగళగౌరీ వ్రతం ఎన్ని సంవత్సరాలు చేసుకుంటారు?
10. జయదేవుని రచన ఏది?
11. నారాయణ తీర్థుల అసలు పేరేమిటి?
12. శుద్ధుని గురువు ఎవరు?
13. మహర్షు లను పరీక్షించిన శ్రీకృష్ణుని పుత్రుడు ఎవరు?
14. నాగ పంచమి ఎప్పుడు?
15. ఎవరు విదురునిగా జన్మించారు?

1. ......................................................................
2. ......................................................................
3. ......................................................................
4. ......................................................................
5. ......................................................................
6. ......................................................................
7. ......................................................................
8. ......................................................................
9. ......................................................................
10. ......................................................................
11. ......................................................................
12. ......................................................................
13. ......................................................................
14. ......................................................................
15. ......................................................................

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. నిర్జల ఏకాదశి, 2. శివుడు, 3. నప్పిన్నై, 4. భీముడు, 5.రుక్కమ్మ, 6. సూర్య చంద్రులకు, 7. కపిల మహర్షి, 8. 18, 9. కాకాసురుడు, 10. హిమవంతుని మనుమడు, 11. వాదిరాజు, 12. విష్వక్సేనుడు, 13. మధ్వ సంప్రదాయానికి, 14. వేదనారాయణ స్వామి, 15. కోడె పొంగలి

### సరైన సమాధానాలు రాసినవారు

ఎవ్వరూ సరైన సమాధానాలు రాయలేదు

పేరు: ____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________



RNI No.: APTEL/2008/23122
Postal Registration No: HSE/879/2025-2027
Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month
Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



If Un Delivered Please Return to:
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGIh6kVYyLq